Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



ఏలూరు ELURU | సంపుటి : 03 | సంచిక : 17 | గురువారం | నవంబర్ 19, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 17 | Thursday | 19 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

రాప్తాడు బాలిక ఒక ఫైటర్..

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ఆబాలిక ఒక ఫైటర్.. ఎంతో ధైర్యంగా ప్రాణాలతో పోరాడింది. ఇప్పుడు అదే ధైర్యంతో కోలుకుంటోంది. త్వరలోనే ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుంది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయితే మా బాధ్యత తీరిపోయినట్లు కాదు. తను పూర్తిగా కోలుకుని, మళ్లీ మునుపటిలా నవ్వుతూ, సంతోషంగా సాధారణ జీవితాన్ని గడిపే వరకు తనదే బాధ్యత అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రాప్తాడులో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిపై మంత్రి లోకేష్ ప్రత్యేకంగా ఆరా తీశారు.

›› త్వరలోనే కోలుకుని వస్తుంది : మంత్రి నారా లోకేష్

›› మానసికంగా, శారీరకంగా పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉంటానని మంత్రి భరోసా ›› త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్న వైద్యులు ›› బాలిక ఆరోగ్య పరిస్థితిపై మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లోకేష్ సమీక్ష ›› బాలిక ప్రాణాలు కాపాడిన వైద్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి



ఉండవల్లి నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్యంలో వస్తున్న మార్పులు, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స, డిశ్చార్జ్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా తెలుసుకున్నారు. బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు చెప్పడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

మా అమ్మాయి మళ్లీ నవ్వుతోంది..

నడుస్తోంది! : బాలిక ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని మణిపాల్ ఆసుపత్రి వైద్యులు మంత్రి లోకేష్‌కు వివరించారు. ప్రస్తుతం వెంటిలేటర్ అవసరం లేకుండానే శ్వాస తీసు కుంటోందని, ఆక్సిజన్ స్థాయిలు స్థిరంగా ఉన్నాయని తెలిపారు. నోటి ద్వారా ఆహారం తీసుకుంటోందని, ప్రధాన గాయాలు మానిపోయాయని చెప్పారు.

2 పేజీలో..

రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

›› 19 మంది మృతి!



సైబీరియా : రష్యాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. సైబీరియాలోని కెమెరోవో ప్రాంతంలో సైనిక రవాణా విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 19 మంది ప్రాణాలు కోల్పోయారని మంగళవారం రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రష్యాకు చెందిన ఎఎన్-12 సైనిక రవాణా విమానం కెమెరోవో ప్రాంతంలోని యగునోవో గ్రామ సమీపంలో కూలిపోయింది. జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.

2 పేజీలో..

ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటలను త్వరగా అదుపులోకి తీసుకొచ్చాయని, వైద్య సదుపాయాలు, హెలికాప్టర్‌ను అందుబాటులో ఉంచామని ప్రాంతీయ గవర్నర్ ఇల్యా సెరెడ్యుక్ తెలిపారు. విమాన ప్రమాదానికి

మత్స్యకారులకు అండగా నిలవండి



›› పరిహారం చెల్లించే ఏర్పాటు చేయండి ›› ఘటనపై ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం కె. పల్లెపాలెంలో అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మత్స్యకారులు షెడ్లలో ఉంచిన వలలు దగ్ధమైన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ప్రకాశం జిల్లా కలెక్టర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులంతా వలలు షెడ్లలో ఉంచుకోగా , అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించినట్లు కలెక్టర్ వివరించారు.

2 లో

అక్వాన్ తుపాను ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి..

ప్రజాభూమి ప్రతినిధి, కోటబొమ్మాళి : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉండటంతో శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు.



›› రైతులు పంట రక్షణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి ›› రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ›› కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై సమీక్ష.. ప్రజల భద్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

ఈ నెల 19,20వ తేదీ వరకు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. తుపాను పరిస్థితులపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి

2 పేజీలో..



బంగారం, వెండి ధరలు భారీ పతనం

14 నెలల కనిష్టానికి పసిడి!

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా తగ్గాయి. బుధవారం(నవంబర్ 18) ఉదయం ట్రేడింగ్‌లో పసిడి ధర 14 నెలల కనిష్ట స్థాయికి చేరువైంది. వెండి ధరలు కూడా భారీ నష్టాలను నమోదు చేశాయి. దీంతో బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది. బులియన్స్.కో.ఇన్ డేటా ప్రకారం..

- మిగతా 2లో..

మండల, జిల్లా పరిషత్‌ల తొలి సమావేశాల తేదీలు ఖరారు

›› ఈ నెల 19న మండల పరిషత్‌లు, 20న జిల్లా పరిషత్‌ల తొలి సమావేశాలు ›› సభ్యులు, కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్‌లు, వైస్‌చైర్‌పర్సన్‌ల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ : రాష్ట్రంలోని మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు సంబంధించి తొలి సమావేశాల నిర్వహణ తేదీలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేసింది. ఈ నెల 19వ తేదీన మండల ప్రజా పరిషత్‌లకు, 20వ తేదీన జిల్లా ప్రజా పరిషత్‌లకు తొలి సమావేశాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

2 లో

తుపాను ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!

›› 48 గంటల పాటు యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉండాలి ›› ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ›› హోంమంత్రి అనిత ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై హోంమంత్రి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రానున్న 48 గంటల పాటు రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని ఆమె ఆదేశించారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అక్వాన్ తుపాను మందగమనంతో గంటకు కేవలం 8 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అధికారులు హోంమంత్రికి వివరించారు. ఎల్లుండి మధ్యాహ్నానికి శ్రీకాకుళం- దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో తీరాన్ని దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేశారు.



తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. తుపాను అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 13 జాతీయ విపత్తు స్పందన దళాలు, 11 రాష్ట్ర

2 పేజీలో..



అక్వాన్ తుపానుపై విద్యుత్ శాఖ అప్రమత్తం

›› నెల్లూరు నుంచి విశాఖ వరకు ప్రత్యేక నిఘా ›› 120 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ›› ముందస్తు చర్యలకు మంత్రి గొట్టిపాటి ఆదేశం ›› సిబ్బంది,సామాగ్రి కోసం తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రికి గొట్టిపాటి లేఖ

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : అక్వాన్ తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు తీర ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తుపాను ప్రభావంతో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున, విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ మేరకు మూడు డిస్కంల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తుపాను తీవ్రత దృష్ట్యా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. అదనపు సిబ్బంది అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు వెల్లడించారు. అర్నాబ్, మురసు తుపానుల సమయంలో ఎదురైన

2 పేజీలో..



పోలీసుల కాల్పుల్లో లష్కరే ఉగ్రవాది మృతి

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో లష్కరే తొయిబా ఉగ్రవాది లతీఫ్ భట్ (22) బుధవారం భద్రతా దళాల కాల్పుల్లో మరణించాడు. జంగల్‌పోరాలోని ఓ మసీదులో దాక్కున్న అతడిని లొంగిపోవాలని పోలీసులు కోరారు. అయితే అతను నిరాకరించడంతో ఆపరేషన్ చేపట్టారు. మసీదు పవిత్రతకు భంగం కలగకుండా అత్యంత సంయమనంతో వ్యవహరించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. గత నవంబరు నుండి భట్ ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారని అన్నారు.

›› వివరాలు 2లో..

ప్రజాభూమి
గురువారం, నవంబర్ 19, 2026

సంపాదకీయం

ధరల మోత

ద్రవ్యోల్బణం అంటే చట్టం చేయకుండానే విధించే పన్ను అన్నారు అమెరికన్ ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రీడ్‌మన్. నేటి పరిస్థితులను చూస్తే ఆ మాట అక్షర సత్యమనిపిస్తుంది. అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతానికి చేరి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన గరిష్ఠ పరిమితిని దాటేసింది.? 2024 అక్టోబర్‌లో నమోదైన 6.21 శాతం తర్వాత ఇదే అత్యధికం. గృహ వినియోగ ఖర్చులపై పెరుగుతున్న ఒత్తిడికి ఇది స్పష్టమైన సంకేతం. ఇందులో ప్రధానమైంది అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలు. ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.74 శాతం ఉండగా అక్టోబర్‌లో 8.94 శాతానికి ఎగబాకింది. దీంతో సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుంది. ఎన్ఎస్ఒ గణాంకాల ఆధారంగా, బియ్యం (12.5 శాతం), చిరుధాన్యాలు (38 శాతం), ఉల్లి (116 శాతం), పప్పుధాన్యాలు, వంటనూనెలు, మసాలాలు ఇలా అనేకం పెరిగాయి. ధరల్లో వచ్చిన భారీ పెరుగుదల సామాన్య కుటుంబాల ఆర్థికతను నేరుగా దెబ్బతీస్తోంది. మాంసం, చేపలు, గుడ్లు వంటి ప్రోటీన్ ఆహారాల ధరలూ అధికంగానే ఉన్నాయి. అలాగే, వాణిజ్య ఎల్‌పిజి ధర గత నెలలో సిలిండర్‌కు రూ.62.5 పెరగడంతో రెస్టారెంట్లు, వసతి సేవల ధరలు 10 శాతం మేర పెరిగాయి. అమెరికా, ఇరాన్ ఘర్షణతో సరఫరా గొలుసులు దెబ్బతిని, ముడి పదార్థాల ధరలు పెరిగాయి. కార్ల తయారీదారులు, వినియోగ వస్తువులు, ఎఫ్ఎంసిజి సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులపైకి నెట్టేస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల రెక్కాడితే కానీ డొక్కాడని జనం జీవితాలను నేరుగా కుదిపేస్తోంది. ఆదాయంలో పెద్ద భాగం ఆహారం, ఇంధనం, రవాణా, విద్యుత్ వంటి అవసరాలకే ఖర్చవుతుండటంతో, వాటి ధరలు పెరిగినప్పుడు కుటుంబాలు ఇతర ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుంది. తక్కువ ఆదాయ కుటుంబాలు పౌష్టికాహారాన్ని తగ్గించుకోవడం లేదా వైద్యం, విద్య వంటి అవసరాలను వాయిదా వేస్తూ బతుకీడుస్తున్నాయి. పాడుపు చేయడం మాట అటుంచి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ధరాభారం కుటుంబాల ఆర్థిక భద్రతను, జీవన ప్రమాణాలను కూడా దెబ్బతీస్తుంది. ఆర్‌బిఐ అక్టోబర్‌లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, తక్కువ వడ్డీ రేట్ల శకం ముగిసిందని స్పష్టం చేసింది. రెపో రేటు ప్రస్తుతం 5.5 శాతం ఉండగా, రాబోయే నెలల్లో మరో 50 నుంచి 75 బేసిస్ పాయింట్లు పెరిగి 6.25 శాతానికి చేరవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. డిసెంబర్‌లో పెంపు దాదాపు ఖాయమని భావిస్తున్నారు. బ్యారెల్ చమురు 100 డాలర్లకు చేరువలో ఉంది. రుణ వ్యయం పెరిగితే గృహ, వాహన, చిన్న పరిశ్రమల రుణాలు భారమవుతాయి. గ్రామీణ వినియోగంపై దెబ్బ పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రూపాయి విలువ రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. ఈ ఏడాది విదేశీ పెట్టుబడిదారులు 30 బిలియన్ డాలర్లకు పైగా వెనక్కి తీసుకున్నారు. ఈ పరిస్థితిని చక్కబెట్టేందుకు రిజర్వ్ బ్యాంక్‌కు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం అత్యవసరం. వడ్డీ రేట్లు పెంచితే రుణాల ఖర్చు పెరుగుతుంది. వినియోగం, పెట్టుబడులూ తగ్గే ప్రమాదమూ లేకపోలేదు. ఇప్పటికే ధరల భారాన్ని మోస్తున్న కుటుంబాలకు గృహ, వాహన, చిన్న వ్యాపార రుణాల వాయిదాలు మరింత భారమవుతాయి. ఆర్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు ఒక్కటే పరిష్కారమని భావించడం సరికాదు. ఆహార ధరలను స్థిరపర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల సరఫరా, నిల్వలు, రవాణా, మార్కెట్ వ్యవస్థపై తక్షణ చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట నిల్వల విడుదల, రైతులకు సరైన ప్రోత్సాహం, పంట నష్టాలకు ఉపశమన చర్యలు, ధరలపై పారదర్శక సమాచారం వంటివి పాలకులు అమలుచేయాలి. తక్కువ వర్షపాతం ప్రభావాన్ని తగ్గించేందుకు నీటి నిర్వహణ, పంట వైవిధ్యం, వాతావరణ అనుకూల వ్యవసాయానికి, దీర్ఘకాలిక పెట్టుబడులకూ ప్రాధాన్యతనివ్వాలి. అమృత కాలమని ఎంత ప్రచారం చేసుకున్నా, వృద్ధి ప్రయోజనం ప్రజల కొనుగోలు శక్తిలో కనిపించాలి. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే బాధ్యత రిజర్వ్ బ్యాంక్‌ది అయితే, దాని మూలకారణాలను పరిష్కరించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది. ధరల అదుపు పేరుతో భారాన్నంతా వడ్డీ రేట్లు, రుణ వాయిదాల రూపంలో ప్రజలపైకి నెట్టకుండా, సరఫరా సమస్యలకు సమన్వయంతో పరిష్కారం చూపాలి. జీవన వ్యయం పెరుగుతున్న తరుణంలో ప్రజల ఆహార భద్రత, కొనుగోలు శక్తి, ఉపాధిని పెంచడమే ఆర్థిక విధానాల లక్ష్యం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఒకట్రెండు సరుకులే అందించి అదే సర్వస్వం అన్నట్లు ప్రచారం చేసుకుంటుంది. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి, బియ్యం లేదా గోధుమలకే పరిమితం కాకుండా పప్పులు, వంటనూనె వంటి 14 రకాల నిత్యావసరాలను ప్రజలకు అందించాలి. ప్రతి కుటుంబానికీ అవసరమైన సరుకులు అందుబాటులో ఉండటం, వాటిని కొనగల ఆదాయం ఉండటం, ఇవే అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి అసలైన కొలమానాలు.

రాష్ట్రాడు బాలిక ఒక ఫైటర్..

మొదటి పేజీ తరువాయి

కుట్లు తొలగించామని, చిన్నపాటి గాయాలకు చికిత్స కొనసాగుతోందని వివరించారు. బాలిక ఇప్పుడు ఇతరుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోందని, గతంతో పోలిస్తే ఎక్కువ అడుగులు వేస్తోందని తెలిపారు. కుడిచేత్తో నీళ్ల గ్లాసు పట్టుకునే స్థాయికి చేరుకుందని, పెన్ను పట్టుకుని రాయడానికి అవసరమైన శిక్షణ కూడా ప్రారంభించామని చెప్పారు. గతంలో జరిగిన విషయాలను గుర్తుచేసుకోగలుగుతోందని వివరించారు. రెండు రోజుల క్రితం నవ్వమని అడిగితే ఆ అమ్మాయి నవ్వింది. ఆ నవ్వు చూసి మాకెంతో సంతోషం కలిగింది. తనలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. బాలిక నిజంగా ఒక ఫైటర్ అని వైద్యులు చెప్పడంతో మంత్రి లోకేష్ భావోద్వేగానికి లోనయ్యారు.

డిశ్చార్జ్‌తో మా బాధ్యత ముగియదు!

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. “ఆ అమ్మాయి మన బిడ్డ. తను ఎదుర్కొన్న బాధను మాటల్లో చెప్పలేం. ఇంత చిన్న వయసులో అంతటి బాధను అనుభవించినా ఎంతో ధైర్యంగా పోరాడింది.

తనను మళ్లీ మామూలు జీవితంలోకి తీసుకురావడమే మనందరి లక్ష్యం. శారీరక గాయాలు మానిపోయినా, మనసుకు తగిలిన గాయం నుంచి బయటపడటానికి సమయం పడుతుంది. అందుకే తనకు వైద్యంతో పాటు ప్రేమ, ఆప్యాయత, మానసిక ధైర్యం కూడా అందించాలి” అని అన్నారు. తను మళ్లీ స్వేచ్ఛగా నడవాలి. తన చేతులతో రాయాలి. తోటి పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలి. తన కలలను నెరవేర్చుకునేలా ఎదగాలి. అందుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తాం. తను పూర్తిగా కోలుకునే వరకు తన బాధ్యత నేను తీసుకుంటాను. ఆ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటాను అని మంత్రి భరోసా ఇచ్చారు.

ఇంటికి వెళ్లాక కూడా బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలి

బాలిక త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే దశకు చేరుకుంటోందని వైద్యులు తెలిపారు. అయితే డిశ్చార్జ్ తర్వాత కూడా పునరావాస చికిత్స, మానసిక మద్దతు, అవసరమైన తదుపరి శస్త్రచికిత్సలు కొనసాగించాల్సి ఉంటుందని వివరించారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. బాలిక ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వైద్య సంరక్షణలో ఎలాంటి లోటు ఉండకుండా ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా మానసిక వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచుతామని, అనంతపురం సర్వజన ఆసుపత్రి సహకారంతో పునరావాస చికిత్స కోసం ప్రత్యేక థెరపిస్ట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్థోపెడిక్ చికిత్స, ఫిజియోథెరపీ, భవిష్యత్తులో అవసరమయ్యే శస్త్రచికిత్సలపై మణిపాల్ వైద్యులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఇంటి వద్ద ఎలాంటి ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారాలకు సూచించారు.

ప్రాణాలు కాపాడిన మీ అందరికీ రుణపడి ఉంటాం :

బాలిక ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన మణిపాల్ ఆసుపత్రి వైద్య బృందానికి మంత్రి లోకేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “మీరు కేవలం వైద్యం చేయలేదు. ఒక చిన్నారి ప్రాణాలను కాపాడారు. ఒక కుటుంబంలో మళ్లీ ఆశలు చిగురించేలా చేశారు. ఆ బిడ్డ మళ్లీ నవ్వుతోందంటే మీ అందరి కృషే కారణం. మీ సేవలను ఎప్పటికీ మర్చిపోలేం” అని వైద్యులను అభినందించారు. అనంతపురంలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. బృందంలోని ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఒక డాక్టర్ బాలికతో తెలుగులో మాట్లాడుతూ ఆమెకు, తల్లిదండ్రులకు ధైర్యం కల్పిస్తున్నారని వైద్యులు తెలిపారు. బాలిక కోలుకుంటున్న తీరు పట్ల తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారని, మొదటి నుంచీ శ్రద్ధ తీసుకుంటున్న మంత్రి లోకేష్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారని వివరించారు.

మండల, జిల్లా పరిషత్‌ల తొలి సమావేశాల తేదీలు ఖరారు

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (MPTC), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ZPTC) రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తిచేసి ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు.

అనంతరం మండల పరిషత్‌ల కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక కోసం నవంబర్ 19న, జిల్లా పరిషత్‌ల కో-ఆప్టెడ్ సభ్యులు, చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌ల ఎన్నిక కోసం నవంబర్ 20న ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు. 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్లు 153(3), 181(4) ప్రకారం సాధారణ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం ఎన్నికైన సభ్యులతో మండల, జిల్లా పరిషత్‌ల తొలి సమావేశాలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌ల ఎన్నిక చేపట్టాల్సి ఉంటుందని వివరించారు.

అదేవిధంగా, ఈ చట్టంలోని సెక్షన్లు 153(5), 154(ii), 181(6), 182(ii) ప్రకారం మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికైన సభ్యులు, కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్‌లు, వైస్‌చైర్‌పర్సన్‌ల ఐదేళ్ల పదవీకాలం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్ణయించిన తొలి సమావేశం తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఖతో పాటు 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ నవంబర్ 19, 2026ను మండల ప్రజా పరిషత్‌ల తొలి సమావేశ తేదీగా, నవంబర్ 20, 2026ను జిల్లా ప్రజా పరిషత్‌ల తొలి సమావేశ తేదీగా నిర్ణయిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఈ తేదీల నుంచే సంబంధిత మండల, జిల్లా పరిషత్‌ల ప్రజాప్రతినిధుల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభమవుతుందని నిర్వహించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

అక్వాన్ తుపాను ప్రభావంపై

అప్రమత్తంగా ఉండాలి..

ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పునరావాస కేంద్రాలు, కంట్రోల్ రూములను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

రైతులు పంటల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల సూచనల నేపథ్యంలో రైతులు ప్రస్తుతం చేపడుతున్న వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యాన్ని కుప్పలుగా చేర్చి, వర్షపు నీరు చేరకుండా, పంట తడవకుండా టార్పాలిన్లు, ఇతర కవర్లతో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ వ్యవసాయ పనుల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్, , విద్యుత్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రహదారులపై చెట్లు కూలినప్పుడు వెంటనే తొలగించేలా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు.పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, మందులు వంటి నిత్యావసరాలను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులు కూడా పంటల రక్షణకు ప్రాధాన్యమిస్తూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

సాంకేతిక లోపమే కారణమై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై రష్యా విమానయాన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. విమానంలో ఏదైనా సరుకు ఉందా? అనే విషయం మాత్రం ఇంకా తెలియరాలేదు. కాగా, విమాన ప్రమాదానికి సంబంధించిన సిసిటివి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆకాశం నుంచి మండుతూ వస్తువు వేగంగా కిందకు పడిపోవడం, ఆ వెంటనే భారీ పేలుడు సంభవించినట్లు ఆ దృశ్యాల్లో కనిపించింది. పేలుడు ధాటికి పరిసర ప్రాంతంలో ఒక్కసారిగా మంటలువ్యాపించాయి. ఎఎన్-12 అనేది సోవియట్ యూనియన్ కాలంలో రూపొందించిన నాలుగు ఇంజిన్ల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. ఈ విమానాలను ప్రధానంగా సైనికులు, ఆయుధాలు, భారీ పరికరాలు, ఇతర సరుకుల రవాణాకు ఉపయోగిస్తారు. వివిధ రకాల విమానాశ్రయాల నుంచి కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం ఈ విమానాలకు ఉంది. రష్యా సైన్యం వీటిని సైనిక రవాణాతో పాటు సెర్చ్ అండ్ రెస్క్యూ కార్యకలాపాల్లోనూ వినియోగిస్తోంది.

అక్వాన్ తుపానుపై విద్యుత్ శాఖ అప్రమత్తం



అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అక్వాన్ తుపాను సహాయక చర్యలకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయినా, సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. శాఖాపరమైన నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి నష్టం జరగడానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా విద్యుత్ సిబ్బంది పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినా, తుపాను కారణంగా అంతరాయం ఏర్పడినా వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.

మత్స్యకారులకు అండగా నిలవండి

మొత్తం 250 నుంచి 300 వరకు వలలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రివర్యులు దిశా నిర్దేశం చేశారు. తుపాను కారణంగా వేట విరామం ఉండడం, వలలు కాలిపోవడంతో మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా బాధిత కుటుంబాలకు తక్షణమే నిత్యావసర సరుకులు అందజేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. నష్టపరిహారం అందించాలని, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన 2.ా పథకం కింద నష్టపోయిన వలలను తిరిగి అందించే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వలలు నష్టపోయిన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు.

ఆర్థిక విపత్తు అంచున భారతదేశం : రాహుల్‌గాంధీ

న్యూయార్క్ : తీవ్రమైన నిరుద్యోగం, దెబ్బతిన్న ఉత్పాదక రంగం, విద్యా వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన సమస్యలతో భారతదేశం “ఆర్థిక విపత్తు” అంచున ఉందని లోక్‌సభ ప్రతిపక్ష? నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక విధానంలోనే కొనసాగితే దేశం తీవ్ర ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఉదయం న్యూయార్క్‌కు చేరుకున్న రాహుల్‌గాంధీ కొలంబియా యూనివర్శిటీలోని వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ముఖాముఖీ చర్చలో మాట్లాడారు. భారతదేశ ఆర్థిక విధానం సుమారు దశాబ్దం కిందటి నుండే ఫలితాలు ఇవ్వడం లేదని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఉన్న రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని పునరుద్ధరించడంలో ‘మేక్ ఇన్ ఇండియా’, ‘స్టార్టప్ ఇండియా’ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. వాస్తవంగా చెప్పాలంటే .. భారతదేశం ఆర్థిక విపత్తు అంచున ఉందని, వాస్తవం ఇదేనని అన్నారు. ఎవరైనా దీన్ని విస్మరించవచ్చని, మీడియా కూడా దీన్ని పక్కన పెట్టవచ్చని అన్నారు. కానీ, భారత్‌లో తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఉందని, అలాగే, విద్యా వ్యవస్థలో కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయని అన్నారు. చిన్న మరియు మధ్యతరహా వ్యాపారాలు, వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తాయని, ఉపాధి కల్పనలో ఇవి కీలకమని పేర్కొన్నారు. దేశంలోని తయారీ రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ వెన్నెముక విరిగిపోయిందని అన్నారు. సేవల ద్వారా మీరు తగినంత మందికి ఉద్యోగాలు ఇవ్వలేరని, అది సాధ్యం కాదని అన్నారు. సేవల ద్వారా కేవలం 1 నుండి 5శాతం మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలరని అన్నారు. మనకు తయారీ రంగం అవసరం లేదని ప్రాథమికంగా నిర్ణయించుకున్నామని ఎద్దేవా చేశారు. భారత్‌లో ప్రైవేట్ పెట్టుబడులు ఎందుకు లేవని ప్రశ్నించారు. గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీలతో సహా కేవలం కొన్ని పెద్ద వ్యాపార సమూహాలు మాత్రమే విస్తరిస్తుండగా, చిన్న వ్యాపారాలు మాత్రం ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. టాటాను అదానీ ఎందుకు స్వాధీనం చేసుకుంటున్నారని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో శ్రమతో నిర్మించిన ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని విమర్శించారు. బలమైన ఉత్పాదక రంగం లేకుండా భారతదేశం విజయవంతంగా అభివృద్ధి చెందలేదని చెబుతూ, దానిని పునర్నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్పాదక రంగం లేకుండా విజయవంతంగా మనుగడ సాగించలేమని, అది సాధ్యం కాదని పునరుద్ఘాటించారు.

తుపాను ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!

విపత్తు స్పందన దళాలతో పాటు స్థానిక అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక బృందాలను తక్షణమే రంగంలోకి దింపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రాలు నిరంతరం 24 గంటల పాటు పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సహాయం కోరే సమాచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారు.

తీర ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హోంమంత్రి సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అధికారులు సూచిం చిన వెంటనే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. వర్షాలు, బలమైన ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో పనిచేసే సమయంలో వాతావరణ



పరిస్థితులను గమనిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం, చెట్లు కూలిపోవడం, రహదారులపై నీరు నిలవడం వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయినా, విద్యుత్ తీగలు తెగిపడినా వాటి సమీపానికి వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు అధికారికంగా జారీ చేసే వాతావరణ హెచ్చరికలను మాత్రమే విశ్వసించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే నిర్ధారణలేని వార్తలు, వదంతులను నమ్మవద్దని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని హోంమంత్రి సూచించారు. విద్యుత్ అంతరాయం, చెట్లు కూలడం, నీటి నిల్వలు, ఇతర సమస్యలపై ‘మన మిత్ర’ వాట్సాప్ నంబరు 9552300009కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ప్రతి సందర్భంలో స్థానిక అధికారులను సంప్రదించాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి చేశారు. తుపాను ముప్పు పూర్తిగా తొలగిపోయే వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు.

బంగారం, వెండి ధరలు భారీ పతనం

ఉదయం 9:06 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు ఏకంగా రూ.2,540 తగ్గి రూ.1,32,300కు చేరింది.

22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,21,275గా నమోదైంది. మరోవైపు వెండి ధర కూడా భారీగా పడిపోయింది. 999 స్వచ్ఛత కలిగిన వెండి కిలో ధర రూ.4,940 తగ్గి రూ.1,65,400కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి, వెండి ధరలు నష్టాల్లోనే కొనసాగాయి. ట్రేడింగ్‌వ్యూ డేటా ప్రకారం.. ఉదయం 9:07 గంటల సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం ఔన్స్ ధర 1.35 శాతం తగ్గి సుమారు 3,797 డాలర్ల వద్ద ట్రేడయింది. స్పాట్ వెండి ఔన్స్ ధర 2.67 శాతం క్షీణించి సుమారు 46 డాలర్లకు చేరింది. బంగారంలో 24 క్యారెట్లు అత్యంత స్వచ్ఛమైనవి కాగా, 22 క్యారెట్ల బంగారాన్ని సాధారణంగా ఆభరణాల తయారీలో ఉపయోగిస్తారు. వెండిలో 999 స్వచ్ఛత కలిగిన వెండిని నాణేలు, కడ్డీల తయారీకి వినియోగిస్తారు. 925 స్వచ్ఛత కలిగిన వెండిని ఎక్కువగా ఆభరణాల తయారీలో ఉపయోగిస్తారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పతనం, దేశీయ మార్కెట్‌లోనూ ప్రతిబింబించడంతో విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. రానున్న రోజుల్లో ధరల కదలికలు ఎలా ఉంటాయన్నది మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

పోలీసుల కాల్పుల్లో లష్కరే ఉగ్రవాది మృతి

ఇటీవల సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో దాడితో పాటు పలు దాడుల్లో పాల్గొన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతనిపై రూ.15 లక్షల రివార్డు కూడా ఉందని అన్నారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని సైన్యం తెలిపింది.



ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
గురువారం, నవంబర్ 19, 2026



1977 నవంబర్ 19 కాళరాత్రి.. సముద్రపు పోటుకు నేలమట్టమైన పల్లెలు 49 ఏళ్లు గడిచినా దివిసీమ గుండెల్లో చెరిగిపోని కన్నీటి జ్ఞాపకాలు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

ఒక్క రాత్రి.. వేలాది కుటుంబాల్లో తీరని శోకం. ఉగ్రరూపం దాల్చిన సముద్రం.. క్షణాల్లో కనుమరుగైన పల్లెలు. కళ్లముందే కొట్టుకుపోయిన ఇళ్లు, పశువులు.. ఆప్తులను కోల్పోయి అనాథలైన ప్రజలు. ప్రకృతి ప్రకోపం ఎంత భయంకరంగా ఉంటుందో యావత్ దేశానికి చాటిచెప్పిన మహా విషాదం దివిసీమ ఉప్పెన. 1977 నవంబర్ 19న కృష్ణా జిల్లా తీర ప్రాం తాన్ని కుదిపేసిన ఈ పెను విపత్తు భారతదేశ చరిత్రలోనే అత్యంత ఘోర మైన ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటిగా నిలిచిపో యింది. దాదాపు ఐదు దశాబ్దాలు గడుస్తున్నా ఆ నాటి విషాద ఛాయలు దివిసీమ ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిగిపోలేదు.

బంగాళాఖాతంలో పుట్టిన పెను తుపాను

1977 నవంబర్ మధ్యలో బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను క్రమంగా తీవ్రరూపం దాల్చింది. నవంబర్ 19న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకిన ఈ తీవ్ర తుపాను ప్రచండ గాలులు, భారీ వర్షాలు, భీకరమైన సముద్రపు అలలతో తీరప్రాం తాలపై విరుచుకుపడింది. తుపాను గాలులకంటే సముద్రపు పోటు సృష్టించిన విధ్వంసమే అపా రమైన ప్రాణనష్టానికి కారణమైంది. చారిత్రక అధ్యయనాల ప్రకారం, దివిసీమ, మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు మీటర్ల ఎత్తు వరకు సముద్రపు పోటు ఎగిసిపడినట్లు నమో దైంది. తీరాన్ని ఆనుకుని ఉన్న లోతట్టు గ్రామా ల్లోకి సముద్రపు నీరు వేగంగా చొచ్చుకువచ్చిం ది. ప్రజలు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే వరద గ్రామాలను చుట్టు ముట్టింది. పూరిళ్లు, గుడిసెలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. చెట్లు నేలకొరిగాయి. విద్యు త్ స్తంభాలు విరిగిపో యాయి. పశువులు, పడవ లు, వలలు సముద్రం పాలయ్యాయి. నిద్రలో ఉన్నవారికి ప్రాణాలు కాపాడుకునే అవకాశం కూడా దక్కని పరిస్థి తులు నెలకొన్నాయి.

కోడూరు, నాగాయలంక మండలాల్లో విలయతాండవం

కృష్ణా జిల్లా దివిసీమ ప్రాంతం ఈ విపత్తుకు అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. కోడూరు, నాగాయలంక మండలాల పరిధిలోని అనేక తీరప్రాంత గ్రామాలు ఉప్పెన ధాటికి అతలాకుత లమయ్యాయి. పాలకాయతిప్ప, హంసలదీవి, ఉల్లిపాలెం, సోర్లగొంది, ఏటిమొగ, ఎదురు మొం డి తదితర ప్రాంతాల్లో భారీ విధ్వంసం చోటుచే సుకుంది.మత్స్యకార గ్రామాల్లో నివ సించే ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. సముద్రం పైనే ఆధారపడి జీవించే కుటుంబాలు పడవలు, వలలు, నివాసాలు కోల్పోయాయి. వ్యవసాయ భూముల్లోకి ఉప్పునీరు చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. వందలాది కుటుంబాలు తమ ఇళ్లను, ఆస్తులను కోల్పోయి నిరాశ్రయులయ్యా యి. కొన్ని ప్రాంతాల్లో గ్రామాల రూపు రేఖలే మారిపోయాయి. వరద తగ్గిన తర్వాత ఎక్కడ చూసినా శిథిలాలు, ఇసుక మేటలు, కొట్టుకువ చ్చిన చెట్లు, పశువుల కళేబరాలు కనిపించాయి.

సుమారు పది వేల మంది మృత్యువాత

దివిసీమ ఉప్పెనలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివిధ చారి త్రక నివేదికలు అంచనా వేశాయి. కృష్ణా జిల్లా లోనే వేలాది మంది మరణించినట్లు నమో దైంది. సముద్రపు పోటు ధాటికి పెద్ద సంఖ్యలో పశువు లు మృత్యువాత పడ్డాయి. లక్షలాది ఇళ్లు దెబ్బతి న్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు నాశనమ య్యాయి. మత్స్యకారుల జీవనాధారమైన పడవ లు, వలలు కొట్టుకుపోయాయి. రహదా రులు, చెరువులు, నీటిపారుదల వ్యవస్థలు, ప్రజా ఆస్తు లకు భారీ నష్టం వాటిల్లింది.నాటి నివేదికల్లో ఆస్తి నష్టం విలువను అప్పటి లెక్కల ప్రకారం సుమా రు రూ.172 కోట్లుగా పేర్కొన్నారు. అయి తే ఆ కాలంలో సమాచార వ్యవస్థలు, రవాణా సౌక ర్యాలు దెబ్బతినడం, అనేక ప్రాంతా లకు వెంటనే చేరుకోలేకపోవడం వల్ల ప్రాణన ష్టం, ఆస్తి నష్టానికి సంబంధించిన గణాంకాల్లో వేర్వే రు అంచ నాలు కనిపిస్తాయి. అయినప్పటికీ వేలా ది కు టుం బాలను ఛిన్నాభిన్నం చేసిన ఘోర విప త్తు గా దివిసీమ ఉప్పెన చరిత్రలో నిలిచిపోయిం ది.

ఆర్తనాదాలతో నిండిన తీరప్రాంతం

ఉప్పెన అనంతరం దివిసీమలో హృదయవిదా రక దృశ్యాలు కనిపించాయి. తమ కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, జీవిత భాగస్వాములను కోల్పో యిన వారు పడిన వేదన వర్ణనాతీతం. అనేక కుటుం బాల్లో మిగిలింది కన్నీరు, జ్ఞాపకాలే. మృతదేహాలను గుర్తించడం, అంత్యక్రియలు నిర్వహిం చడం, గల్లంతైన వారి ఆచూకీ తెలుసు కోవడం పెద్ద సవాలుగా మారింది. వరద నీరు కలుషితం కావడంతో తాగునీటి సమస్యలు తలెత్తాయి. ఆహారం, మందులు, దుస్తులు, తాత్కాలిక ఆశ్రయం కోసం బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రకృతి విపత్తు తర్వాత కూడా ఆకలి, అనారోగ్యం, నిరాశ్రయత ప్రజలను వెంటాడాయి.

సహాయక చర్యలకు ముందుకొచ్చిన ప్రజలు

విపత్తు తీవ్రత వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. అధికారులు, పోలీసులు, వైద్య సిబ్బం ది, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు బాధితు లకు అండగా నిలిచాయి. ఆహారం, తాగునీరు, మందులు అందించడం, నిరాశ్రయులకు ఆశ్ర యం కల్పించడం, మృతదేహాలకు అంత్యక్రి యలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేప ట్టారు.అప్పటి మంత్రి మండలి వెంకట కృష్ణా రావు దివిసీమ ప్రాంతానికి చెందిన ప్రజా నా యకుడిగా బాధితులను ఆదుకునే కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసేవకులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గ్రామాల పునర్నిర్మాణం, బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించడం, జీవనోపాధిని తిరిగి నిలబెట్టడం వంటి పనులు అనంతర కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

విపత్తు నిర్వహణకు మేలుకొలుపు

దివిసీమ ఉప్పెన ప్రకృతి వైపరీత్యాల సమ యంలో ముందస్తు హెచ్చరికలు, ప్రజలను సుర క్షి త ప్రాంతాలకు తరలించడం, తీరప్రాంత రక్షణ ఏర్పాట్లు ఎంత అవసరమో స్పష్టంగా తెలి యజేసింది. తుపాను సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే వారిని ముందుగానే తరలించడం, సురక్షిత ఆశ్రయ కేంద్రాలు సిద్ధం చేయడం వంటి అంశాల ప్రాధాన్యం ఈ విషాదం తర్వాత మరింతగా చర్చకు వచ్చింది.నేడు వాతావరణ అంచనాలు, ఉపగ్రహ పరిశీలనలు, తుపాను హెచ్చరికల వ్యవస్థలు, విపత్తు స్పందన బృం దాలు గతంతో పోలిస్తే ఎంతో అభివృద్ధి చెందా యి. అయినప్పటికీ తీరప్రాంత ప్రజలు అప్రమ త్తంగా ఉండటం, అధికారుల సూచనలను పాటించ డం, ముందస్తు తరలింపులకు సహక రించడం అత్యంత కీలకం. ప్రకృతి విపత్తును పూర్తిగా నివారించలేకపోయినా, సమర్థమైన సంసిద్ధతతో ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించ వచ్చని దివిసీమ చరిత్ర మనకు గుర్తుచేస్తోంది.

తరాలు మారినా.. మానని గాయం

కాలం గడిచింది. గ్రామాలు తిరిగి నిలదొక్కుకు న్నాయి. కొత్త తరాలు పెరిగాయి. కానీ 1977 నవంబర్ 19న సంభవించిన దివిసీమ ఉప్పెన జ్ఞాపకాలు మాత్రం ఆ నేల ప్రజల మనసుల్లో చెర గని ముద్రగా మిగిలిపోయాయి. ఆ విషాదాన్ని ప్రత్యక్షంగా చూసినవారు నేటికీ ఆనాటి భయానక దృశ్యాలను గుర్తుచేసుకుంటుంటారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఆ రోజు ఎప్పటికీ మరిచిపోలేని కాళరాత్రిగానే మిగిలింది.దివిసీమ ఉప్పెన కేవలం గత చరిత్ర కాదు. ప్రకృతిని తక్కువగా అంచనా వేయకూడ దని, విపత్తుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఆపదలో ఉన్నవారికి మానవత్వంతో అండగా నిలవాలని చెప్పే గుణపాఠం.దివిసీమ ఉప్పెనలో ప్రాణాలు కోల్పోయిన వేలాది మందికి ఘన నివాళులు. వారి జ్ఞాపకాలను పదిలపరుచు కుంటూ, భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల వల్ల ప్రాణనష్టం జరగకుండా సమాజం, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగడమే వారికి అర్పించే నిజమైన నివాళి.

వంగవీటి రాధాకృష్ణకు రాధా రంగా మిత్రమండలి ఘన సత్కారం

✧విజయవాడ కార్పొరేషన్‌లో విజయం సాధించిన ఐదుగురు జనసేన కార్పొరేటర్లకు అభినందనలు

విజయవాడ, ప్రజాభూమి ప్రతినిధి:



కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా తన యుడు, జనసేన పార్టీ నాయకుడు వంగ వీటి రాధాకృష్ణ బాబును రాధా రంగా మిత్ర మండలి నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విజ యవాడ లోని రాధా కృష్ణ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షులు, జనసేన నాయకులు బుల్లెట్ ధర్మారావు, మహిళా కమిటీ సభ్యుల ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాధాకృష్ణకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.తిరుపతికి చెందిన రాధా రంగా మిత్రమండలి నాయకుడు పొర్లు దండాల ఈశ్వర్ తన మిత్రబృందంతో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదం, క్యాలెండర్‌ను రాధాకృష్ణకు అందజేశారు. నెల్లూరు జిల్లా రాధా రంగా మిత్రమండలి గౌరవాధ్య క్షుడు పప్పు లక్ష్మీనారాయణ, చెన్ను శివప్రసాద్ తమ బృందంతో కలిసి రాధాకృష్ణను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పాత మాజేరు గ్రామానికి చెందిన రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు అంబుల రంగసాయి కూడా తన మిత్రబృందంతో పాల్గొని అభినందనలు తెలియజేశారు.

విజేతలైన ఐదుగురు జనసేన కార్పొరేటర్లకు సత్కారం



విజయవాడ నగరపాలక సం స్థ ఎన్నికల్లో విజయం సాధిం చిన ఐదుగురు జనసేన పార్టీ కార్పొరేటర్లను ఈ సంద ర్భం గా ఘనంగా సత్కరిం చారు. 28వ డివిజన్ కార్పొరేటర్ కొవ్వూరి కిరణ్ బాబు, 29వ డివిజన్ కార్పొరేటర్ పోతిరెడ్డి అనిత, 36వ డివిజన్ కార్పొ రేటర్ ఏలూరి శరత్, 43వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం కనకదుర్గ, 45వ డివిజన్ కార్పొరేటర్ అత్త లూరి కళ్యాణిలను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ ధర్మారావుతో పాటు ఆకారపు విజయకుమారి, మల్లాడి రాజేష్, వెన్న శ్రీనివాస్, కొప్పినేటి శివమణి, లంకా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. రాధా రంగా మిత్రమండలి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాధాకృ ష్ణతో పాటు విజయం సాధించిన కార్పొరేటర్లకు అభినందనలు తెలిపారు.

చల్లపల్లి ఎంపీపీగా విజయలక్ష్మి పేరు ఖరారు

✧ప్రకటించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్✧విజయలక్ష్మి - నాంచారయ్య దంపతుల ఆధ్వర్యంలో వంద కుటుంబాలు జనసేనలోకి చేరికలు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

చల్లపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలిగా మట్టా కనక విజయలక్ష్మిని ఎంపిక చేసినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు. బుధవారం ఉదయం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ సభ్యులు మట్టా నాంచా రయ్య - జనసేన పార్టీ సభ్యురాలు, లక్ష్మీపురం-3 సెగ్మెంట్ ఎంపీటీసీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రామానగరం గ్రామానికి చెందిన వంద కుటుంబాల వారితో అవనిగడ్డలోని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయానికి తరలివచ్చా రు. విజయలక్ష్మి - నాంచారయ్య దంప తులు తమ అభి మానులతో కలిసి జై జనసే న నినాదాలు మారుమోగించారు. ఈ సంద ర్భంగా విజయలక్ష్మి - నాంచారయ్య దంప తుల ఆధ్వర్యంలో వంద కుటుంబాల వారు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమక్షంలో



జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ జనసే న కండువాలతో స్వాగతం పలికారు. కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన ఎంపీటీసీ సభ్యులు బొందలపాటి శ్యామసుందరి, అద్దేపల్లి జయలక్ష్మి సాయికుమారి, కాగిత రమేష్, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట మురళీకృష్ణ, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, పార్టీ నాయకులు మడమల రంజిత్, ఉరిమి మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం అభివృద్ధికి 1.40 కోట్ల ఎంపీ లాడ్స్ అభివృద్ధి నిధులు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః



మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో జనసేన పార్టీ తరపున ఎన్నికైన 14 మంది జనసేన కార్పొరేటర్ లకు 1.40 కోట్లు (ఒక కోటి నలభై లక్షలు) ఎంపి లాడ్స్ అభివృద్ధి నిధులు ప్రకటిం చిన జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. దానికి తోడుగా ప్రతి జనసేన కార్పొరేటర్ కు మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ నిధుల నుండి మరో 10 లక్షల అభివృద్ధి నిధుల మంజూరు చేస్తారని తెలిపారు.వచ్చే నెల నుండే అభివృద్ధి పనులు ప్రారంభంమచిలీపట్నం మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలో జనసేన పార్టీ తరపున ఎన్నికైన 14 మంది కార్పొరేటర్ లకు తన ఎంపీ నిధు ల నుంచి రూ.10 లక్షల చొప్పున మొత్తం 1 కోటి 40 లక్షల రూపాయలను అభివృద్ధి పనుల కోసం కేటాయించనున్నట్లు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ప్రకటించారు.అదేవి ధంగా, జనసేన పార్టీ కార్పొరేటర్ గెలిచిన ప్రతి డివిజన్ కు తను ప్రకటించిన ఎంపి లాడ్స్ నిధులు 10 లక్షలతో పాటుగా మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ నిధుల నుండి మరో 10 లక్షల నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ విధంగా ఎంపీ నిధులు రూ.10 లక్షలు, మచిలీ పట్నం మునిసిపల్ కార్పొరేషన్ మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు కలిపి జనసేన పార్టీ కార్పొరేటర్ ఎన్నికైన ప్రతి డివిజన్‌లో మొత్తం రూ.20 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం కల్పించడంతో కొత్తగా ఎన్నికైన జనసేన కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిధులను ఆయా డివిజన్ల పరిధిలో ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వచ్చే నెల నుండే ఈ అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఎంపి సూచించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, తమ తమ డివిజన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని జనసేన పార్టీ తరపున ఎన్నికైన కార్పొరే టర్లకు ఎంపీ బాలశౌరి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేస్తూ మచిలీపట్నం నగర అభివృద్ధికి కృషి చేయాలని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పాత శివాలయంలో వైభవంగా కార్తీక మాస నక్త దీక్ష తొమ్మిదవ రోజు పూజలు



ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ వన్‌టౌన్‌లోని శ్రీ త్రిపుర రాంబ మల్లే శ్వర స్వామివార్ల దేవ స్థానం (పాత శివాల యం)లో కార్తీక మాస నక్త దీక్షలో భాగంగా తొమ్మి దవ రోజు శ్రీ చండీ దేవి అలంకరణలో శ్రీ మహా లక్ష్మి, శ్రీ మహాసరస్వతి సమేత శ్రీ త్రిపుర రాంబ అమ్మవారు భక్తులకు దర్శనమి చ్చారు. అమ్మ వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీక రించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.శ్రీ చండీ దేవి అలంకరణలో అమ్మవారి దివ్యమంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



డ్రైనేజి వ్యవస్థ అభివృద్ధికి పెద్దపీట

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మచిలీపట్నం నగరంలో డ్రైనేజీ వ్యవస్థకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ, వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ లు పెద్దపీట వేసి డ్రైనేజీ వ్యవస్థకు ఒక రూపకల్పన చేస్తున్నారని మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్, సిహెచ్ వివిఎస్ బాపిరాజు అన్నారు.విజయవాడ నగర కార్పొరేషన్ నుండి తెచ్చిన రెండు సూపర్ సక్కర్ వెహికల్స్ ద్వారా డ్రైనేజీలలో చెత్త పేరుకుపోయి నీరు పారుదల లేని చోట ఆ వెహికల్స్ నందలి పైపుల ద్వారా క్లియర్ చేయించి నీరు డ్రైనేజీలలో పారుదలయ్యే విధంగా చూడడం జరుగు తోందని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్, సిహెచ్ వివిఎస్ బాపిరాజు తెలిపారు.కోనేరు సెంటర్ నుండి జడ్పీ సెంటర్ వరకు గల డ్రైనేజీలో ఆ వెహికల్స్ ద్వారా పేరుకుపోయిన చెత్తను తొలగించడం జరుగుతోంది అన్నారు. బుధవారం లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద సూపర్ సక్కర్ వెహికల్స్ ద్వారా డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త తొలగించే కార్యక్రమాన్ని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ తో కలసి మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్, సిహెచ్ వివిఎస్ బాపిరాజు పనులను పర్యవేక్షించి మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం జరుగుతోంది అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ, వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ల పర్యవేక్షణలో నగరంలోని డ్రైనేజీలు పూడిక తీయించి అస్తవ్యస్తంగా ఉన్నచోట డ్రైనేజీలు సరిదిద్దడం జరుగుతోంది అన్నారు. నగర ప్రజలు కూడా డ్రైనేజీలలో చెత్తాచెదారం వెయ్యకుండా మచిలీపట్నం నగరపాలక సంస్థకు ప్రజలు కూడా సహకరించాలి అని ప్రజలను కోరారు. శానిటేషన్, మంచినీటి పైపులైన్ మరమ్మత్తులు, డ్రైనేజీల ప్రక్షాళన పై ప్రత్యేక దృష్టి సారించాము అన్నారు. నగరంలో ప్రజలకు ఏదైనా సమస్య ఉన్న ఎడల తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాము అని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ తో పాటుగా శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో డ్రైనేజీల పూడికతీత పనులు ముమ్మరం

✧సూపర్ సక్కర్ యంత్రం ద్వారా ప్రధాన డ్రైనేజీలు, కల్వ ర్టుల వద్ద పూడిక తొల గింపు✧ప్రత్యేక యంత్రాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తెప్పించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

రాబోయే అక్వాన్ తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మచిలీపట్నం నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీ వ్యవస్థ సజావుగా పనిచేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.ఇందులో భాగంగా మచిలీపట్నం మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలోని ప్రధాన డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు విజయవాడ మున్సి పల్ కార్పొరేషన్ నుంచి ప్రత్యేకంగా సూపర్ సక్కర్ యంత్రాన్ని తెప్పించారు. గతంలో జిల్లా కలెక్టర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను అభ్యర్థించగా, వారి సహకారంతో ఈ ప్రత్యేక యం త్రాన్ని మచిలీపట్నానికి అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ యంత్రం ద్వారా రెండు రోజుల పాటు నగరంలోని ప్రధాన డ్రైనేజీలు, కల్వర్టుల సమీపంలో పూడిక పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టనున్నారు. ముఖ్యంగా వర్షపు నీరు నిల్వ ఉండే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడి డ్రైనేజీ వ్యవస్థలో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను సూపర్ సక్కర్ యంత్రం సహాయంతో పూర్తిస్థాయిలో తొలగిం చనున్నారు.ఈ పనులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షిం చారు. డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా, తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసినా వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ అధికారి ప్రవీణ్, సూపర్ సక్కర్ యంత్రం ద్వారా పూడికతీత పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నామని, ముఖ్యంగా నీరు నిలిచే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రపరచి నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గారికి వివరించారు.తుఫాను ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య, డ్రైనేజీ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

గురువారం 19 నవంబర్ 2026



స్థానిక ఎన్నికల్లో ప్రజలు కూటమి వైపే.. ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

ఈవీఎం అయినా,బ్యాలెట్ అయినా ఎన్నికలు ఏ విధంగా జరిగినా ప్రజల మద్దతు కూటమికే ఉందని ఏలూరు ఎమ్మెల్యే,టీడీపీ జిల్లా అధ్యక్షుడు బడేటి చంటి అన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అఖండ మెజార్టీ అందించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి మద్దతుదారులను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామీణ ఓటర్లకు పిలుపునిచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలు, దాడులను ప్రజలు మరచిపోలేదన్నారు.తుఫాన్ల సమయంలోనూ కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసిందని తెలిపారు.గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఒకే పాలన కొనసాగితే అభివృద్ధి,సంక్షేమం మరింత వేగవంతమవుతాయని పేర్కొన్నారు.సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం,మాజీ డిప్యూటీ మేయర్ కర్రి శ్రీనివాస్,కార్పొరేటర్లు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేసే వారికి పట్టం కట్టండి

- ఎస్ డి ఎఫ్ జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు



ప్రజా భూపతి ప్రతినిధి, కామవరపు కోట

పంచాయతీ ఎన్నికలలో గ్రామాభివృద్ధికి కృషి చేసే వారికి పట్టం కట్టాలని ఏలూరు జిల్లా సామాజిక ప్రజాస్వామ్య ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో కామవరపుకోట సర్పంచ్ అభ్యర్థిగా ఏ పార్టీతో అనుబంధం లేకుండా పోటీ చేస్తున్న వీరమల్ల మధుసూదన రావు అభ్యర్థిత్వాన్ని బలపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి పదవులు లేకుండానే పలు సేవా కార్యక్రమాలు చేయటంతో పాటు, పలు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేసే మధు ను సర్పంచిగా గెలిపించినట్లయితే గ్రామం అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. సామాజిక హక్కుల వేదిక కన్వీనర్ షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ కామవరపుకోట పరిసర ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన మధుని గెలిపించినట్లయితే ప్రజలకు మేలు చేసే మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందన్నారు , సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు మాట్లాడుతూ మధు ని ప్రజలు గెలిపించడం ద్వారా ఒక ప్రత్యేక ప్రణాళిక ద్వారా పంచాయతీ సుందరీకరణతో పాటు గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రవీంద్రనాథ్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్వాన్ తుఫానుకు ముందస్తు చర్యలు తీసుకోండి

- ఏ ఓ కే గంగాధర్ రావు



ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

పొలం పిలుస్తుంది కార్యక్రమంలొ భాగంగా జీలుగుమిల్లి మండలంలోని అక్వాన్ తుఫాను ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని ఏ వో కె గంగాధరరావు కోరారు. వేరుశనగ పంట హార్వెస్ట్ సమయము వారం రోజులు పొడిగించుకోవాలని,వరి కోత అక్కడక్కడ హార్వెస్ట్ జరుగుతున్నా యని వారం రోజులు పంట కోత సమయం పొడిగించుకోవాలని ఆయన ఆదేశించారు. అక్వాన్ తుఫాను ఏలూరు జిల్లా వైపు ఎక్కువగా ప్రభావం ఉంటుందని దానివల్ల రైతులందరూ జాగ్రత్త పడాలని కోరారు. కార్యక్రమం జీలుగుమిల్లి. రచ్చన్నగూడెం గ్రామం లొ నిర్వహించారు. ఈ కార్యక్రమం నకు ఎంఈఓ కే . గంగాధరం హెచ్ ఓ ప్రశున్న వజ్రాల రాజు అపచఫ్ స్టాఫ్ రైతులు పాల్గొన్నారు.

పెద్దపులి సంచారంపై నిరంతరం నిఘా

ప్రజా భూమి ప్రతినిధి – చాట్రాయి



గత మూడు రోజులుగా చాట్రాయి మండలంలోకి పెద్ద పులి ప్రవేశించిందని పోతనపల్లి, పోలవరం, కోటపాడు, చిత్తపూరు గ్రామాలలో అటవీ ప్రాంతాలలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించి పెద్ద పులికదలికపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి నట్లు అటవీశాఖ అధికారి రేంజర్ సత్యనారా యణ అన్నారు. అడవిలోకి పశువులను, జీవాలను మేపటానికి వెళ్లే మనుషులు ఒంటరిగా వెళ్లవద్దని పెద్దపులి అడుగుజాడలు గుర్తిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దపులిని బంధించేందుకు పూణే నుండిప్రత్యేక బృందాలను రప్పించడం జరిగిందని వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజలకు రక్షణ కల్పిస్తామని అన్నారు.

ఏఐటియుసి జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఏలూరు:బెంగళూరులో ఈనెల 22 నుంచి 26 వరకు జరుగనున్న ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభలను కార్మికులు,ఉద్యోగులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏఐటీ యూసీ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణకు,ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశంలో కార్పొరేట్ విధానాలు తిప్పికొడుతూ ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలపై కార్మిక వర్గం చేస్తున్న పోరాటాలు, భవిష్యత్తు కార్యాచరణ ఈ జాతీయ మహాసభలలో రూపొందిస్తుందని తెలిపారు. ఏ ఐ టి యు సి జాతీయ మహాసభలు ప్రారంభం రోజున నవంబర్ 22న వేలాది మందితో బెంగళూరులో ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి పాలన సాగిస్తున్న నేపథ్యంలో దేశంలోని కార్మిక వర్గాన్ని ఒక వేదికపై తీసుకువచ్చి పోరాటాలు చేయడానికి ఈ మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని మహాసభలో ప్రధానంగా చర్చించి కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్మికులకు సామాజిక, ఉద్యోగ భద్రత ఉండాలని, అన్ని రంగాలలో ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, దేశ సంపదను కాపాడాలని, కార్పొరేట్ల దోపిడీ నుంచి దేశాన్ని రక్షించుకోవడం కోసం ఏఐటియుసి మహాసభలలో విస్తృతంగా చర్చిస్తుందన్నారు.కార్మికుల సమస్యలు, చట్టాలు, హక్కులపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, సహాయ కార్యదర్శి ఏ అప్పలరాజు పాల్గొన్నారు.

యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ అవగాహన సదస్సు, వైద్య శిబిరం

ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు



పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో, శ్రీ విజయ ల్యాబ్ వారి సౌజన్యం తో ఈరోజు లైన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత క్యాన్సర్ అవగాహన సదస్సు మరియు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమవరం పల్లవి సుధీర్ మెడికేర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుధీర్ వర్మ, గైనకాలజిస్ట్ డాక్టర్ పల్లవి, పాథాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి విచ్చేసి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో మహిళలకు ఉచితంగా బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, పాప్ స్మియర్ పరీక్షలు, పురుషులకు ప్రోస్టేట్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని, క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని వివరించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ గవర్నర్ పెనుమాక రామమోహనరావు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇటువంటి క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యునైటెడ్ కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు దేవరపు కాంచనమాల, కార్యదర్శి సిద్ధిరెడ్డి శైలజారాణి, కోశాధికారి తోట గాయత్రి,కొమ్మల మురళి,జక్కంపూడి మదన్,మంగిన అరుణ, సంగినీడి రంగారావు, గంధం ఏసుపాదం, శిరిగినీడి రాము తదితరులు, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. మహిళలు, పురుషులకు ఉపయోగపడే విధంగా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

- కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన ఏలూరు జిల్లా పోలీస్ శాఖ

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఏలూరు జిల్లా పోలీస్ శాఖకు చెందిన హెడ్ కానిస్టేబుల్ 1068 వి. గోపి కుటుంబానికి పోలీస్ శాఖ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల పై ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఏఆర్ ఆర్ఐ శ్రీ సతీష్, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్. నాగేశ్వరరావు ఇతర పోలీస్ అధికారులు మృతుడి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరపున ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ చెక్కులతో పాటు, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం తరపున ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ కింద రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు) చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విధి నిర్వహణలో పోలీస్ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి సంక్షేమానికి తోడ్పడటం పోలీస్ శాఖ బాధ్యతగా భావిస్తుందని ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు.

పార్లమెంట్ ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాభూమి, బుట్టాయగూడెం



డిసెంబర్ ఒకటో తేదీన జరగబోయే ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ ని, కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పులుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ తెల్లం రామలక్ష్మి, సీత, మంగతాయారు, వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ ఒకటి ఢిల్లీలో జరుగనున్న పార్లమెంట్ ముట్టడి గోడపత్రికను సిఐటియు జిల్లా కార్యదర్శి తెల్లం నాగమణి ఆవిష్కరించారు. స్థానిక ఆదివాసి విజ్ఞాన కేంద్రం వద్ద బుధవారం జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నాగమణి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ కార్మికుల వేతనాలు, పెన్షన్లు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమతో సృష్టించిన సంపదతో యజమానులు కుబేరులవుతున్నారని, కార్మికులు మాత్రం ఎప్పటికీ పేద కార్మికులుగానే ఉండిపోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనం కట్టిన పన్నులతో సంపన్నులకు రాయితీలు ఇచ్చి మరింత సంపన్నులను చేస్తున్నారని, కార్మికుల వేతనాల పెంపుపై కనీస చర్యలు లేవని మండిపడ్డారు. ఒకపక్క ధరలు పెరుగుతున్నప్పటికీ వేతనాలు పెంచడం లేదని అన్నారు. కార్మికుల కోసం

ఆక్రమణల బారిన ఆర్ అండ్ బి రోడ్డు

- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు



ముసునూరు శివారు నెలపాటివారికుంట క్రాస్ రోడ్డు కూడలి అక్రమణల బారిన పడుతుంది. ముఖ్యంగా నెలపాటివారికుం ట నుండి చింతలవల్లి వెళ్లే మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. అసలే సింగిల్ రోడ్డు ఆపై అక్కడే పక్కాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ అక్రమ కట్టడాలను వ్యాపారాలు చేసే వారికి నెలకి వేలలో అద్దెకు ఇస్తున్నారు. పక్కనే వేంపాడు మేజర్ కాలువ ఉండటంతో కాలువకి సంబందించింది, ఆర్ అండ్ బి కి చెందిన మార్జీన్ స్థలాలు దర్జాగా కబ్జాకి గురవుతున్నాయి. ఆక్రమించేది పేదలు అనుకుంటే పప్పులో కాలువసినట్లే, అన్ని విధాలా ఆస్తులు కలిగి ఆర్థిక అంగ బలం ఉన్న వారే ఈ దురక్రమణలకు దిగుతుండటం విశేషం, పెద్దలు ఆక్రమణలు చేసి పక్కాగా కట్టడాలు చేపట్టి ఆ కట్టడాలను, పేద వర్గాలకు చెందిన వ్యా పారులకు అద్దెలకు ఇస్తున్నట్లు ఆ ప్రాంత వాసులు తెలుపు తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు, రెవిన్యూ, ఇరిగేషన్ అది కారులు అందరు కూడా ప్రతి నిత్యం ఈ రోడ్డు గుండానే ముసునూరు నుండి నూజివీడుకి వెళ్తుఉంటారు. అయినప్ప టికీ అధికారులు కన్నెత్తి కూడా ఇటువైపు చూడరని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. అధికారుల ఉదాసీనత వైఖరి కారణంగా ఇప్పటి వరకు తాత్కాలికంగా ఉన్న అక్రమ కట్టడాలు పక్కా కట్టడాలుగా మారుతున్నాయి. ఆక్రమణల విషయమై ఆదికారులకు ఎవరైనా పిర్యాధు చేసిన అక్రమణ స్థలం పరిధి మాది కాదంటే, మాది కాదంటూ ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులు ల సాకులు చెప్పుకుంటూ ఆక్రమణలను పట్టించుకోక పోవడంతో ఈ ప్రాంతంలో ఆక్రమణల పర్వం మరింతగా పరుగులు పెడుతుంది. రోజు రోజుకి మరిన్ని కొత్త ఆక్రమణలు వెలుస్తున్నాయి. మండల కేంద్రంకి కూత వేటు దూరంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగతా ప్రాంతంలో రోడ్ల అక్రమణ పరిస్థితి ఏంటని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి రోడ్లు అక్రమణ కారణంగా నేలపాటివారికుంట కూడలి ప్రాంతంలో ప్రమాదాలు జరగడం నిత్య కృత్యంగా మారింది.

సిబ్బంది లేరు ఏం చేస్తాం, ఆర్ అండ్ బి డి ఈ ఈ

నేలపాటివారికుంట ఆక్రమణల విషయం తన దృష్టికి వచ్చిందని నూజివీడు ఆర్ అండ్ బి ఈ ఈ బాబురావు తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా రోడ్ల ఆక్రమణలను తొలగించలేక పోతున్నమన్నారు.



తుఫాను ముప్పు వేళ.. ఉద్యాన పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

అక్వాన్ తుఫాన్ నేపథ్యంలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన అధికారి కె. జ్యోతి ప్రియాంక సూచించారు. అరటి, మామిడి, కొబ్బరి, బొప్పాయి, నిమ్మ, బత్తాయి, కూరగాయ పంటల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శు భ్రం చేయాలని, మొక్కలకు కర్రల ఆధారం ఏర్పాటు చేయాలని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న పండ్లను ముందుగానే కోయాలని, ఎండిన కొమ్మలను తొలగించి పందిళ్లు, షెడ్లను బలోపేతం చేసుకోవాలని సూచించారు. తుఫాను సమయంలో పొలాల్లోకి వెళ్లకూడదని, భారీ వర్షాల్లో ఎరువులు, పురుగుమందుల పిచికారీ చేపట్టరాదని, పంట నష్టాల ఆధారంగా ఫొటోలు, వీడియోలు భద్రపరచుకోవాలని ఆమె కోరారు. అధికారుల సూచనలు పాటిస్తూ పంటలు, వ్యవసాయ వనరులను కాపాడుకోవాలని తెలిపారు.

మొదటి రోజు 10 సర్పంచ్, 11 వార్డు సభ్యుల నామినేషన్లు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు 10 మంది సర్పంచ్ అభ్యర్థులు, 11 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం నుంచి శుక్రవారం వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు, సిబ్బందికి అభ్యర్థులు సహకరించాలని కోరారు.

ప్రజాభూమి
కోనసీమ
5
గురువారం 19 నవంబర్ 2026

వైసీపీకి గుడ్‌బై.. టీడీపీలోకి దేశిలంక వెంకటరమణ

ప్రజా భూమి, ప్రత్తిపాడు (కత్తిపూడి)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. కత్తిపూడి గ్రామ పంచాయతీ 8వ వార్డు మాజీ సభ్యుడు దేశిలంక వెంకటరమణ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, జడ్పీటీసీ సభ్యుడు కంచిబోయిన శ్రీను సమక్షంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వెన్నా శివ, కంచిబోయిన శ్రీను దేశిలంక వెంకటరమణకు పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచనల మేరకు నియోజకవర్గంలో కూటమిని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు ముందుకు సాగుతున్నారు. కత్తిపూడి గ్రామంలో రోజురోజుకూ కూటమికి మద్దతు పెరుగుతోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కేలంగి జనతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీలో ద్వితీయ స్థానం సాధించిన సంజన

- జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఎస్ఐఆర్ -2026 అంశంపై కొత్తపేట బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వ్యాస రచన పోటీలలో రావులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని టి. సంజన ద్వితీయ స్థానం సాధించింది. ఈ విజయంతో ఈ నెల 23న అమలాపురంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలకు ఆమె ఎంపికైంది. విద్యార్థిని సంజన సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. మధుసూదనరావు, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ కొండ్రెడ్డి రామకృష్ణ ప్రసాద్, మాజీ సర్పంచ్ ఎన్. వెంకన్న, ఎమ్. బాబ్జీ, గ్రామ పెద్దలు పి. చిన్నారావు, నాగార్జున, మురళి, వి. శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు. అలాగే



విద్యార్థినికి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ కె .వి . శేఖర్ ని అభినందించారు. ఉపాధ్యాయులు ఎస్. జ్యోతిబసు, ఎ.ఎ. గిరి, జి. సత్యవతి, వి. శ్యామలాకుమారి, కె. వీరవేణి, మేరీ జాన్స్, వసుంధరాదేవి, ఆంజనేయులు, వెంకట్ లక్ష్మి, సుజాత, గోపాలకృష్ణ, పద్మజ తదితరులు విద్యార్థినిని అభినందిస్తూ, జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత!

- 8 మండలాల్లో పోలీసుల నిఘా.. 104 హైపర్ సెన్సిటివ్, 123 సెన్సిటివ్ కేంద్రాల గుర్తింపు

ప్రజా భూమి ప్రతినిధి, అనకాపల్లి

జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లాలోని 8 మండలాల పరిధిలో 213 గ్రామ పంచాయతీలు, 2,072 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 452 పోలింగ్ లొకేషన్లలో 2,092 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, వీటిలో 104 అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్), 123 సమస్యాత్మక (సెన్సిటివ్) కేంద్రాలను గుర్తించినట్లు ఎస్పీ వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, కేంద్రాల పరిధిలో 100 మీటర్ల నిబంధనను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అనుమతి లేని వ్యక్తులను ఆ పరిధిలోకి అనుమతించరాదని ఆదేశించారు. నామినేషన్



కేంద్రాల సమీపంలో గుంపులుగా గుమికూడటం, ఊరేగింపులు నిర్వహించడం వంటి చర్యలను అడ్డుకోవాలని, ట్రాఫిక్‌కు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నన్ను గెలిపించండి.. మీరు మెచ్చే విధంగా సేవలందిస్తా



- 17వ వార్డు మున్సిపల్ అభ్యర్థి దొడ్డా శ్రీనివాస్

ప్రజా భూమి ప్రతి నిధి పాలకొల్లు

నన్ను గెలిపించండి.. మీరు మెచ్చే విధంగా సేవలందిస్తా అంటూ 17 వ వార్డు మున్సిపల్ కౌన్సిల్ అభ్యర్థి దొడ్డా శ్రీనివాస్ (ఏడకొండలు)ఓటర్ల కి విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ కౌన్సెలర్ ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీ టిడిపి అభ్యర్థి దొడ్డా శ్రీనివాస్ కూటమి నాయకులు,కార్యకర్తలు తో కలిసి ఇంటింటా తిరిగి ఓటర్లను స్వయంగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. పాలకొల్లు నియోజకవర్గం లో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని శ్రీనివాస్ ఓటర్ లను కోరారు.చైర్పర్సన్గగా ఆబోతుల ఉషారాణికి, కౌన్సిలర్ గా తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక ఓట్ల మెజారిటీ తో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి

- నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమీక్షించి అధికారులకు సూచనలు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆత్రేయపురం మండల పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన వివిధ కేంద్రాలను కొత్తపేట డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. సురేష్ కుమార్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, ఎన్నికల విధులకు నియమించిన అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరించాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహిం చేలా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామ చంద్రమూర్తి, మండల పరిషత్ పరిపాలనాధి కారి వి.రామ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంతో చిన్నారుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయం, పుస్తకాలు, ప్రకృతి తదితర అంశాలపై చిన్నారులు అందమైన చిత్రాలు గీసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. మానస, పి. సుమలత, పాఠకులు మల్లవెల్లి రాంబాబు, పల్లగాని రాంబాబు, గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- 12వ వార్డు అభ్యర్థి కలవగుంట మణికంఠ స్వామి విజ్ఞప్తి

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గం లో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కలవగుంట మణికంఠ స్వామి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం 12వ వార్డులో కూటమి పార్టీ టిడిపి అభ్యర్థి కలవగుంట మణికంఠ స్వామి కౌన్సిలర్ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు,కార్యకర్తలు తో కలిసి ఇంటింటా తిరిగి ఓటర్లను స్వయంగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. చైర్పర్సన్గగా ఆబోతుల ఉషారాణికి, కౌన్సిలర్ గా తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు నాయకులు కాపిశెట్టి సోమేశ్వరరావు, కాపీశెట్టి ప్రసాద్, బోనం భాస్కరరావు, పృధ్వి, కాపీశెట్టి హరిబాబు, కోపెల్ల మాణిక్యాలరావు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదశంకర్లపూడి కూటమి సర్పంచ్ అభ్యర్థిగా దయాల దాసు



ప్రజా భూమి,ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కూటమి సర్పంచ్ అభ్యర్థిగా శ్రీ దయాల దాసును ప్రకటించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మద్దతుతో ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నాయకత్వంలో సమావేశమై దయాల దాసు విజయానికి సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని నాయకులు పేర్కొన్నారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి దయాల దాసుకు గ్రామ ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటు వేసి సంపూర్ణ మద్దతు అందించాలని కూటమి నాయకులు విజ్ఞప్తి చేశారు.

విజయం సాధించిన ఎంపీటీసీలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభినందనలు



ప్రజా భూమి, ప్రత్తిపాడు

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ప్రత్తిపాడు, శంఖవరం మండలాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు బుధవారం ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విజయం సాధించిన ఎంపీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, శంఖవరం మండలాలకు చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పీ-4 కార్యక్రమం రాష్ట్రంలోనే ఆదర్శం

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

నూజీవీడు మంత్రి కార్యాలయంలో మంగళవారం రా ష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తనయుడు మరియు నితి న్ సాయి కన్నక్షన్ అధినేత కొలుసు నితిన్ కృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చినగాంధీ బొమ్మసెంటరు నందు, మంత్రివర్యులు కార్యాలయం లో కార్యాలయ ఉద్యోగులు భారీకేకును కట్ చేసి స్వీట్స్ ను పంచి తన అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, కూటమి పార్టీశ్రేణులు మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాత నవ్యాంధ్రప్రదేశ్ సృష్టికర్త మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోందని, ఆయన సహాయ సహకారాలు అండదండలతో ఆశీస్సులతో నూజీవీడు పట్టణం, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మన మంత్రి కొలుసు పార్థసారథి ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. పీ-4 కార్యక్రమం రాష్ట్రంలోనే నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించుట, మంత్రి కొలుసు పార్థసారథి తనయుడు కొలుసు నితిన్ కృష్ణ మంచి ఫలితాలు తీసుకువచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తండ్రి బాటలోనే తనయుడు నితిన్ కృష్ణ ముఖ్యమంత్రి ప్రేరణతో రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు సహాయంగా నితిన్ సాయి కన్నక్షన్ తరఫున పలు గ్రామాలను దత్తత చేసుకుని బంగారు తల్లికుటుంబాలు దత్తత కార్యక్రమాలు, చిరువ్యాపారస్తులకు తన వంతుసహాయంగా తోపుడు బళ్ళు, పాడిపశువులు,



వికలాంగులు మూడుచక్రాలు వాహనాలు, తదితర సేవాకార్యక్రమాలు తన స్వంత నిధులు వెచ్చించి ఉదార స్వభావాన్ని చాటుకున్నారని అన్నారు. పేదలు కుటుంబాన్ని ఎంతగానో ఆదరించి ఆర్థికంగా సాయంచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మనసున్న మహానాయకుడు నితిన్ కృష్ణ అని పేర్కొన్నారు. భవిష్యత్తో మరిన్ని పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని, తండ్రికి తగ్గ తనయుడిలా రానున్న కాలంలో గొప్పనాయకుడిగా ఎదగాలని మా అందరి ఆశీస్సులు, నియోజవర్గ అన్నివర్గాలు ప్రజలు అండదండలు మా తోడ్పాటు ఉంటుందని తెలియజేశారు.ఈ సందర్భంగా కొలుసు నితిన్ కృష్ణ వర్చువల్ ద్వారా మాట్లాడుతూలి తనపై ఎనలేని ప్రేమ, అభిమానం కనబరుస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కూటమిశ్రేణులకు, క్యాంపు కార్యాలయం ఉద్యోగులు,ప్రజాప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజాసేవకు మొదటి ప్రాధాన్యతను ఇస్తానని, తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు, యువతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమాజసేవలో ముందుంటానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఏసమస్య వచ్చినను వెంటనే స్పందిస్తానని సందర్భంగా పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా అన్నివర్గాలు ప్రజలు, కూటమిపార్టీశ్రేణులు, నాయకులు మా కుటుంబాన్ని ఎంతో ఆదరిస్తున్నారని జీవితాంతం అన్ని వర్గాలు ప్రజలకు రుణపడి ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమిపార్టీ శ్రేణులు, పట్టణ ప్రముఖులు, మంత్రి క్యాంపుకార్యాలయం ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు, గెలుపొందిన కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని తన అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీపీ, ఉప ఎంపీపీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాభూమిప్రతినిధి – ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలంలో గురువారం నిర్వహించనున్న ఎంపీపీ, ఉప ఎంపీపీ పరోక్ష ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి ఈ.బి. విలియమ్స్ తెలిపారు. పరోక్ష ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఉప ఎంపీపీ ప్రమాణ స్వీకారోత్సవం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు దాఖలు చేయదలచిన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు, ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని గురువారం మండల పరిషత్ కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలతో నామినేషన్లు సమర్పించాలని విలియమ్స్ తెలిపారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
గురువారం 19 నవంబరు 2026

జాతీయ స్థాయికి పాంచజన్య ఆవిష్కరణలు

-విద్యార్థుల ఆలోచన శక్తి అద్భుతం.. -నూతన ఆవిష్కరణలతో ఎంపిక కావడం అభినందనీయం-మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురంలోని పాంచజన్య పాఠశాల విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు మహమ్మద్, ఆఫ్రిన్ రూపొందించిన స్మార్ట్ శీతల పైకప్పు, భవనాల ఉష్ణతాప నివారణ వ్యవస్థ, స్మార్ట్ రహదారి గుంతల గుర్తింపు, స్వయంచాలక మరమ్మతు వ్యవస్థ' అనే రెండు ప్రాజెక్టులు స్పార్క్--3.0 జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. కేవలం ఐదు నెలల క్రితమే పాఠశాలలో రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభించగా, ఇంత స్వల్ప వ్యవధిలోనే విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. విద్యార్థుల ఆలోచన శక్తి అద్భుతమని, చిన్న వయసులోనే సమాజ సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు చూపడం సంతోషకరమన్నారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన ఎంపికైన విద్యార్థులను అభినందించి, వారి ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థి మహమ్మద్ రూపొందించిన స్మార్ట్ శీతల పైకప్పు ప్రాజెక్టు వేసవిలో భవనాల్లో పెరిగే ఉష్ణోగ్రతలను నియంత్రించే వినూత్న ఆలోచనతో రూపొందించారు. ఎండ తీవ్రతకు భవనాల పైకప్పులు వేడెక్కి గదుల్లో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా పైకప్పుపై ఉష్ణోగ్రతను గుర్తించేందుకు ప్రత్యేక సెన్సార్‌ను ఏర్పాటు చేశారు. నిర్దేశించిన ఉష్ణోగ్రత పరిమితి దాటిన వెంటనే





సెన్సార్ సంకేతాల ఆధారంగా పైకప్పుపై చల్లని నీటిని విడుదల చేసే విధంగా వ్యవస్థను రూపొందించారు. దీంతో పైకప్పు ఉష్ణోగ్రత తగ్గి, భవనం లోపల వేడి ప్రభావం తగ్గుతుంది. అవసరమైనప్పుడు మాత్రమే నీటిని వినియోగించే ఆటోమేటిక్ విధానం ఈ ప్రాజెక్టు ప్రత్యేకతగా నిలుస్తోంది. మరో విద్యార్థిని ఆఫ్రిన్ రూపొందించిన స్మార్ట్ రహదారి గుంతల గుర్తింపు, స్వయంచాలక మరమ్మతు వ్యవస్థ రహదారుల సమస్యకు సాంకేతిక పరిష్కారాన్ని చూపుతోంది. రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించేందుకు వాహనానికి ప్రత్యేక సెన్సార్లను అమర్చే విధానాన్ని ఇందులో రూపొందించారు. వాహనం రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు సెన్సార్లు గుంతలను గుర్తిస్తాయి. అనంతరం వాటిని పూడ్చడంతోపాటు రహదారి మరమ్మతు పనులు చేపట్టేలా ఈ వ్యవస్థను రూపొందించారు. రహదారులపై గుంతలను సకాలంలో గుర్తించి మరమ్మతులు చేపట్టడం ద్వారా వాహనదారుల ఇబ్బందులను, ప్రమాదాల ముప్పును తగ్గించవచ్చనే ఆలోచన ఈ ప్రాజెక్టులో కనిపిస్తోంది. ఈ రెండు ప్రాజెక్టులను పరిశీలించిన కమిషనర్ మల్లికార్జున వాటి పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సెన్సార్లు ఏ విధంగా పనిచేస్తాయి, ఉష్ణోగ్రతను ఎలా గుర్తిస్తాయి, గుంతలను గుర్తించిన తర్వాత మరమ్మతు ప్రక్రియ ఎలా కొనసాగుతుంది వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తే సమాజానికి ఉపయోగపడే మరెన్నో ఆవిష్కరణలు వెలువడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రహదారులపై గుంతలను గుర్తించి పూడ్చడంతోపాటు మరమ్మతుల కోసం ప్రత్యేక యంత్రాలను తీసుకువచ్చే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆలోచిస్తున్న తరుణంలో విద్యార్థులు కూడా అదే తరహాలో ఆలోచించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న వయసులోనే ప్రజా సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు అన్వేషించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో ఐదు నెలల క్రితం ప్రారంభించిన రోబోటిక్స్ ల్యాబ్ విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలవడం హర్షణీయమన్నారు. జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులు తమ ప్రాజెక్టులను మరింత మెరుగుపరచుకొని ఆకర్షణీయంగా ప్రదర్శించాలని సూచించారు. డిసెంబర్ 12న కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ప్యాలెస్ రోడ్డులో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంగణంలో నిర్వహించనున్న స్పార్క్--3.0 జాతీయ స్థాయి ప్రదర్శనలో ప్రతిభ చాటి పాంచజన్య పాఠశాలతోపాటు హిందూపురం పట్టణానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ సందకుమార్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఏఓ భాస్కర్, ఉపాధ్యాయులు శైలజ, అయిషా తదితరులు పాల్గొన్నారు.

59 వ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాభూమి, పుట్టూరు.



59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుట్టూరు శాఖ గ్రంథాలయం నందు బుధవారం మోడల్ ప్రైమరీ స్కూల్ , పుట్టూరు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు మరియు రాయల సీమ స్కూల్ పుట్టూరు విద్యార్థిని విద్యార్థులు కు డ్రాయింగ్ , మ్యూజికల్ చైర్స్, క్విజ్ మొదలగు పోటీల ను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో గెలుపొందిన వారికి వారోత్సవాల ముగింపు రోజున బహుమతుల ప్రధానం జరుగును . ఈకార్యక్రమంలో లైబ్రేరియన్ ప్రకాష్ రెడ్డి , మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు నాగేశ్వర రెడ్డి , రాయల సీమ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ రెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొనడమైనది . గ్రంథాలయ పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కంది కాపులలో ఖేత్ బచావో అభియాన.

నేల సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

-కందికాపులలో ఖేత్ బచావో అభియాన

ప్రజాభూమి, పుట్టూరు.



నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచించారు. పుట్టూరు మండలం కందికాపుల గ్రామంలో బుధవారం 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేల సంరక్షణ ఆవశ్యకత, ప్రకృతి వ్యవసాయంలో భాగమైన పీఎండీఎస్ (పీఎండీఎస్), హాఫ్‌మూన్ మోడల్ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. భూసారాన్ని పునరుద్ధరించే పద్ధతులు, ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను తట్టుకునే వ్యవసాయ విధానాలను వివరించారు. నేలలో తేమను కాపాడుకోవడం, భూసారాన్ని పెంపొందించుకోవడం ద్వారా సాగులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలియజేశారు. అనంతరం ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారీ విధానాలను ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వీటి వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీ ఆత్మ కె. అప్పలస్వామి గారు,డైరెక్టర్, దక్షిణ ప్రాంత వ్యవసాయ యంత్ర పరికరాల శిక్షణ మరియు పరీక్షా సంస్థ (ఎస్ ఆర్ ఎఫ్ ఎం టి టి ఐ), ట్రాక్టర్ నగర్, గార్లదిన్నె శ్రీమతి జి. విద్యావతి , సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ), డి ఆర్ సి, అనంతపురం.శ్రీ కె. లక్ష్మీ నరసింహులు,శ్రీమతి కె. రుమానా బేగం డి ఆర్ సి ఏవో, శ్రీ భాస్కర్ , సీనియర్ ఇంజనీర్, ఎస్ ఆర్ ఎఫ్ ఎం టి టి ఐ, ట్రాక్టర్ నగర్. శ్రీ హరినాథ్ రెడ్డి , సీనియర్ ఇంజనీర్, ఎస్ ఆర్ ఎఫ్ ఎం టి టి ఐ, ట్రాక్టర్ నగర్.

పశువులు ఉన్నరైతులు పశుగ్రాసం కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాభూమి, పుట్టూరు. పశువులు ఉన్న రైతులకు తెలియజేయునది ఏమనగా వి బి జి రాంజీ(ఎంజీఎన్ఆర్ఇజిఎస్) కింద పశుగ్రాసం సాగు కోసం (గడ్డి పెంచుకోవడానికి)ఆసక్తిగల రైతులు దరఖాస్తులు ఇవ్వవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

దరఖాస్తు చేసుకునే రైతులు

కావలసిన పత్రాలు..

1. దరఖాస్తు ఫారం 2. పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు-2 3. బ్యాంక్ పాస్‌బుక్ 4. ఆధార్ 5. భూమి పాస్‌బుక్ 6. చిన్నసన్న కారు సర్టిఫికేట్ 7. జిరాక్స్ 2 సెట్స్ ఇవ్వాలి. భూమి 5 ఎకరాలు లోపు ఉన్న వాళ్ళు మాత్రమే ఈ ఉపాధి హామీ పథకం కు అర్హులు అవుతారు.

భారీ జనసందోహం మధ్య కూటమి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్

తరిమెలలో గుండె సుకన్య నామినేషన్ దాఖలు..

మార్కెట్ యాడ్ చైర్మన్ దండు శ్రీనివాసులు

ప్రజా భూమి శింగనమల



మండలం వరిధి తరిమెల గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ జనసందోహం మధ్య కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా గుండె సంజీవరాయుడు భార్య గుండె సుకన్య నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి అభ్యర్థికి మద్దతు తెలిపారు. నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు విద్యార్థినులకు అవగాహన..

దోమతెరల పంపిణీ -డాక్టర్ శంకర్ నాయక్

ప్రజాభూమి ప్రతినిధి, శింగనమల



శింగనమల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాల్లో దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శింగనమల కేజీబీవీ-3 పాఠశాలలో విద్యార్థినులకు దోమతెరలను పంపిణీ చేసి, దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు వివరించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న క్రిమిసంహారక దోమతెరల (ఇన్‌సెక్టిసైడల్ బెడ్ నెట్స్) వినియోగం, వాటిని సరైన పద్ధతిలో ఉపయోగించుకోవడం, వినియోగ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మలేరియా సబ్‌యూనిట్ అధికారి కె. మద్దయ్య, పర్యవేక్షకులు నూర్ భాష, శ్రీధర్ మూర్తి, తరిమెల ఆరోగ్య కేంద్రం గంగాధర్, ఎం పి హెచ్ సి ఓ చంద్రశేఖరరెడ్డి, హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, శింగనమల ఆశా కార్యకర్త మంజుల, కేజీబీవీ (ఎస్ ఓ) గీతారాణి, సిబ్బంది సుకన్య తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో భారీ ఉద్యోగ మేళా - నిరుద్యోగ యువతీ యువకులు

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురంలో భారీ ఉద్యోగ మేళా -- నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి. అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ (రాజుజుణ్యా), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ూ్రాలాణజ), నేషనల్ కెరీర్ సర్వీస్ (చీజూ) సంయుక్త ఆధ్వర్యంలో 2026 నవంబర్ 21వ తేదీ, శనివారం భారీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి్ా.ఎ. ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి శ్రీమతి ూ. పల్లవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళా అనంతపురంలోని ూఖీ ఎకాలజీ సెంటర్, =ణు స్టేడియం సమీపంలో నిర్వహించబడుతుంది. ఈ ఉద్యోగ మేళాలో సుమారు 14 ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. మొత్తం సుమారు 350 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఉద్యోగ మేళాలో జయలక్ష్మి ఆటోమోటివ్స్, వీ+దీ గ్రూప్స్, కీర్తి మెడికల్స్, అపోలో ఫార్మసీ, సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్, ఖxూా ఇండియా, రిత్విక బజాజ్, కోజెంట్ ఈ-సర్వీసెస్, ఎల్విన్ ఎనర్జీ, ూాఅజు=, చోళమండలం, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ముత్తూట్ మైక్రోఫిన్ తదితర కంపెనీలు పాల్గొంటాయి. అభ్యర్థులకు అసెంబ్లీ, ప్రొడక్షన్, క్వాలిటీ చెకింగ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సర్వీస్ అసోసియేట్, ఫార్మసీ ట్రైనీ, డిప్లొమా ట్రైనీ ఇంజనీర్, న్యాప్స్ ట్రైనీ, మెషిన్ ఆపరేటర్, ఫీల్డ్ మేనేజర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్ తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ మరియు ఇతర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీల నిబంధనల ప్రకారం నెలకు సుమారు రూ.9,000 నుంచి రూ.30,000 వరకు వేతనంతో పాటు ప్రోత్సాహకాలు అందించే అవకాశాలు ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా క్రింది వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ లింక్: అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెజ్యూమ్ మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఉద్యోగ మేళాకు హాజరుకావాలని అధికారులు సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9505926663, 8500472180.

నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి -చట్టబద్ధత దత్తతకే గుర్తింపు

-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. హేమలత

ప్రజాభూమి, హిందూపురం టౌన్

యువత నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత పిలుపునిచ్చారు. అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సురక్షిత్ బచపన్ అభియాన్ లో భాగంగా బుధవారం ప్రభుత్వ ఎన్.ఎస్.పి.ఆర్. మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ అంజలీదేవి అధ్యక్షతన జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతుంటే వాటిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమాజంలోని ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉంటుందని, అలాంటి చట్టాలపై తప్పనిసరిగా ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ప్రధానంగా దత్తత స్వీకరణకు తప్పనిసరిగా చట్టబద్ధత ఉండాలన్నారు. చట్టబద్ధతలేని దత్తతకు గుర్తింపు ఉండదని తెలిపారు. చిన్నతనంలోని నిరాదరణకు గురైన చిన్నారులు, అనాథలు ఉంటే అలాంటి వారిని స్త్రీ శిశు సంక్షేమ శాఖ దృష్టికి తీసుకువెళ్లి వారికి ఆశ్రయం కల్పించాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించుకోవడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండటం పట్ల న్యాయమూర్తి అభినందించారు. చట్టాలపై అందరికీ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఉన్నత న్యాయస్థానం సురక్షిత్ బచపన్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శివన్న ఆధ్వర్యంలో కళాశాల హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా దోమ తెరలను న్యాయమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కళాశాల ఆధ్వర్యంలో న్యాయమూర్తి హేమలతను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ గోపాల కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, న్యాయవాదులు జగదీష్, ఆశ, అధ్యాపకులు నాగమణి, ఎన్ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీ మార్చ్‌ను జయప్రదం చేయండి

--సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న మహా మార్చ్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. తూముకుంట పారిశ్రామికవాడలో ప్రారంభమైన ఈ జాతకు జెడ్పీ శ్రీనివాసులు జెండా ఊపి శ్రీకారం చుట్టారు. అనంతరం హిందూపురంలోని బీపీఎల్ షోరూం, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, పాలసముద్రం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు విఆర్ రాము మాట్లాడుతూ, అన్ని రంగాల కార్మికులకు సుప్రీంకోర్టు సూచించిన విధంగా రూ.42 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారని, పెరిగిన ధరలను తక్షణమే తగ్గించాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ.700 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక వర్గాల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఢిల్లీ మార్చ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు విఆర్ రాము, సివిల్ సప్లై యూనియన్ జిల్లా కార్యదర్శి పెనుకొండ నాగరాజు, కేవీపీఎస్ జిల్లా నాయకులు కిరణ్, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, నరసింహమూర్తి, శివ, సప్లై యూనియన్ కార్యదర్శి శ్రీరాములు, ఆటో యూనియన్ నాయకులు అంజి, బాబు రెడ్డి, నరసప్ప, గురు, చలివెందుల బాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం శాఖ గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి. విజయకుమారి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పోటీల వలన విద్యార్థిని ,విద్యార్థులకు చిన్నతనం నుండే పోటీతత్వం అలవడుతుందని తెలిపారు. దీనికి తోడు సృజనాత్మకత, నైపుణ్యం, ఆలోచన శక్తి పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది భాష, నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల భద్రతకు భరోసా..

-సంక్షేమానికి నా వంతు బాధ్యత

-సొంత ఖర్చులతో ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తా

-మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల భద్రత, సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. వార్తల సేకరణలో భాగంగా జర్నలిస్టులు ఎండ, వానలను లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని, కొన్నిసార్లు ప్రమాదకర పరిస్థితుల్లోనూ పనిచేయాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులకు ప్రమాద బీమా భరోసా ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో హిందూపురం ప్రాంతంలోని జర్నలిస్టులకు తన సొంత ఖర్చులతో ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు ముందుకొస్తున్నట్లు బుధవారం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులతో వెల్లడించారు. విధి నిర్వహణలో అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు జర్నలిస్టులతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో బీమా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఏ రోజు సమయం కేటాయించినా ఆ రోజు క్లబ్‌కు వచ్చి జర్నలిస్టులతో నేరుగా మాట్లాడి, ప్రమాద బీమా సౌకర్యానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేస్తానని కమిషనర్ తెలిపారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు.

శ్రీనగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహరసుతుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం నగరంలోని బుధవారం శ్రీనగర్ కాలనీలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హరిహరసుతుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. హరిహరసుతుడి నామస్మరణలు, అయ్యప్ప స్వామి శరణు ఘోషతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్ప స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
గురువారం 19 నవంబరు 2026

తొలిరోజు నామినేషన్లు ప్రశాంతం - స్వల్ప ఉద్రిక్తతలు

సర్పంచ్ పదవులకు ఇరవై, వార్డు సభ్యులకు ముప్పై రెండు నామినేషన్లు దాఖలు

ప్రజాభూమి, పులివెందుల

గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తొలి రోజు ప్రశాంతంగా ముగిసింది. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా అధికారులు రాగిమాని వల్లె, ఈ కొత్తపల్లి గ్రామాలలో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ కొత్తపల్లె గ్రామంలో నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఒక వర్గంపై మరొక వర్గం అడ్డుపడడంతో స్వల్ప వివాదం చోటుచేసుకుంది పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇరువర్గాలను అక్కడి నుంచి చదరగొట్టారు. దీంతో సాఫీగా నామినేషన్ ప్రక్రియ కొనసాగింది.





తొలిరోజు గ్రామ పంచాయతీ ఎన్నికలకు 20 సర్పంచ్ నామినేషన్లు

పులివెందుల మండల పరిధిలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం నాటికి మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ పదవులకు 20 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 32 నామినేషన్లు దాఖలైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెల్లడించారు.మండలంలోని కనంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవికి ఒక నామినేషన్, వార్డు సభ్యులకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ.కొత్తపల్లిలో సర్పంచ్ పదవికి రెండు, వార్డు సభ్యులకు నామినేషన్లు లేవు. ఎర్రబల్లిలో సర్పంచ్ పదవికి ఐదు, వార్డు సభ్యులకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి.అదేవిధంగా అచ్చవెల్లిలో సర్పంచ్ పదవికి ఐదు, వార్డు సభ్యులకు 11 నామినేషన్లు, రాగిమానుపల్లిలో సర్పంచ్ పదవికి రెండు, వార్డు సభ్యులకు మూడు నామినేషన్లు, యర్రిపల్లిలో సర్పంచ్ పదవికి ఐదు, వార్డు సభ్యులకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి.మొత్తంగా ఇప్పటివరకు సర్పంచ్ పదవులకు 20, వార్డు సభ్యుల స్థానాలకు 32 నామినేషన్లు నమోదయ్యాయి. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి నివేదిక వెల్లడించారు.

డిఎస్పి కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

పోలీసుల తీరుపై మండిపడ్డ ఎంపీ

ప్రజాభూమి,పులివెందుల



డీఎస్పీ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ వైఎన్ అవినాష్ రెడ్డి పోలీసుల తీరుపై మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో, మంగళవారం రాత్రి పులివెందుల నియోజకవర్గ పరిధిలోని తొండూరు, సింహాద్రిపురం, పులివెందుల మండలాలకు చెందిన పలువురు వైసీపీ మద్దతుదారు లను, సర్పంచ్ అభ్యర్థులను, సింహాద్రిపురం మండలంలో సర్పంచ్ అభ్యర్థి రమణయ్యతో పాటు ఆయన ప్రతిపాదకుడు శివ ప్రతాప్, దేవతాపురానికి చెందిన బాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని మాచారం రావడంతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డి. ఎస్. పి కార్యాలయానికి చేరుకున్నారు డి. ఎస్. పి అందుబాటులో లేకపోవడంతో చరవాణిలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఘర్షణలో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులను అక్రమ కేసులో ఇరికించేందుకు అరెస్టులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.కేసుల్లో ఇరికించి నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆయన డీఎస్పీ మురళీ నాయక్‌పై మండిపడ్డారు. మావాళ్లను స్టేషన్‌లో పెట్టారు కదా డీఎస్పీ కార్యాలయంలోనే నామినేషన్ సెంటర్ పెట్టేయండి. ఇక్కడే నామినేషన్లు వేస్తాం అని ఆయన వ్యాఖ్యానించారు

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి నోటీసులు- పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే తెల్లవారుజాము నుంచే ఎంపీ ఇంటి వద్ద పోలీసులు చుట్టుముట్టారు.ఇంటి నుంచి బయటకు రావద్దని ఆదేశిస్తూ అర్బన్ సీఐ పురుషోత్తమ రాజు ఎంపీ అవినాష్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు.

సొంత చెల్లెలుపైనే ఇలాంటి రాతలా - ధ్రువ కుమార్ రెడ్డి ఆగ్రహం

షర్మిలమ్మపై అనుచిత వ్యాఖ్యలు ఆపాలని హెచ్చరిక

- అసత్య ప్రచారం చేస్తే కఠిన కేసులు

ప్రజాభూమి, పులివెందుల



కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి గారు షర్మిలా రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. వై ఎస్ ఆర్ సి పి పత్రిక, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సొంత చెల్లెలుపైనే ఇలాంటి రాతలు రాస్తారా అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ఎంత దిగజారుతారు జగన్ మోహన్ రెడ్డి అంటూ తీవ్రంగా నిలదీశారు.క్యారెక్టర్ అససినేషన్ కు పాల్పడటం దారుణమని అన్నారు. చంద్రబాబు నాయుడు తో మర్యాదపూర్వక భేటీని వక్రీకరించి తప్పుడు కథనాలు ప్రసారం చేయడంపై హెచ్చరించారు. పెళ్లి పత్రిక ఇవ్వడానికి వెళ్తే రాజకీయమా అని ప్రశ్నించారు. మేనకోడలు కూతురి పెళ్లి ఆహ్వానాన్ని కూడా రాజకీయం చేయడం ఎంతవరకు సమంజస మని అన్నారు.మీ కుటుంబానికొస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. మీకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు, రేపు మీ ఇంట్లో వేడుకల గురించి ఇలాగే రాస్తే సహిస్తారా అని సూటిగా ప్రశ్నించారు. వ్యక్తిగత దూషణలు ఇకనైనా ఆపాలని అన్నారు. అనవసరమైన చర్చలు, క్యారెక్టర్ హత్యా రాజకీయాలను తక్షణమే నిలిపివేయాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో,పత్రికల్లో ఇలాంటి పోస్టులు, అసత్య ప్రచారాలు కొనసాగిస్తే కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు.

కూటమి ధర్మాన్ని పాటించకుండా బీజేపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడులు సిగ్గుచేటు - బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి



ప్రజాభూమి, కడప అర్బన్

కూటమిలో భాగస్వామిగా ఉంటూ బీజేపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు భౌతిక దాడులకు పాల్పడటం సిగ్గుచేటని బీజేపీ కడప జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడప నగరంలోని వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ధర్మాన్ని బీజేపీ పాటిస్తున్నప్పటికీ టీడీపీ శ్రేణులు అందుకు విరుద్ధంగా వ్యవ హరిస్తూ బీజేపీ కార్యకర్తలపై దాడులకు దిగడం హేయమైన చర్య అని విమర్శిం చారు. పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లె గ్రామ సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లిన బీజేపీ నాయకుడు లంకా చిన్నపరెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గతంలో సుండుపల్లి మండలం చిన్నగొల్లపల్లెలో బీజేపీ కార్యకర్త రెడ్డెప్ప నాయుడుపై కూడా దాడి జరిగిందని గుర్తుచేశారు. తాజాగా గంగనపల్లెలో బీజేపీ కార్యకర్త నామినేషన్ వేయడానికి వెళ్తుండగా దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాక్షేత్రంలో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కూటమిలో భాగస్వాములుగా ఉన్న బీజేపీ, జనసేన కార్యకర్తలపై ఇలాంటి దాడులు జరగడం కూటమి ధర్మాన్ని వమ్ము చేయడమేనని విమ శించారు. బీజేపీ, జనసేన కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత నాయకులు చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. కూటమి ఐక్యత ను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ఈ సమా వేశంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, రామకృష్ణ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొత్త వ్యక్తులను గుర్తించండి

ప్రజాభూమి, కడప రూరల్

స్థానిక ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో వేరే ప్రాంత వ్యక్తులు వచ్చి గ్రామంలో అలజడులు సృష్టించి, రిగ్గింగ్ కు పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు, పోలీసులు వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవర కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పుడు నుంచి ఇలాంటి దౌర్జన్య కాండ పట్టణాల్లోనూ గ్రామాల్లోనూ జరగలేదని ఆయన తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కొత్త వ్యక్తులు తెచ్చి గలాటాలు పురుగులుపే శాంతియుతమైన గ్రామాల సైతం ఫ్యాక్షన్ కు పూరి కలుపుతున్నారని తెలిపారు. కొత్త వ్యక్తులు ఇప్పుడు వచ్చే ఘర్షణలు పురుగులపై వెళ్లిపోయిన తర్వాత స్థానిక ప్రజలే నిత్యము విషపూరితమైన సంస్కృతిలో చనిపోతారని అన్నారు. ఇలాంటి కొత్త వ్యక్తులను వెంటనే స్థానిక ప్రజలు గుర్తించి వారిని గ్రామ బహిష్కరణ చేసి లేదంటే పోలీసులకు అప్పగించి గ్రామాల్లో ఘర్షణ లేకుండా శాంతియుతంగా ఎలక్షన్లు జరుపుకునే విధంగా పాటుపడాలని ప్రజలను కోరారు.

నేడు రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాభూమి, పులివెందుల

నేడు మున్సిపాలిటీ పరిధిలోని రెండు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రూరల్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు రోడ్డు విస్తరణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చిన్న రంగాపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

సర్పంచ్ నామినేషన్ వేళ ఉద్రిక్తత

- సర్పంచ్, వార్డు నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు

- రోడ్డుపై బైఠాయించి వైసీపీ నాయకులు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల దాఖలు సందర్భంగా వేంపల్లెలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి నివాసం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు చేసేందుకు బయలుదేరారు. ఈక్రమంలో బిడాల మిట్ట రోడ్డు వద్ద పోలీసులు వారిని నిలువరించడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ షబ్బీర్ వలీ తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. వారికి మద్దతుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు సైతం రోడ్డుపై బైఠాయించి నిరసనలో పాల్గొన్నారు. సర్పంచ్, వార్డు నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో బిడాల మిట్ట రోడ్డు పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఆ ప్రాంతంలో స్థానికంగా కొంతసేపు ఉత్కంఠ కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

- చౌడేపల్లి దిగువపల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి

ప్రజాభూమి, మదనపల్లి



రెండో విడత పంచాయతీ ఎన్నిక ల నామినేషన్ల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి హెచ్చరించారు. బుధవారం ఆయన చౌడేపల్లి మండలం దిగువవల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ఎన్నికల నియమావళికి లోబడి అత్యంత ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీసు అధికారులను అదనపు ఎస్పీ ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల నియంత్రణ, భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు.

రామాలయం ప్రారంభోత్సవంలో కూటమి నాయకులు

ప్రజాభూమి, సిద్ధవటం: రాజంపేట నియోజకవర్గ పరిధిలోని సిద్ధవటం మండలం భాకరాపేట కృష్ణనగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారం భోత్సవ కార్యక్రమం మంగళ వారం వైభవంగా నిర్వహించా రు. ఆలయంలోని మూల విగ్రహాలను రాజంపేట జనసేన పార్లమెంట్ పార్టీ ప్రధాన కన్వీనర్ ఎల్లటూరు శ్రీనివాసరాజు బహుకరించారు. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సాయి లోకేష్, ఒంటిమిట్ట మండల టీడీపీ సీనియర్ నాయకులు కొమర వెంకట నరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, సిద్ధవటం టీడీపీ నాయకులు పుత్త రామచంద్రయ్య, తొర్ర ప్రతాప్, శ్రీనివాస



నాయుడు, బొద్దే వెంకటరమణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు నాయకులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

నేడే ఎంపీపీ ఎన్నికలు

- కోఆప్షన్ సభ్యుల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

ప్రజాభూమి, సిద్ధవటం: మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ), వైస్ ఎంపీపీ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య తెలిపారు. బుధవారం సిద్ధవటం ఎంపీపీ సభా భవనంలో ఎన్నికల ఏర్పాట్లను ఆయన పరిశీలించి వివరాలు వెల్లడించారు. కోఆప్షన్ సభ్యుడిగా పోటీ చేయదలచిన అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలకు నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఎన్నికల ప్రక్రియ చేపడతామన్నారు. అనంతరం ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ ఎన్నికకు అవసరమైన కోరం లేకపోతే ఎన్నికను మరుసటి రోజుకు వాయిదా వేస్తామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, ఏవో సోమశేఖర్ పాల్గొన్నారు.



సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

భాకరాపేటలో ప్రయాణికుల అవస్థలు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలోని భాకరాపేట బస్టాండ్ కూడలిలో బద్వేల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన లేకుండా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అత్యవసర పనులపై ప్రయాణించాల్సిన వారు బస్సుల కోసం నిరీక్షిస్తూ విసుగుచెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి బద్వేల్ వైపు వెళ్లే బస్సులను నిర్ణీత సమయాలకు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి,పులివెందుల



కార్తీక మాసంలో నిర్వహించే పూజలకు అన్నసంతర్పణలకు విశేష పుణ్య ఫలాలు సిద్ధిస్తాయని గురు స్వామి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోతి సమాధి వద్ద గల అయ్యప్ప స్వామి ఆలయం నందు స్వామివారికి ఉదయాన్తమాన పంచామృతాభిషేకం నిర్వహణ అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వగా అయ్యప్ప శరణు ఘోషతో భక్తులు అయ్యప్ప నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం గిద్దలూరు శివప్రసాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్త జనానికి అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్ష దాత కుటుంబ సభ్యులకు అయ్యప్ప భక్తులు ఆశీర్వాదాలు అందించారు. గురుస్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సుగుణాల పరిరక్షణకు అయ్యప్ప మాలధారణ అన్ని విధాల దోహదపడతాయని దీక్షాకాలంలో అయ్యప్ప కఠోర దీక్షను నియమ నిబంధనలతో కొనసాగిస్తే జీవితంలో సౌభాగ్యం శాంతి ముక్తి సిద్ధిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బిక్షదాత అధిక మొత్తంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖన పోటీలు

ప్రజాభూమి,పులివెందుల

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవా రం గ్రంథాలయం అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో అహోబి లాపురం పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అం శంపై చిత్రలేఖన పోటీలు నిర్వ హించారు. ఈ పోటీల్లో 7, 8వ తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ చిత్రలేఖన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

గురువారం 19 నవంబరు 2026

ఆపరేషన్ త్రిశూల్ -విద్యార్థులకు మహిళా భద్రత, మాదకద్రవ్యాల నివారణ, బాల్య వివాహాలపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు పట్టణంలోని కన్నన్ జూనియర్ కళాశాలలో బుధవారం ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపిఎస్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటప్ప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలు 112 అత్యవసర సేవలను వినియోగించుకోవాలని, శక్తి యాప్ ద్వారా తక్షణ పోలీస్ సహాయం పొందవచ్చని వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు



ఆకర్షితులు కాకుండా వాటికి దూరంగా ఉండాలని, బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు 112 అత్యవసర పోలీస్ సేవలు, 1972 మరియు ఇతర టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం, వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం ఎలా పొందాలో అవగాహన కల్పించారు. అదేవిధంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై వాటి దుష్ప్రభావాలు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. మహిళలు, బాలికల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ప్రాముఖ్యత, దాని వినియోగ విధానాన్ని తెలియజేశారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలు, బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్, సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ నాయుడు, రిటైర్డ్ ఎస్సై రషీద్ భాష, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మాలతి మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు లాభదాయకం సమగ్ర పంటల యాజమాన్యం

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం చేపట్టాలి -- రైతులకు వ్యవసాయ అధికారుల సూచన

ప్రజా భూమి ప్రతినిధి – బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి డివిజన్ బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో సమగ్ర పంటల యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజ కుమారి మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటల్లో సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను రైతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్ష ఫలితాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని వాటి ఆధారంగానే పంటలకు అవసరమైన ఎరువులను వినియోగించాలని సూచించారు. విచ్చలవిడిగా ఎరువులు వాడటం వల్ల పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా భూమి సారం దెబ్బతినే అవకాశం ఉందని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటల్లో విత్తన శుద్ధి, అంతర పంటలు, రక్షక పంటల సాగు విధానాలతో పాటు సమగ్ర పురుగుల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ, ప్రకృతి వనరులను సంరక్షించుకుంటూ వ్యవసాయం చేయాలని సూచించారు. అనంతరం రైతులకు క్షేత్రస్థాయిలో ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ద్రవ జీవామృతం వినియోగం వల్ల నేలలో సూక్ష్మజీవుల అభివృద్ధికి తోడ్పాటు లభించడంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్. కండ్రిగ వ్యవసాయ విస్తరణాధికారి రేవతి, మండల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు. వ్యవసాయంలో ఆధునిక, ప్రకృతి అనుకూల పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

నరసింగాపురం రైతు సేవా సహకార సంఘ సభ్యులందరూ తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించుకోవాలి -ఎం.డి. ఎం.బాస్కర్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:



చంద్రగిరి మండలం నరసింగాపురం రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ (సింగిల్ విండో) వరిధిలో నభ్యత్వం కలిగిన రైతులందరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి నంఘం కార్యాలయంలో తప్పనిసరిగా ఇ-కెవైసి పూర్తి చేసుకోవాలని ఆ సంఘ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.బాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఇ-కెవైసి చేయించుకోని రైతులు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ఇ-కెవైసి చేయించుకోవడానికి (1) ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ. (2)ఆధార్ కార్డ్ కు లింక్ అయిన మొబైల్ నంబర్. (3) పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ, (4) మీ సేవలో పొందిన 1బి పత్రం తో సభ్యులు తమ వెంట ఫోన్ తీసుకొచ్చి ఇ-కెవైసి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాపున నరసింగాపురం వ్యవసాయ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ పరిధిలో సభ్యత్వం కలిగిన రైతులందరూ పైన తెలిపిన పత్రాలను తీసుకొని సహకార సంఘం కార్యాలయాన్ని సంప్రదించి వెంటనే ఇ-కెవైసి పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు నరసింగాపురం ప్రధాన కార్యాలయం, చంద్రగిరిలోని బ్రాంచి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఆర్ సి పురం ఎంపీపీగా ఈతముక్కల రాధిక, వైస్ ఎంపీపీ గా కొట్టే నరసింహారెడ్డి....?

నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం





రామచంద్రపురం మండల పరిషత్ అధ్యక్షురాలుగా ఈతముక్కల రాధిక ఉమాపతి నాయుడు, వైస్ ఎంపీపీ గా కొట్టే నరసింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యులుగా జాకీర్ సాహెబ్ ను టిడిపి అధిష్టానం ఎంపిక చేసినట్లు సమాచారం. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారిణి ఎస్ వసంతా బాయ్ తెలిపారు. ఎంపిటిసి సభ్యులందరూ ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎన్నికకు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు. మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలలో టిడిపి ఏడు ఎంపీటీసీ స్థలాలను కైవసం చేసుకుంది. రెండు స్థానాలలో వైసిపి గెలుపొందింది. దీంతో ఆర్ సి పురం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులు పీఠం టిడిపికి దక్కనుంది. మధ్యాహ్నం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులచే ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై భక్తవత్సలం తెలిపారు.

జగన్ పథకాలే అస్త్రాలు.. సర్పంచ్ సీట్లే లక్ష్యాలు.. ఎమ్మెల్సీ పిలుపులతో వైసీపీలో జోష్!

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట, నవంబర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సుబ్రహ్మణ్యం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నామినేషన్ల ప్రక్రియ అనంతరం గ్రామానికి చేరుకున్న ఆయన వైసీపీ నాయకులను పరామర్శించి, వారితో సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ గంగయ్య, తిరుమలరెడ్డి అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ దిశానిర్దేశం!

తిరుచానూరు సర్పంచ్ అభ్యర్థిగా పుష్ప మునిరామ్ రెడ్డి నామినేషన్ దాఖలు

అమ్మవారి ఆశీస్సులతో.. ప్రజల మద్దతుతో ముందడుగు - ఓటుకు నోటు సంస్కృతికి స్వస్తి పలికి నిజమైన ప్రజాసేవే లక్ష్యం

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి రూరల్,



తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సర్పంచ్ అభ్యర్థిగా పుష్ప మునిరామ్ రెడ్డి బుధవారం తిరుచానూరు సచివాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, సన్నిహితులు పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులకు అభినందనలు తెలుపుతూ శుభాకాంక్షలు అందించారు. అంతకుముందు నామినేషన్ దాఖలు చేస్తున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నామినేషన్ పత్రాలతోశ్రీ విజయ గణపతి స్వామివారిని,శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీ విజయ గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆలయ ధర్మకర్త పుష్ప మునిరామ్ రెడ్డిని ఆలయ అర్చకులు ఆశీస్సులు అందించారు, అనంతరం బంధుమిత్రులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఆలయం వద్ద నుంచి తిరుచానూరు పంచాయతీ



కార్యాలయం వద్దకు బంధుమిత్రులతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులు మాట్లాడుతూ.. ప్రజల మద్దతు, అమ్మవారి ఆశీస్సులను అండగా భావిస్తూ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశామని తెలిపారు. ఓటుకు నోటు సంస్కృతికి స్వస్తి పలికి, మార్పు దిశగా తిరుచానూరులో నిజమైన ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాబలమే తమ బలం.. అమ్మవారి ఆశీస్సులే తమకు కొండంత అండ అని పేర్కొంటూ, తిరుచానూరు ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని ,పవిత్రమైన తిరుచానూరు అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తామని మీడియా ద్వారా పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులు ప్రజలను వేడుకున్నారు.

సర్పంచ్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజభూమి, ప్రతినిధి, తిరుపతి రూరల్

రానున్న సర్పంచ్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని పిలుపునిచ్చారు.తిరుపతి రూరల్ మండల పరిధిలో నూతనంగా ఎన్నికైన మరియు ఏకగ్రీవంగా గెలుపొందిన కూటమి ఎంపీటీసీ సభ్యులు,మండల స్థాయి నాయకులతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ:ఎంపీటీసీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, అదే ఉత్సాహంతో రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.లి గ్రామాల్లో ఎలాంటి విభేదాలకు తావులేకుండా, కూటమిలోని అన్ని పక్షాల నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపైకి వచ్చి సమష్టిగా పనిచేయాలని తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. లిఈ సమావేశంలో తిరుపతి రూరల్ మండల కూటమి ముఖ్య నాయకులు, నూతనంగా గెలిచిన మరియు ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.2.26 కోట్ల విద్యుత్ బకాయిలు.. చర్యలేవీ?

- వారం రోజుల్లో వసూలు చేయకపోతే విద్యుత్ భవన్ ముట్టడి...

కడప అర్బన్

పెండ్లిమర్రి మండలం చాబిలి గ్రామం వద్ద మైనింగ్ నిర్వహిస్తున్న బెన్ ఇటా కంపెనీ నుంచి రూ. 2.26 కోట్ల విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యులు రూ.500, రూ.వెయ్యి బిల్లులు చెల్లించకపోతే వెంటనే విద్యుత్ కనెక్షన్లు తొలగించే అధికారులు, కోట్లాది రూపాయల బకాయిలున్న కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లతోనే కంపెనీకి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని ఆరోపించారు. కంపెనీపై కేసులు నమోదు చేసి బాధ్యులను అరెస్టు చేయాలని కోరారు. వారం రోజుల్లో బకాయిలు వసూలు చేయకపోతే విద్యుత్ భవన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. చర్యలు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ అధికారి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మక్బూల్ భాషా పాల్గొన్నారు.



టీడీపీ మైనార్టీ నాయకుడు రియాజ్ వైసీపీలో చేరిక!

వైసీపీ నాయకుడు దువ్వూరు విజయల్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న రియాజ్



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండల పరిధిలోని రావిగుంటపాలెం పంచాయతీ పరిధి తీపులపూడి గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు రియాజ్ వైసీపీలో చేరారు. బుధవారం రాత్రి వైసీపీ నాయకుడు దువ్వూరు విజయ్ రెడ్డి సమక్షంలో ఆయన వైసీపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దువ్వూరు విజయల్ రెడ్డి రియాజ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు.

కొడవలూరు దామోదర్ రెడ్డికి రావిగుంటపాలెం వైకాపా నేతల ఘన సన్మానం!



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు సీనియర్ రాజకీయ నాయకుడు, వైకాపా సీఈసీ సభ్యుడు కొడవలూరు దామో దర్ రెడ్డిని రావిగుంటపాలెం వైకాపా నాయకులు ఘనంగా సన్మానించారు.రావిగుంటపాలెం గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు దువ్వూరు విజయల్ రెడ్డి సమక్షంలో ఇటీవల వైకాపాలో చేరిన టీడీపీ మైనార్టీ నాయకుడు రియాజ్‌తో పాటు పలువురు వైకాపా నాయకులు, కార్యక రర్తలు బాలిరెడ్డిపాలెం గ్రామానికి వెళ్లి దామోదర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి వారందరికీ అభినందనలు తెలియజేస్తూ, రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

గ్రామ సర్పంచ్ నామినేషన్ల స్వీకరణ..

ప్రజాభూమి యల్లనూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం యల్లనూరు మండల వ్యాప్తంగా నవంబర్ 18 న గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేయు అభ్యర్థుల నామినేషన్ల యొక్క వివరాలు ఇలా ఉన్నాయి మొత్తం 5 నామినేషన్ సెంటర్ల నుండి సంబంధిత అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు 70 మంది వార్డు మెంబర్లు నామినేషన్లు వేయగా 19 మంది సర్పంచ్ పదవికి నామినేషన్ వేసినట్లు ఎంపీడీవో మనోహర్ బాబు తెలిపారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
గురువారం 19 నవంబరు 2026

ఏఐటీయూసీ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

• ఏఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి పిలుపు
• పాల్గొన్న ప్రధాన కార్యదర్శి బాదుల్లా,జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్



ప్రజాభూమి, – కడప అర్బన్

ఏ ఐ టి యు సి జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి , వైఎస్ఆర్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బాదుల్లా, వైఎస్ఆర్ కడప జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు గుంటి వేణుగో పాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 26 తేదీలలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూ రులో జరిగే ఏఐటి యూసి జాతీయ సభలో కార్మిక సోదరులు పాల్గొని తమ హక్కులు, చట్టపరమైన రక్షణలు తెలుసు కోవాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ కాలం లో నుంచి వస్తున్న ఎనిమిది గంటల పని దినాన్ని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సెలవులు, సంక్షేమ పథకాలు మొదలగు కార్మిక వర్గ సంక్షేమం కోసం ఏఐటీయూసీ పోరాడి హక్కులను తెచ్చుకుందామని తెలిపారు. స్వాతంత్ర ఉద్యమం తో పాటు కార్మికుల హక్కుల కోసం కూడా ఏఐటీయూ పోరాడిందని తెలిపారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు ట్రేడ్ యూనియన్ చట్టాలను తుంగలోకి తొక్కి కార్మిక హక్కులను కాలరాస్తున్నారు అని తెలిపారు. కార్మిక హక్కులను అన్నిటిని తొలగించి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి పెట్టుబడిదారులకు రాజబాట వేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి తెరలేపుతామని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్ర కార్మికులు ఈ సభలో పాల్గొంటున్నారని మన రాష్ట్రము నుంచి కూడా కార్మిక సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్దిలేటి నగర అధ్యక్షులు మల్లికార్జున, విజయలక్ష్మి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శింగనమల మండలంలో తొలిరోజు 9 సర్పంచ్ నామినేషన్లు..2 వార్డు సభ్యుల నామినేషన్లు



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల వ్యాప్తంగా బుధవారం తొలిరోజు మొత్తం 9 సర్పంచ్ నామినేషన్లు, 2 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్ పదవులకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. వివరాల ప్రకారం వెస్ట్ నరసాపురంలో 2, గుమ్మేపల్లిలో 1, తరిమెలలో 2, జూలకల్వలో 1, చక్రాయపేటలో 1, పి.మట్లగొండిలో 1, శింగనమలలో 1 నామినేషన్ దాఖలైంది. అలాగే తరిమెల గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుల పదవులకు సంబంధించి 2 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

అయ్యప్ప మాలధారులకు అన్నదాన సేవలు అభినందనీయం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

అన్నదానం అన్ని దానాలకెల్లా శ్రేష్ఠమై నదని, 48 రోజులపాటు అయ్యప్ప భక్తులకు అన్నదాన సేవలు అందించేం దుకు ముందుకు రావడం అభినంద నీయమని నేతలు పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయం అన్నదాన భవనంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామివారికి పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, దాతల సహకారంతో 48 రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమమన్నారు. అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములకు, దీక్షాపరులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు భక్తిభావాన్ని, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, ఎమ్మెల్యే బాలకృష్ణ అధికారిక కార్యదర్శి వీరయ్య, టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, జనసేన నేత నవీన్, అన్నదాన కమిటీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు నిమ్మకాయల రాము, టీడీపీ నాయకులు చంద్రమోహన్ యాదవ్, పరిమళ, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మురళి, గురుస్వాములు, అన్నదాన కమిటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి దిశానిర్దేశం

- గ్రామస్థాయిలో కూటమి శ్రేణులు ఐకమత్యంతో ముందుకు సాగాలి



ప్రజాభూమి, రాయచోటి

రాయచోటి నియోజకవర్గంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న పి.సి.ఆర్. ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ, ప్రస్తుత పరిస్థితులు, పార్టీ తరఫున అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలతో సమగ్రంగా చర్చించారు. ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, అభ్యర్థుల ఎంపిక నుంచి నామినేషన్ ప్రక్రియ వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ, ప్రజల మద్దతుతో రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

అవినీతి ఆరోపణలపై సీటీవో కృష్ణవేణిపై సస్పెన్షన్ వేటు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ అధికారిణి (సీటీవో) కృష్ణవేణిపై సస్పెన్షన్ వేటు పడింది. గుజరీ వ్యాపారి నుంచి రూ.10 వేల నగదు తీసుకుంటున్నట్లు వెలుగులోకి వచ్చిన వీడియోతో పాటు, ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో శాఖ ఉన్నతాధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ మేరకు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అహ్మద్ బాబు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. హిందూపురానికి చెందిన గుజరీ డీలర్ ఫయాజ్ నుంచి సీటీవో కృష్ణవేణి రూ.10 వేల నగదు తీసుకుంటున్న వీడియో మూడు రోజుల క్రితం వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఈ పరిణామాలపై స్పందించిన శాఖ కమిషనర్ విచారణకు ఆదేశిస్తూ డిప్యూటీ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీన సీటీవో కృష్ణవేణితో పాటు డీలర్ ఫయాజ్‌ను కూడా విచారించినట్లు సమాచారం. విచారణ ప్రక్రియ కొనసాగుతుండగానే కృష్ణవేణిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. రెండేళ్లలో రెండుసార్లు సస్పెన్షన్.. కృష్ణవేణి రెండేళ్ల వ్యవధిలో ఒకే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో రెండుసార్లు సస్పెన్షన్‌కు గురికావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ శాఖల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలు, శాఖలో పారదర్శకతపై ఈ పరిణామం మరోసారి చర్చకు తెరలేపింది. ఇదిలా ఉండగా, కృష్ణవేణి స్థానంలో హిందూపురం సీటీవోగా ఎవరిని నియమిస్తారనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

పుట్లూరు మండలంలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పుట్లూరు పంచాయతీకి సంబం ధించి సర్పంచ్ అభ్యర్థిగా ఒక నామినేషన్ దాఖలు చేయడం జరిగినది. బాలాపురం పంచాయతీకి సంబంధించి సర్పంచ్ అభ్యర్థులుగా ముగ్గురు, 3 5 7 వార్డులకు సంబంధించి ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయడం జరిగినది. చాల వేముల పంచాయతీకి సంబంధించి సర్పంచ్ అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే వార్డులకు సంబంధించి 1 నుండి 8 వార్డులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయడం జరిగినది. రంగరాజు కుంట పంచాయతీలో సర్పంచ్ ఎబ సంబంధించి రెండు నామినేషన్లు దాఖలు చేయడం జరిగినది. మడుగుపల్లికి సంబంధించి ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు, ఎస్ గూడూరు కు సంబంధించి ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు, 9 మంది వార్డు సభ్యులు నామినేషన్ వేయడం జరిగినది. తక్కలపల్లి పంచాయతీకి సంబంధించి సర్పంచ్ అభ్యర్థి ఒకరు వార్డు సభ్యులు ముగ్గురు నామినేషన్ వేయడం జరిగినది. కొండేపల్లి పంచాయతీలో ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు ముగ్గురు వార్డు మెంబర్లుగా నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో అలివేలమ్మ బుధవారం సందర్శించడం జరిగినది.

పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు భారీ పోలీసు బందోబస్తు

ఎస్ఐ సాగర్, సీఐ రాగే రామయ్య పర్యవేక్షణలో భద్రతా చర్యలు



ప్రజా భూమి -- నార్పల:

నార్పల మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నామినేషన్ల కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్ఐ సాగర్, సీఐ రాగే రామయ్య నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. అభ్యర్థులు, వారి మద్దతుదారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలు, అభ్యర్థులు పోలీసులకు సహకరించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు.

దొమ్మరాజు మోహన్ రాజుకు నివాళులర్పించిన చమర్తి జగన్ మోహన్ రాజు



ప్రజా భూమి -- నందలూరు

నందలూరు మండలం టీవీ పురం నివాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కీర్తిశేషులు దొమ్మరాజు మోహన్ రాజు ఇటీవల పరమపదించగా, ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి రాజంపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ రాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉపాధ్యాయుడిగా ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జంగం శెట్టి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శింగనమల సర్పంచ్ అభ్యర్థిగా తొలి నామినేషన్ దాఖలు చేసిన జె. రామ్ చరణ్ యాదవ్



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో శింగనమల గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా జె. రామ్ చరణ్ యాదవ్ తొలి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీస్సులతో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

50 మంది విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం..



ప్రజా భూమి – నార్పల:

59వ జాతీయ గ్రంథాలయ వారో త్సవాల్లో భాగంగా నార్పల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఐదో రోజు బుధవారం పలు విద్యా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నార్పల జిల్లా పరిషత్ బాలికల ఉన్న త పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వ్యాసరచన పోటీల ద్వారా తమ ఆలోచనలను అక్షరరూపంలో వ్యక్తం చేయగా, చిత్రలేఖన పోటీల్లో తమ సృజనాత్మకతను రంగుల రూపంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తి, రచనా నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించడమే గ్రంథాలయ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఏ. కావేరి తదితరులు పాల్గొన్నారు.

గడ్డంనాగేపల్లి సర్పంచ్ బరిలోకి వెంకట్ నాయుడు

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల పోరుకు సిద్ధం..
గ్రామంలో మొదలైన రాజకీయ సందడి



ప్రజా భూమి -- నార్పల:

నార్పల మండలంలోని గడ్డంనాగేపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ ఎన్నికల్లో గ్రామానికి చెందిన వెంకట్ నాయుడు బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. గ్రామ సర్పంచ్ పదవిని లక్ష్యంగా చేసుకుని ఎన్నికల పోరుకు సమాయత్తమవుతున్నారు.

గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. గ్రామంలో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలవనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నార్పల మండలంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. గడ్డంనాగేపల్లిలో వెంకట్ నాయుడు సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతుండటంతో గ్రామ రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది.

వైస్ చైర్మన్, కోఆప్షన్ పదవులు వాల్మీకులకే ఇవ్వాలి

--బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రబాబుకు వినతి



ప్రజాభూమి,
హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవితో పాటు కోఆప్షన్ సభ్యుడి పదవిని కూడా వాల్మీకి సామాజిక వర్గానికి కేటాయించాలని వాల్మీకి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటరమణప్ప మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలో సుమారు 50 వేల మంది వాల్మీకి సామాజికవర్గ ప్రజలు ఉన్నారని తెలిపారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా ఉంటూ, బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తమ సామాజికవర్గానికి 12 కౌన్సిలర్ స్థానాలతో పాటు చైర్మన్ పదవిని కేటాయించాలని కోరినప్పటికీ, కేవలం మూడు కౌన్సిలర్ స్థానాలే కేటాయించారని తెలిపారు. అయినప్పటికీ పార్టీ నిర్ణయాన్ని గౌరవించి, కేటాయించిన మూడు స్థానాల్లోనూ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకున్నామని పేర్కొన్నారు. పార్టీకి ఎన్నో ఏళ్లుగా అండగా నిలుస్తున్న తమ సామాజికవర్గానికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవితో పాటు కోఆప్షన్ సభ్యుడి పదవిని కూడా వాల్మీకులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉపాధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో దామోదరమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి దశలో భాగంగా ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు ఈ ప్రక్రియలో పాల్గొని నిర్దిష్ట విధానం ప్రకారం ఎంపీపీ, ఉపాధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకోనున్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు.

ప్రజాభూమి

జనరల్ 10

గురువారం 19 నవంబర్ 2026



ఆరు నెలల్లో పీఆర్సీ నివేదిక.. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

పీఆర్సీ నివేదికను ఆరు నెలల్లో సమర్పించి, అప్పటిలోగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. పాండురంగ వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అడవినెక్కలం, ఆగిరిపల్లి, ఈదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కలిశారు. పెండింగ్‌లో ఉన్న మూడు కరవు భత్యాలు, పీఆర్సీ అమలులో జాప్యంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని, బోధనేతర పనుల ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో వినిపించేందుకు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రెడ్డిదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామారావు, మండల బాధ్యులు కే. లక్ష్మీకమల్, పి.శ్రీనివాసరావు, మక్కే వేణుగోపాలరావు, ఎల్.ఎన్. రాజు, ఎం.దినేష్, ఎన్. కొండయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీ వేగవంతం

- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి భారత ఎన్నికల సంఘం అధికారులకు తెలిపారు. బుధవారం భారత ఎన్నికల సంఘ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులు, జిల్లా కలెక్టర్లు, రోల్ అబ్జర్వర్లతో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితా తయారీ పురోగతిపై వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృష్ణా జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియ పురోగతిని వివరిస్తూ, గత 2021 సంవత్సర తుది ఓటర్ల జాబితాలో 3,085 మంది ఓటర్లు నమోదయ్యారని, ప్రస్తుత డి నోవో ప్రక్రియలో ఇప్పటివరకు 2,751 దరఖాస్తులు అందాయని తెలిపారు. గతంలో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోలిస్తే సుమారు 300 మంది తక్కువగా ఉన్నారని, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఈ వ్యత్యాసాన్ని అధిగమించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలనలో సుమారు 1,800 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించి, చట్టబద్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో అంచనా ఓటర్ల సంఖ్య సుమారు 3,970గా ఉందని వివరించారు. జిల్లాలోని పలు విద్యాసంస్థలు విజయవాడ పరిధికి సమీపంలో ఉండటంతో, కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో కొందరు విజయవాడలో నివాసం ఉండే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నమోదు వివరాలను మరోసారి సమగ్రంగా పరిశీలించి, క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియలో అర్హులైన ఓటర్లు అదనంగా నమోదయ్యేలా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, డీఈవో యువి సుబ్బారావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు

- దైవనామ స్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం..

భక్తిశ్రద్ధలతో శరణుఘోష



ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని శ్రీ దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ ప్రాంగణంలో దేవా గణేష్ స్వామి చే ఏర్పాటు చేసిన శ్రీ ధర్మశాస్త్ర స్వామి వారి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత, ఫలరస, క్షీర, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, స్నపనాలంకరణ, ప్రత్యేక అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గురుస్వాములు పండు, నరసింహస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు భక్తిపారవశ్యంతో శరణుఘోష, శరణాలాపనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ పూజా కార్యక్రమాల్లో అయ్యప్ప మాలధారులు, శివమాలధారులు, భవానీ మాలధారులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి – చాట్రాయి

చాట్రాయి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్కు సాగు చేసిన వరి పొలాలు కోతకు వచ్చి ఉన్నాయి కావున రైతులు ఆర్ ఎస్ కె ల ద్వారా ప్రభుత్వం కల్పించేటటువంటి గరిష్ట ఎం ఎస్ పి ధరను పొందవలెనని మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివశంకర్ రైతులను కోరడమైనది. అనంతరం ఆయన మాట్లాడుతూఈ ఖరీఫ్ సీజన్ కు వరి మద్దతు ధర గ్రేడ్ ఏ రకమునకు క్వింటాకు 2461/-రూపాయలు కామన్ వరి రకమునకు2441/-రూపాయలు గా ప్రభుత్వం ప్రకటించడం జరిగినదనీ రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత ఆర్ఎస్కే వద్ద తేమశాతాన్ని పరీక్షించుకొని 17% వచ్చిన పిదప ధాన్యం కొనుగోలు కేంద్రానికి వేయవలసిందిగా రైతులని తెలియజేయడమైనది. చాట్రాయి మండలంలో



బూరు గూడెం, చనుబండ, చాట్రాయి, చీపురుగూడెం, చిన్నంపేట, ఆరుగొలనుపేట, మర్లపాలెం, నరసింహారావు పాలెం, పోలవరం పోతనపల్లి ,తుమ్మగూడెం గ్రామాలతో కలిపి 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగినదనీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని రైతులు 24 గంటల్లో డబ్బును రైతులు ఎకౌంట్లో పొందగలరనీ అన్నారు. బుధవారంచాట్రాయి గ్రామంలోని ఆర్.ఎస్.కె వద్ద మండల తాసిల్దార్ జి శ్వేత ,, వ్యవసాయ అధికారి శివశంకర్ మాయిశ్చర్ మీటర్ పని చేయు విధానము , ధాన్యం తేమ శాతాన్ని రైతులతో పరీక్షించి వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాదారుడిపై పీట నిర్బంధ చట్టం ప్రయోగం!

- ప్రభుత్వ ఉత్తర్వులతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలింపు



ప్రజా భూమి ప్రతినిధిఅనకాపల్లి / నక్కపల్లి

గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ పదేపదే పోలీసులకు పట్టుబడుతున్న పాత నేరస్థుడిపై అనకాపల్లి జిల్లా పోలీసులు పీట నిర్బంధ చట్టాన్ని ప్రయోగించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పీట నిర్బంధ చట్టం–1988లోని సెక్షన్ 3(1) ప్రకారం అడ్డూరి ప్రసాద్ (30)పై నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నవంబర్ 9న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించారు. నర్సీపట్నం ఉపవిభాగ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో, నక్కపల్లి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి, మాదకద్రవ్యాల నిరోధక విభాగం ఇన్స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టారు.

మూడు గంజాయి కేసుల్లో నిందితుడు

రావికమతం మండలం కొత్తకోట గ్రామంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన అడ్డూరి ప్రసాద్ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని అక్రమంగా సేకరించి అనకాపల్లి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతనిపై గతంలో మూడు గంజాయి అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి.

నేరాల వివరాలు ఇలా..

1. నక్కపల్లి పోలీస్ స్టేషన్ – కేసు నంబరు 549/2020: వేంపాడు కూడలి వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 148 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది.

2. నక్కపల్లి పోలీస్ స్టేషన్ -- కేసు నంబరు 85/2025: వేంపాడు సుంకపు వసూలు కేంద్రం సమీపంలో 12 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసు నమోదైంది.

3. నాతవరం పోలీస్ స్టేషన్ -- కేసు నంబరు 158/2025: తాండవ కూడలి సమీపంలో కారు, ద్విచక్ర వాహనాల ద్వారా బెంగళూరుకు తరలిస్తున్న 74 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

అక్ర రవాణాకు అడ్డుకట్ట వేసేందుకే కఠిన చర్యలు

మూడు కేసులు నమోదైనప్పటికీ తన పద్ధతి మార్చుకోకుండా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నేపథ్యంలో, అతని కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పీట నిర్బంధ చట్టం కింద ఈ చర్యలు చేపట్టింది.

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పీట నిర్బంధ చట్టం కింద నిర్బంధిస్తామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

48వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ..

- పూడిక తొలగింపు పనులు చేపట్టిన కార్పొరేటర్ చంటి!

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ



విజయవాడ బ్రాహ్మణ వీధిలోని సంపర రాంబాబు కళ్యాణ మండపం వెలుపల ఈరోజు వీఎంసీ సిబ్బందితో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. 48వ డివిజన్ కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీకి చెందిన ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) స్వయంగా పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. డివిజన్ పరిధిలో డ్రైనేజీ పూడిక తొలగింపు, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. 48వ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



టిడిపి నుంచి కర్నేన రోజారమణి, గౌరు నాయుడు దంపతులను సస్పెండ్ వేటు

- రెబల్‌గా చైర్ పర్సన్ అభ్యర్థిగా రోజా రమణి నామినేషన్.

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా రెబల్‌గా నామినేషన్ దాఖలు చేసిన కర్నేన రోజారమణి, ఆమె భర్త గౌరు నాయుడులను టీడీపీ నుంచి సస్పెండ్ వేటు పడింది .ఈ మేరకు బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు పత్రికలకు ప్రకటన విడుదల చేశారు.గత కొంతకాలంగా గౌరు నాయుడు, రోజారమణి దంపతులు పార్టీ కార్యక్రమాలకు సహకరించకుండా వ్యవహరించడంతో పాటు, పార్టీకి వ్యతిరేకంగా పలుమార్లు సోషల్ మీడియా వేదికగా బహిరంగ వ్యాఖ్యలు చేశారని ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా పార్టీ అధిష్టానం నిర్ణయానికి విరుద్ధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా రోజారమణి రెబల్‌గా నామినేషన్ దాఖలు చేయడాన్ని కూడా పార్టీ తీవ్రంగా పరిగణించింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన కారణంగా వారిద్దరి తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు వేస్తూ జిల్లా అధ్యక్షుడు రామరాజు నిర్ణయం తీసుకున్నారు.

ఆయుర్వేద విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం

- వైభవంగా ముగింపు వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ



విజయవాడలోని డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ప్రథమ సంవత్సరం బి.ఏ.ఎం.ఎస్. కోర్సులో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం నిర్వహించిన “ఆయుర్ ప్రవేశిక” పరిచయ కార్యక్రమం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. నూతన విద్యార్థులకు ఆయుర్వేద వైద్యశాస్త్ర మౌలిక సూత్రాలు, తత్వాలు, విద్యా ప్రణాళిక, కళాశాల కార్యకలాపాలు, వృత్తిపరమైన నైతిక విలువలు, ఆయుర్వేద వైద్యునిగా నిర్వహించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేందుకు, ఆయుర్వేద వైద్యరంగంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ ముగింపు వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డా. టి.బుల్లయ్య, వైద్యశాల సూపరింటెండెంట్ డా. పి. జగదీష్, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్) డా.ఆర్.వి. శాంతకుమారి పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆయుర్వేద విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర అధ్యయనం, వృత్తిపరమైన నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా, వైద్య మరియు క్లినికల్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన, మానవతా విలువలు కలిగిన ఆయుర్వేద వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై విలువైన ఉపన్యాసాలు అందించిన అతిథి వక్తలకు, రిసోర్స్ పర్సన్స్‌కు మరియు కళాశాల అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ డా. టి. బుల్లయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి విజ్ఞానపూర్వక ప్రసంగాలు, అనుభవాలు మరియు మార్గదర్శకత్వం నూతన విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు.ఆయుర్ ప్రవేశిక కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న నూతన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, వైద్యశాల సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం అభినందించి, వారి భవిష్యత్ విద్యాభ్యాసం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమం ముగింపులో అతిథి వక్తలకు, అధ్యాపకులకు, నిర్వాహకులకు మరియు విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు.

మోడరన్లో బ్రోచర్, డైరీలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ మహేష్ కూమార్

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ఉన్న ప్రముఖ విద్యాసంస్థయిన మోడరన్ విద్యాసంస్థల బ్రోచర్, డైరీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ అమలాపురం కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత విద్యను నామమాత్రపు ఫీజులతో మోడరన్ విద్యాసంస్థలు అందజేయడం హర్షణీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బాలిక విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు అభినందనీయులని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం మోడరన్ విద్యాసంస్థల అధినేత జి. వి. రావు మాట్లాడుతూ 49 ఏళ్లుగా విశిష్ట ప్రస్థానం కొనసాగిస్తున్న మోడరన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, 2028లో జరగనున్న స్వర్ణోత్సవ వేడుకలకు ముందస్తుగా విద్యార్థుల కోసం భారీ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రకటించినిచిదని తెలిపారు.”మా ప్రస్థానం – మీ విశ్వాసం నినాదంతో కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందిస్తున్న మోడరన్ విద్యాసంస్థలు, గోల్డెన్ జూబిలీ సందర్భంగా రూ. 1 కోటి విలువైన స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు . ఈ స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్ష ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్ 20 ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి 11:30 కి రామచంద్రపురంలోని మోడరన్ కాలేజీ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు.పరీక్ష సిలబస్ 10వ తరగతి గణితం, భౌతిక శాస్త్రం ఆధారంగా ఉంటుందన్నారు .ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ 2027–29 విద్యా సంవత్సరంలో స్కాలర్‌షిప్ లభిస్తుందని, ఈ స్కాలర్‌షిప్ కేవలం జెఈఈ,నీట్, ఈఎపిసెట్ కోర్సులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.ఇంటర్‌లోనే ఐఐటీ, మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇది పెద్ద అవకాశమని తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ప్రతి విద్యార్థికి సమ్మర్‌లో నిర్వహించే పాలీసెట్ , ఎపిఆర్జేసీ ఇంటర్ బ్రిడ్జి కోర్సులకు కోచింగ్ ని పూర్తి ఉచితంగా అందిస్తామని వివరించారు.ఇంటర్‌లో చేరే ముందే పునాది బలపడేలా ఈ బ్రిడ్జ్ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 2028లో మోడరన్ విద్యాసంస్థల గోల్డెన్ జూబిలీ వేడుక సందర్భంగా స్కాలర్‌షిప్ ఎంపికకు హాజరైన ప్రతి విద్యార్థికి “మోడరన్ గోల్డెన్ జూబిలీ గిఫ్ట్ వోచర్ “ పేరున రూ. 5,000/- వోచర్ అందజేస్తారని తెలిపారు.ఎంపిక కాకపోయినా హాజరైన ప్రతి ఒక్కరికీ ఈ వోచర్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.అంతేకాకుండా స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి రూ.100 విలువ గల ఎస్.ఎస్.సి –2027 బిట్ బ్యాంకు ను ఉచితంగా ఇవ్వన్నట్లు తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇది బాగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్. ప్రకాష్ మాట్లాడుతూ..ఈ స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్షకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ. 50/- నామమాత్రముగా నిర్దేశించామన్నారు.మరిన్ని వివరాలకు: 08857-242489, 98487 83737, 81215 03888, 97056 69696. మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. తమ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనుకునే తల్లిదండ్రులు,ప్రస్తుత 10వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.


ప్రజాభూమి
పోలవరం 11
గురువారం 19 నవంబరు 2026

టీడీపీ,జనసేన-సీపీఎం పొత్తుతో మారిన రాజకీయ సమీకరణాలు!

- వి.ఆర్.పురం ఎంపీపీ పీఠం టీడీపీ ఖాతాలోకి.. తొలిసారిగా ఎంపీపీగా గొంది చంద్రయ్యకు అవకాశం
- ఎంపీటీసీ ఫలితాల అనంతరం తెరపైకి కొత్త రాజకీయ పరిణామాలు..
- సీపీఎం మద్దతుతో ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోనున్న టీడీపీ
- వడ్డిగూడెంలో 600 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన గొంది చంద్రయ్యకు కీలక బాధ్యతలు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం



పోలవరం జిల్లా వి.ఆర్.పురం మండల రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల అనంతరం మండలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎంపీపీ పీఠాన్ని దక్కించుకునే విషయంలో తెలుగుదేశం జనసేన పార్టీలు, సీపీఎం నాయకత్వాల మధ్య కుదిరిన పొత్తు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మూడు పార్టీల మధ్య కుదిరిన అవగాహనతో వి.ఆర్. పురం మండల పరిషత్ అధ్యక్ష పీఠం టీడీపీకి దక్కనుంది. వడ్డిగూడెం ఎంపీటీసీగా 600 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన టీడీపీ సీనియర్ నాయకుడు గొంది చంద్రయ్యను ఎంపీపీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో రేపు ఆయన తొలిసారిగా ఎంపీపీ పీఠాన్ని అధిరోహించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మండలంలోని ఏడు స్థానాల్లో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. రేఖపల్లి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్సీపీ అభ్యర్థి సోడే దినేష్ 212 ఓట్ల మెజారిటీతో విజయం సాధించగా, వడ్డిగూడెంలో టీడీపీ అభ్యర్థి గొంది చంద్రయ్య 600 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. చినమట్టపల్లిలో సీపీఎం అభ్యర్థి సున్నం రాజులు 96 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదేవిధంగా ములకనపల్లి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్సీపీ అభ్యర్థి బొగ్గా సంకురమ్మ 305 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, రామవరం స్థానంలో సీపీఎం అభ్యర్థి కారం సుందరయ్య 225 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జీడిగుప్పలో జనసేన అభ్యర్థి కనుగుల హేమలత 212 ఓట్ల తేడాతో గెలుపొందారు. శ్రీరామగిరి ఎంపీటీసీ స్థానంలో వైఎస్సార్సీపీ అభ్యర్థి సోడే చిరంజీవి 48 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎంపీపీ ఎన్నికలో కీలకంగా మారిన సీపీఎం మద్దతును కూటమి కోరినట్లు తెలుస్తోంది. వడ్డిగూడెం ఎంపీటీసీగా గెలుపొందిన గొంది చంద్రయ్యతో పాటు, సీపీఎం తరపున విజయం సాధించిన రామవరం ఎంపీటీసీ కారం సుందరయ్య, చినమట్టపల్లి ఎంపీటీసీ సున్నం రాజులు, జనసేన తరపున జీడిగుప్పలో గెలుపొందిన కనుగుల హేమలత మద్దతుతో ఎంపీపీ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ-సీపీఎం మధ్య రాజకీయ అవగాహన కుదిరినట్లు సమాచారం. ఈ పొత్తులో భాగంగా టీడీపీ సీనియర్ నాయకుడు గొంది చంద్రయ్యకు ఎంపీపీ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో వి.ఆర్.పురం మండల పరిషత్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. స్థానిక రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న గొంది చంద్రయ్యకు ఎంపీపీ పదవి దక్కడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. మరోవైపు ఎంపీపీ ఎన్నికలో ఈ పొత్తు ఎలాంటి ప్రభావం చూపనుంది? మండల అభివృద్ధి, గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారంలో నూతన నాయకత్వం ఎలాంటి ప్రాధాన్యత ఇస్తుంది? అన్న అంశాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, గిరిజన సంక్షేమం, అసంపూర్తి అభివృద్ధి పనులపై కొత్త పాలకవర్గం దృష్టి సారించాలని ప్రజలు ఆశిస్తున్నారు. మొత్తంగా ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలతో మొదలైన రాజకీయ పోరు, టీడీపీ, జనసేన--సీపీఎం పొత్తుతో మరో కీలక మలుపు తిరిగింది. గొంది చంద్రయ్య ఎంపీపీగా బాధ్యతలు చేపట్టనుండటంతో వి.ఆర్.పురం మండల రాజకీయాల్లో రేపటి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

యూటీఎఫ్ గంగవరం మండల నూతన కార్యవర్గం ఎన్నిక

- అమరజీవుల ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేయాలి
- యూటీఎఫ్ పోలవరం జిల్లా సహాధ్యక్షులు ఎస్ నాగేశ్వరరావు

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం



ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)గంగవరం మండల నూతన కౌన్సిల్ సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు మండల అధ్యక్షులు కె.బొజ్జి దొర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన యూటీఎఫ్ పోలవరం జిల్లా సహాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ,యూటీఎఫ్ వ్యవస్థాపక అమరజీవులు చెన్నుపాటి లక్ష్మయ్య,అప్పారి వెంకటస్వామి దాచూరి రామిరెడ్డి తదితర నాయకులు ఉపాధ్యాయ హక్కులు,విద్యారంగ అభివృద్ధి కోసం సాగించిన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు అమరజీవుల ఆశయాల సాధనకు నూతన కార్యవర్గం అంకితభావంతో కృషి చేయాలని సూచించారు తొలుత సీనియర్ ఉపాధ్యాయులు రఘుబాబు దొర యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు అనంతరం యూటీఎఫ్ వ్యవస్థాపకులు చెన్నుపాటి లక్ష్మయ్య,అప్పారి వెంకటస్వామి దాచూరి రామిరెడ్డి,నాగటి నారాయణ,టి.జి.వాషింగ్టన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ యూటీఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితమైన సంఘం కాదని,విద్యారంగ పరిరక్షణ,సామాజిక న్యాయం,ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ ఉద్యమమని పేర్కొన్నారు అనంతరం గంగవరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా చవలం రాంబాబు దొర, అధ్యక్షులుగా కారం బొజ్జిదొర ప్రధాన కార్యదర్శిగా చెదల రామకృష్ణారెడ్డి మహిళా అధ్యక్షురాలిగా ఎల్.రుక్మిణీదేవి, సహాధ్యక్షులుగా రాములు కొండ చిన్న వెంకటరెడ్డి కోశాధికారిగా చవలం కృష్ణదొర ఎన్నికయ్యారు వీరితో పాటు ఏడుగురు జిల్లా కౌన్సిలర్లు ఐదుగురు మహిళా కమిటీ సభ్యులు ఐదుగురు సీపీఎస్ కమిటీ సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ ఐక్యతను కాపాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు ముఖ్యంగా గిరిజన ప్రాంత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ఉపాధ్యాయులందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు అమరజీవులు ఆశించిన సమసమాజ స్థాపన,విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల హక్కుల సాధన లక్ష్యంగా నూతన కార్యవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు

డిసెంబర్ 23న
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- జనవరి 12, 2027 వరకు క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ - ఫిబ్రవరి 2న తుది ఓటర్ల జాబితా విడుదల
- ఓటరు నమోదుకు 1,068 దరఖాస్తులు అందాయి.. 955 ఆమోదం, 111 తిరస్కరణ..
- ఏఈఆర్ఓ లాగిన్‌లో ఉన్న మరో రెండు దరఖాస్తులను క్లియర్ చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం



ఉమ్మడి తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను డిసెంబర్ 23వ తేదీన ప్రచురించనున్నట్లు పోలవరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, దరఖాస్తుల పరిశీలన, ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్దిష్ట గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల సెల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ, అందిన దరఖాస్తుల పరిశీలన, ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు అందిన దరఖాస్తుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

1,068 దరఖాస్తులు అందాయి.. 955 ఆమోదం, 111 తిరస్కరణ

జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 1,068 దరఖాస్తులు అందినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటిలో 955 దరఖాస్తులను ఆమోదించగా, డబుల్ ఎంట్రీ, డూప్లికేట్ నమోదుల కారణంగా 111 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. మిగిలిన రెండు దరఖాస్తులు ఏఈఆర్ఓ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా పరిశీలించి త్వరితగతిన క్లియర్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను రెండు దశల్లో క్షుణ్ణంగా పూర్తి చేయాలని, అర్హులైన ఉపాధ్యాయుల దరఖాస్తులు ఎలాంటి కారణంతోనూ పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డిసెంబర్ 23 నుంచి క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ

ఫారం-19 ద్వారా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ గడువు నవంబర్ 6వ తేదీతో ముగిసిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అందిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 18వ తేదీ నాటికి ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, ముద్రణ ప్రక్రియ పూర్తి చేయాలని, డిసెంబర్ 23వ తేదీన ముసాయిదా జాబితాను ప్రచురించాలని అధికారులకు సూచించారు.డిసెంబర్ 23, 2026 నుంచి జనవరి 12, 2027 వరకు కొత్త దరఖాస్తులు, క్లెయిములు, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 27వ తేదీ నాటికి వాటి పరిష్కారం, అనుబంధ జాబితాల ముద్రణ పూర్తి చేసి, ఫిబ్రవరి 2, 2027న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో 158 విద్యాసంస్థల్లో 1,074 మంది ఉపాధ్యాయులు అర్హులు

పోలవరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు సంబంధించి మొత్తం 158 విద్యాసంస్థల్లో 1,074 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటిలో 138 ప్రభుత్వ పాఠశాలలు, 15 ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు, మరో 5 పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు. ఆయా విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హతలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసి అయి ఉండాలని కలెక్టర్ తెలిపారు. గత ఆరేళ్లలో కనీసం మూడేళ్లపాటు గుర్తింపు పొందిన సెకండరీ పాఠశాల లేదా అంతకంటే పైస్థాయి విద్యాసంస్థలో బోధనా అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో, అడాక్ ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి అర్హత ఉండదని స్పష్టం చేశారు.ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కౌంటర్ సంతకంతో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకటి కంటే ఎక్కువ విద్యాసంస్థల్లో పనిచేసిన ఉపాధ్యాయులు ఆయా సంస్థల అధిపతుల నుంచి ధ్రువీకరణ పత్రాలు జతచేయాలని సూచించారు. సాధారణ అసెంబ్లీ ఓటర్ల జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు లభించదని, ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకుని నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అర్హులైన ఉపాధ్యాయులు అపకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇప్పటివరకు ఓటరుగా నమోదు చేసుకోలేకపోయిన అర్హులైన ఉపాధ్యాయులు డిసెంబర్ 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన అనంతరం జనవరి 12, 2027 లోగా అవసరమైన ఆధారాలతో నవీకరించిన ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్లు 31, 32 ప్రకారం శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. అర్హులైన ఉపాధ్యాయులందరూ నిర్దిష్ట గడువులోగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్ శివ రావు, డి డి (ట్రైబల్ వెల్ఫేర్) రుక్మందయ్య, , ఎన్నికల సెల్ సిబ్బంది మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సూరంపాలెం జలాశయంలో 6 లక్షల చేప పిల్లల విడుదల

-గిరిజన మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలంలోని సూరంపాలెం జలాశయంలో సుమారు 6 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ అధికారుల సమక్షంలో విడుదల చేశారు చేపల ఉత్పత్తిని పెంపొందించి గిరిజన మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు సూరంపాలెం జలాశయం సమీపంలోని క్యాప్టివ్ సీడ్ నర్సరీలో 13.08.2026న విడుదల చేసిన నాలుగు రోజుల వయస్సు గల చేప నారు ప్రస్తుతం 80 మిల్లీమీటర్ల పింగర్లింగ్ సైజుకు పెరగడంతో,పోలవరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జలాశయంలోకి సుమారు 6 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ గిరిజన మత్స్యకారుల జీవనోపాధి ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు సంక్షేమ పథకాలను మత్స్యకారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు చేపల పెంపకం,ఉత్పత్తి ద్వారా మెరుగైన ఆదాయం పొందేందుకు కృషి చేయాలని తెలిపారు మత్స్యకార సంఘ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జలాశయంలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేయడం వల్ల అవి పెరిగిన అనంతరం చేపల వేట ద్వారా ఆదాయం పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు గిరిజన మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తున్న ప్రభుత్వానికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాజమొమ్మంగి మత్స్య అభివృద్ధి అధికారి టి.వి.రవికుమార్ నెల్లిపూడి స్వర్ణ గ్రామ కార్యాలయ గ్రామ మత్స్య సహాయకులు వి.శ్రీనుబాబు దోనెలపల్లి మత్స్య సహకార సంఘ కార్యదర్శి సారపు వెంకన్న దొరతో పాటు మత్స్య సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి

-సీఐ గజేంద్రకుమార్

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటిం చాలని అడ్డతీగల సీఐ గజేంద్ర కుమార్ కోరారు. జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు ను వినియోగించుకునేలా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపడుతోందన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదా రులపై నిరంతర వాహన తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యా త్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను పర్యవేక్షిం చి అవసరమైన బైండోవర్ చర్యలు చేపట్టాలని సూచించారు.సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘా తం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని, ప్రజాస్వామ్య పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

చదువు మధ్యలో ఆపేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ పూర్తి చేసే అవకాశం

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



చదువును మధ్యలో ఆపేసిన వారు, ఉద్యోగాలు చేసుకుంటున్న వారు, వివిధ కారణాలతో పాఠశాల విద్యకు దూరమైన వారు పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) అవకాశం కల్పిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి అడ్డతీగల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలోని దూర విద్యా కేంద్రం ద్వారా ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్ ప్రభాకర్ తెలిపారు.పదో తరగతిలో చేరాలనుకునే అభ్యర్థులకు 2026 జనవరి 31 నాటికి కనీసం 14 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందాలంటే పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు అదే తేదీ నాటికి కనీసం 15 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి.విద్యార్థుల సౌలభ్యం కోసం తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో చదువుకునే అవకాశం కల్పించడంతో పాటు స్వయంగా చదువుకునేందుకు అభ్యసన సామగ్రిని అందజేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ అభ్యర్థులకు రాయితీలు వర్తిస్తాయని తెలిపారు.చదువుకోవాలనే ఆసక్తి ఉన్నవారు వయస్సు, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు వంటి కారణాలతో విద్యకు దూరం కావాల్సిన అవసరం లేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ అర్హత సాధించాలని ప్రిన్సిపాల్ కోరారు. ఆసక్తి గల వారు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.మరిన్ని వివరాలకు అడ్డతీగల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా లేదా 9441341480 నంబరులో సంప్రదించవచ్చు.

నేడు అడ్డతీగల ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



మండల ప్రజా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు, ఎంపీపీ అధ్యక్షుడు, ఉపాధ్యక్ష పదవులకు నేడు (నవంబర్ 19) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏవీవీ కుమార్ తెలిపారు. ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సభ్యులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలలోపు కో ఆప్షన్ సభ్యుడి నామినేషన్లు స్వీకరించి, మధ్యాహ్నం 1 గంటకు ఎన్నిక నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ అధ్యక్షుడు, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికల ప్రక్రియ చేపడతామని ఎంపీడీవో వెల్లడించారు.

ప్రజాభూమి

జనరల్

గురువారం, నవంబర్ 19, 2026

12

ఎన్నికల్లో వ్యయ నియంత్రణకు పటిష్ట నిఘా

- వ్యయ పరిశీలనలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయకుమార్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు మొదటి దశ నేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు నియమించిన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలు, జిల్లా నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులతో బుధవారం



వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల వ్యయ పర్యవేక్షణ ఏర్పాట్లను సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి అధికారి కచ్చితంగా పాటించాలని, ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోటీచేసే అభ్యర్థులు నిర్వహించే రోజు వారీ ఎన్నికల వ్యయ ఖాతాలను నిర్దేశిత ప్రొఫార్మాలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయ రిజిస్టర్ల నంబరింగ్, ధృవీకరణ ప్రక్రియను సక్రమంగా పూర్తిచేయాలన్నారు. అభ్యర్థుల అసలు వ్యయ రిజిస్టర్లతో అధికారులు నిర్వహించే షాడో రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సరిపోల్చి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను వీడియోగ్రాఫర్లతో సహా 24 గంటలూ అందుబాటులో ఉండేలా మోహరించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రచార ర్యాలీలు, బహిరంగ సభలు, వాహనాలు, లౌడ్ స్పీకర్ల వినియోగంపై వీడియో సర్వైలెన్స్ బృందాలు నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి జారీ చేసిన అనుమతులు, వాస్తవంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అకౌంటింగ్ బృందాలు నమోదు చేస్తున్న వ్యయాలతో సరిపోల్చి పరిశీలించాలన్నారు. ప్రతి ప్రచార కార్యక్రమానికి సంబంధించిన ఆధారాలను భద్రపరచాలని విజయకుమార్ తెలిపారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

దోష రహిత జాబితా ప్రచురణకు ముమ్మర కసరత్తు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఓటర్ల జాబితాపై ప్రత్యేకంగా దృష్టిసారించామని.. దోష రహిత జాబితా ప్రచురణకు ప్రణాళికాయుత కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ అన్నారు.ఆంధ్రప్రదేశ్ శాసనమండలి కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాపై బుధవారం ఈసీఐ అధికారులు రాష్ట్ర సీఈవో, వివిధ జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. డిసెంబర్ 23వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురించాల్సి ఉన్నందున ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై ఈసీఐ అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందిన ఫారాలు, ఆమోదించిన ఫారాలు, పెండింగ్‌లో ఉన్న ఫారాల వివరాలు తెలియజేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ డిసెంబర్ 23న ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ఆ రోజు నుంచి జనవరి 12వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ల దాఖలుకు అవకాశం ఉంటుందని, వాటిని పరిష్కరించిన అనంతరం 2027, ఫిబ్రవరి 2న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై అవగాహన కార్యక్రమాలను కూడా కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈవో ఎల్.చంద్రకళ, డీఐవో బి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై నిరంతర పర్యవేక్షణ

- డీఎంహెచ్‌వో డా. ఎ.శ్రావణ బాబు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ.శ్రావణ బాబు బుధవారం గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా సిబ్బంది హాజరు వివరాలు, రోగుల నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి లేబొరేటరీని సందర్శించి రోజువారీగా నిర్వహిస్తున్న రక్త పరీక్షల సంఖ్య, రక్త నమూనాల సేకరణ, పరీక్షల ఫలితాలను రోగులకు సకాలంలో అందిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఔషధాల విభాగాన్ని తనిఖీ చేసి మందుల లభ్యత, రోగులకు పంపిణీ చేస్తున్న మందుల వివరాలు, మందుల నిల్వ రిజిస్టర్లు, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. కనీసం మూడు నెలలకు సరిపడా మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా వ్యాధి నిరోధక టీకాల నిల్వలు, వాటిని భద్రపరిచే విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, సంబంధిత రిజిస్టర్ల నమోదు విధానాన్ని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీలో గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శృతి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుకు డిసెంబరు 23 నుండి జనవరి 12 వరకు మరో అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:


ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికలకు సంబంధించి ఓటరుగా నమోదు కావడానికి డిసెంబరు 23 నుండి జనవరి 12 వరకు మరో అవకాశం ఉంటుందని గుంటూరు - కృష్ణా ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఇ.ఆర్.ఓ మరియు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం స్థానిక ఎన్నికలపై సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఫిబ్రవరి 2వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. పూర్వ గుంటూరు, కృష్ణా జిల్లాలలో పనిచేస్తున్న ఉన్నత పాఠశాల మరియు ఆపై స్థాయిలో బోధనలో ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులన్నారు. భారత ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు స్థానిక నివాసం ఉన్నప్పుడు మాత్రమే ఓటరుగా అర్హులుగా పరిగణింపడం జరుగుతుందని



స్పష్టం చేశారు. 2026 నవంబరు 1వ తేదీకి ముందు ఆరు సంవత్సరాల నుండి వృత్తిలో కొనసాగాలని అందులో కనీసం మూడు సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల, ఆపై స్థాయిలో బోధన అనుభవం ఉండాలని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు అర్హత కలిగి ఉంటారని, వారికి జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ), కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ నిర్ధారణ చేయాలని వివరించారు. ఓటరుగా ఆన్లైన్ ద్వారా నమోదు కావచ్చని లేదా ఫారం 19 పూర్తి చేసి ఏ.ఈ.ఆర్.వోలు ఉన్న స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు సమర్పించవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు 15 వేల దరఖాస్తులు అందాయని, మొత్తం 19 వేల వరకు పనిచేస్తున్నట్లు అంచనా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెసు పార్టీ ప్రతినిధి కె.కె.గుప్తా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా.టి.సేవ కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, సి.పి.ఐ (ఎం) ప్రతినిధి కృష్ణకాంత్, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, జన సేన పార్టీ ప్రతినిధి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

అక్వాన్ తుపాను.. అప్రమత్తంగా ఉండాలి..

ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి:జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: అక్వాన్ తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ అంచనాల ప్రకారం జిల్లాపై తుపాను ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని భావిస్తున్నప్పటికీ, గతంలో తుపానుల దిశ, ప్రభావిత ప్రాంతాల అంచనాలు చివరి దశలో మారిన సందర్భాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులు తదితరులతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించి తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. రానున్న రెండు రోజుల పాటు అధికారులు, మండల స్థాయి సిబ్బంది తమ హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ప్రజలను తరలించే అవసరం లేకపోయినా, పరిస్థితులు మారితే తక్షణమే స్పందించేలా రిలీఫ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ ఆహారం, తాగునీరు, వంట ఏర్పాట్లు, మరుగుదొడ్లు తదితర సదుపాయాల కల్పనకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనవసర ఆందోళనకు గురికాకుండా, అదే సమయంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.రహదారులపై చెట్లు పడిపోతే వెంటనే తొలగించేలా ఇంజినీరింగ్ శాఖలు అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని, విద్యుత్ స్తంభాలు, లైన్లకు నష్టం వాటిల్లితే వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కారణంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా గ్రామీణ నీటి సరఫరా శాఖ తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.మత్స్యకారులు ఇప్పటికే సురక్షితంగా తిరిగి వచ్చినట్లు సమాచారం ఉన్నప్పటికీ, మత్స్యశాఖ అధికారులు తమ సిబ్బందిని, మండల స్థాయి అధికారులను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందికి అవసరమైన సూచనలు అందించి, అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసేలా సిద్ధంగా ఉండాలన్నారు.తుపాను దిశ, ప్రభావంపై గురువారం సాయంత్రం నాటికి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని, అప్పటి పరిస్థితులను బట్టి తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముందస్తు సన్నద్ధతలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, పరిస్థితులు తీవ్రతరం అయితే తక్షణమే స్పందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, ఆర్డీవోలు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

కలెక్టర్ (సివిల్ సప్లీస్), కృష్ణా జిల్లా వారి ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి, కృష్ణా జిల్లా టి.శివరామప్రసాద్ అక్వాన్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా జిల్లాలోని ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు, నిర్వాహకులు గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల సరఫరాలో ఎలాంటి కొరత ఏర్పడకుండా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.అలాగే,ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు మరియు ఇంధనాల పంపిణీలో నిరంతరాయంగా సేవలు అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు మరియు నిర్వాహకులు గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల సరఫరాలో ఎలాంటి కొరత ఏర్పడకుండాతగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజలకు అవసరమైన ఇంధనాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తుఫాను కారణంగా సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల కొరత ఏర్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు.విని



యోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన ఇంధనాలు మరియు ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా సజావుగా జరిగేలా సంబంధిత డీలర్లు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యావసర సరుకులు, రేషన్ బియ్యం, ఇంధనాల సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిఅధికారులు అప్రమత్తంగా ఉండాలని, తుఫాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా పౌరసరఫరాల అధికారి, టి.శివరామప్రసాద్ తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్ర ఇంట తీరని విషాదం

ఆప్యాయతకు మారుపేరు.. ఆతిథ్యానికి అన్నపూర్ణ.. శేష మల్లీశ్వరి కన్నుమూత



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. ఆయన సోదరి, మాజీ మంత్రి నడకుదుటి నరసింహారావు సతీమణి శేష మల్లీశ్వరి బుధవారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్ను మూశారు. ఆమె మరణవార్తతో మంత్రి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోగా, కృష్ణా జిల్లా వ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆప్యాయతకు మారు పేరుగా, ఆతిథ్యానికి అన్నపూర్ణగా పేరుగాంచిన ఆమె ఇక లేరన్న వార్త పలువురి హృదయాలను కలచివేసింది.

ఆప్యాయతకు చిరునామా.. ఆతిథ్యానికి ప్రతిరూపం..శేష మల్లీశ్వరి అంటే కేవలం ఒక కుటుంబానికి చెందిన మహిళ మాత్రమే కాదు.. తమ ఇంటి గడప తొక్కిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వచ్చిన వారి ఆకలి తీర్చి, తల్లిలా ఆదరించే మాతృమూర్తి. ఆమె ఇంటికి వెళ్లినవారికి ఆత్మీయ పలకరింపు, ప్రేమతో కూడిన ఆతిథ్యం తప్పనిసరిగా లభించేవి. వచ్చిన అతిథులు భోజనం చేయకుండా వెనుదిరగకూడదన్న తపనతో, అన్నపూర్ణాదేవిలా అందరికీ ఆహారం అందిస్తూ సంతృప్తి చెందేవారు. ఆమె చూపిన ఆప్యాయత, పంచిన ప్రేమను పొందినవారి మనసుల్లో చెరగని ముద్ర వేశారు.ఆమె భర్త నడకుదుటి నరసింహారావు మంత్రిగా పనిచేసిన సమయంలోనూ శేష మల్లీశ్వరి ఆయనకు చేదోడు వాదోడుగా నిలిచారు. రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు, కార్యకర్తలు ఇంటికి వచ్చినప్పుడు వారికి ఆతిథ్య మర్యాదలు చేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. హోదాలు, అంతస్తులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా ఆదరించడం ఆమె సహృదయతకు నిదర్శనం. ఆమె చేతి ఆతిథ్యం, ఆప్యాయమైన పలకరింపులు పరిచయస్తుల హృదయాల్లో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోనున్నాయి.

కొల్లు రవీంద్ర రాజకీయ ప్రస్థానంలో అక్కాబావల ప్రోత్సాహం..

మంత్రి కొల్లు రవీంద్రకు శేష మల్లీశ్వరి స్వయానా సోదరి. నడకుదుటి నరసింహారావు, శేష మల్లీశ్వరి దంపతులు తమ కుమార్తె నీలిమను కొల్లు రవీంద్రకు ఇచ్చి వివాహం చేశారు. ఈ బంధంతో ఇరు కుటుంబాల మధ్య ఆత్మీయ అనుబంధం మరింత బలపడింది. అక్కాబావల ప్రోత్సాహం, రాజకీయ అనుభవం, అండదండలు కొల్లు రవీంద్ర రాజకీయ ప్రస్థానానికి తోడ్పడ్డాయని ఆయన కుటుంబానికి సన్నిహితంగా ఉన్నవారు గుర్తుచేసుకుంటున్నారు.కుటుంబ బంధాలకు విలువనిస్తూ, ఆప్యాయతను పంచుతూ అందరితో కలిసిమెలిసి ఉండే శేష మల్లీశ్వరి మృతి ఆ కుటుంబానికి తీరని లోటు. ఆత్మీయతతో పలకరించే గొంతు ఇక వినిపించదన్న వాస్తవం, ప్రేమగా భోజనం వడ్డించే ఆ చేతులు ఇక కనిపించవన్న ఆలోచన ఆమెను అభిమానించే వారిని కలచివేస్తోంది. మనిషి భౌతికంగా దూరమైనా, అతడు పంచిన ప్రేమ, చూపిన ఆదరణ, మిగిల్చిన జ్ఞాపకాలు ఎన్నటికీ చెరిగిపోవు. శేష నాగ మల్లీశ్వరి జీవితం అందించిన ఆత్మీయతా విలువలు ఆమెను ఎరిగినవారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

పలువురు ప్రముఖుల సంతాపం...శేష మల్లీశ్వరి మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కుటుంబానికి ఆప్తురాలిగా, అందరినీ ఆప్యాయంగా ఆదరించే మాతృమూర్తిగా పేరొందిన ఆమె మరణం తీరని లోటని పలువురు పేర్కొన్నారు.ఒక కుటుంబానికి ఆత్మీయతను పంచిన మహిళగా, తన ఇంటి గడపకు వచ్చినవారందరికీ ప్రేమను పంచిన అన్నపూర్ణగా శేష మల్లీశ్వరి జ్ఞాపకాలు చిరకాలం నిలిచిపోనున్నాయి. ఆమె మరణంతో కొల్లు కుటుంబంలో ఏర్పడిన శూన్యతను భర్తీ చేయడం ఎవరికీ సాధ్యం కానిది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ అపార దుఃఖాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని పలువురు ప్రార్థించారు. వీరి పార్థివ దేహానికి గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కంకిపాడు మండల జడ్పీటీసీ అభ్యర్థినిగా పోటీ చేసి ప్రజల అపారమైన ఆదరణతో అఖండ విజయం సాధించిన దండమూడి పూజిత మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరిని మరియు విజయవాడ పార్లమెంటు సభ్యులు





కేశినేని శివనాథ్ (చిన్ని)ని మర్యాదపూర్వకంగా కలిశి వారి ఆశీస్సులు తీసుకున్నారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేస్తూ పార్టీ బలోపేతానికి, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.
ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

సివిల్ సప్లై హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టంచేసి ఉపాధి, సామాజిక భద్రత కల్పించాలని



ఏపీ పౌరసరఫ్రాల సంస్థ హమాలీ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు దేశవ్యాప్త పిలుపులో భాగంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు మచిలీపట్నం మార్కెట్ యార్డులో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలి కార్మికుల చే గోడ పత్రిక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టే విధంగా డిసెంబర్1 నుండి చేపట్టనున్న ఢిల్లీ ముట్టడి కార్యక్రమాన్ని సివిల్ సప్లై హమాలి కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన హమాలి కార్మికులకి పిలుపునిచ్చారు. కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వారికి కనీస వేతనం 42,000 ప్రభుత్వం నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని హమాలి కార్మికులకు సమగ్ర చట్టం సంక్షేమ కార్యక్రమాలతో కూడిన వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు తదితర డిమాండ్ల సాధనకై జరుగుతున్న పోరాటాన్ని కార్మికులందరూ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికుల యూనియన్ నాయ కుడు జొన్నలగడ్డ కృష్ణ, కె.రామాంజనేయులు తదితరం ముఠా కార్మికులు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

గురువారం 19 నవంబరు 2026

కంబల్లె సర్పంచ్ అభ్యర్థిగా ఓబులమ్మ నామినేషన్

ఎమ్మెల్సీ భూమిరెడ్డి దంపతుల మద్దతుతో భారీ ర్యాలీ - కార్యకర్తల్లో ఉత్సాహం



ప్రజా భూమి ప్రతినిధి-పులివెందుల

కంబల్లె గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చాట్ల ఓబులమ్మ బుధవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.లోమడ సచివాలయంలో నిర్వహించిన నామినేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరై ఆమెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తరలివచ్చారు. కంబల్లె గ్రామం నుంచి లోమడ వరకు భారీ ర్యాలీగా బయలుదేరి నామినేషన్ దాఖలు చేశారు. డప్పులు, పూలదండలతో కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఓబులమ్మ కృషి చేస్తారని, గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.భూమిరెడ్డి ఉమాదేవి మాట్లాడుతూ మహిళా సర్పంచ్ అభ్యర్థిగా ఓబులమ్మ గారిని గెలిపిస్తే గ్రామంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తామన్నారు. మహిళలు, రైతులు, యువత అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

అభ్యర్థి చాట్ల ఓబులమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన నాయకులకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, అందరి ఆదరాభిమానాలు చూరగొంటా నని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించడమే స్వీప్ కార్యక్రమం లక్ష్యం

- మంచి నాయకులుగా ఎదిగి రాజకీయాల్లోకి రావాలి..
- ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

స్వీప్ కార్యక్రమంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ అభినందించారు. యువత ఓటు హక్కు విలువను తెలుసుకోవడంతో పాటు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా, మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన స్వీప్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తరగతి గదిలో ముచ్చటిస్తూ ఓటు హక్కు ప్రాముఖ్యత, రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో యువత పాత్ర తదితర అంశాలపై ఆసక్తికరంగా చర్చించారు. రాబోయే 2029 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు విద్యార్థులు ఎంతమంది ఉత్సాహంగా ఉన్నారని ప్రశ్నిస్తూ వారిలో ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఓటు ఎందుకు వేయాలని విద్యార్థులను ప్రశ్నించగా, నాయకులను ఎన్నుకోవడానికి అని సమాధానమిచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమాజానికి అవసరమైన నాయకులను ఎన్నుకునే అవకాశం ప్రజలకు ఓటు హక్కు ద్వారా లభిస్తుందని వివరించారు. విద్యార్థుల్లో ఎంతమంది భవిష్యత్తులో నాయకులు, ఎమ్మెల్యేలు కావాలని ఆశిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం ఓటు హక్కును వినియోగించుకోవడమే కాకుండా, యువత రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేసి మంచి నాయకులుగా ఎదగాలని ప్రోత్సహించారు. మనమే మంచి నాయకులుగా మారి ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుంటే పదిమంది మనకు ఓటు వేసేలా చేయగలమని విద్యార్థుల కు స్ఫూర్తినిచ్చారు.

పాఠశాలలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో నిర్వహించే విద్యార్థి సంఘాల ఎన్నికలు, ఇతర ప్రజాస్వామ్య ప్రక్రియల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల ఆసక్తిని చిన్న వయస్సు నుంచే అలవర్చుకోవాలని తెలిపారు.

ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత - జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్

జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఏం జరగాలనేది నాయకులు నిర్ణయిస్తే, ఆ నాయకులు ఎవరనేది ప్రజలు తమ ఓటు ద్వారా నిర్ణయిస్తారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ డి. పృథ్వీ రాజ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్వేచ్ఛకు అడ్డొస్తే చట్టం తన పని తాను చేస్తుంది!

ఎన్నికల భద్రతకు పోలీసుల ప్రత్యేక కార్యాచరణ.. అక్రమాలపై నిరంతర నిఘా

ప్రజా భూమి ప్రతినిధి-రాజమౌమ్మంగి

ఎన్నికల సమయంలో ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోందని రాజమౌమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు రంపచోడవరం డీఎస్పీ అశ్రఫ్ అలీ



పర్యవేక్షణలో రాజమౌమ్మంగి పోలీసు యంత్రాంగం ఎన్నికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై షరీఫ్, పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నా రు.ఎన్నికలను ప్రభావితం చేసే అక్రమ నగదు, మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేం దుకు ప్రధాన రహదారులు, కీలక మార్గాల్లో తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశిం చారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలను పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, విద్వేషాలను వ్యాప్తి చేసే ప్రయత్నా లపై కూడా నిఘా కొనసాగుతుందని తెలిపా రు. ఎన్నికల పోటీ రాజకీయ పార్టీల మధ్యే ఉండాలని, దాని కారణంగా గ్రామాల్లో వ్యక్తిగత విభేదాలు, ఘర్షణలు చోటుచేసు కోకూడదని పేర్కొన్నారు.ఓటు వేయడం పౌరుడి హక్కు.. ఆ హక్కుకు రక్షణ కల్పించ డం పోలీసుల బాధ్యత. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతం గా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సన్యాసినాయుడు కోరారు.

ఫీజు బకాయిల పాపం కూటమి ప్రభుత్వానిదే..

- తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) డిమాండ్
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని).

ప్రజాభూమి ప్రతినిధి-తాడేపల్లి

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని..వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరులో ఒక ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో కరోనా కాలంలో మినహా 18 త్రైమాసికాలకు విద్యా దీవెన, వసతి దీవెన నిధులను సకాలంలో చెల్లించారని, ఎన్నికల కోడ్ వల్ల ఆగిన చివరి క్వార్టర్ నిధులు రూ. 1,800 కోట్లతో సహా వివిధ పథకాలకు రూ. 7 వేల కోట్లకు పైగా ఖజానాలో ఉంచి ప్రభుత్వాన్ని అప్పగించారని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బయట ఒక మాట, అసెంబ్లీలో మరో మాట చెబుతూ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, రూ. 12,400 కోట్ల బకాయిలకు గాను కాగ్ లెక్కల ప్రకారం కేవలం రూ. 2,800 కోట్లు మాత్రమే చెల్లించి రూ. 9,600 కోట్లు బకాయి పెట్టారని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తూ విద్యాశాఖను గాలికొదిలేసిన నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పేర్ని నాని డిమాండ్ చేశారు.

చిత్తూరు విద్యార్థిని ఘటనకు చంద్రబాబు, లోకేష్‌లే బాధ్యులు:

డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ఈ కూటమి ప్రభుత్వ ఏలుబడిలో పేద విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. చిత్తూరులోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం ఫీజుల కోసం పెట్టిన ఒత్తిడి, అవమానం భరించలేక ఒక సామాన్య కుటుంబానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయడం అత్యంత దురదృష్టకరం. జీవితం గురించి ఎన్నో కలలు కనే వయసులో ఒక ఆడపిల్ల ప్రాణం తీసుకునేంత తెగింపుకు వచ్చిందంటే దానికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ల నిర్లక్ష్యమే. ఈ ఘటనకు తండ్రీకొడుకులు ఇద్దరూ పూర్తి బాధ్యత వహించాలి. విద్యాశాఖను గాలికొదిలేసిన నారా లోకేష్‌ను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలి.

ప్రశ్నిస్తే బాబాయ్ హత్య అంటూ డైవర్షన్ పాలిటిక్స్:

ఫీజులు కట్టకపోవడం వల్ల విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తోందని, తక్షణమే బకాయిలు చెల్లించాలని వైఎస్ జగన్ గట్టిగా కోరితే సమాధానం చెప్పకుండా నారా లోకేష్ 'బాబాయ్ హత్య' అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వివేకానంద రెడ్డి గారి హత్య కేసులో వైఎస్ జగన్‌కు ఏమాత్రం సంబంధం లేదని సాక్షాత్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, సుప్రీంకోర్టు స్పష్టం చేసినా తండ్రీకొడుకులు సిగ్గు లేకుండా అబద్ధాలు ఆడుతూనే ఉన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి లాయర్లతో వాదించినా సీబీఐ ఒకటే మాట చెప్పింది. అయినా సరే తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి వైఎస్ జగన్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు.

ఖజానాలో రూ. 7 వేల కోట్లు ఉంచితే జల్సాలకు వాడేశారు:

గత ప్రభుత్వం రూ. 4 వేల కోట్లు ఫీజు బకాయిలు పెట్టిందని విద్యాశాఖ మంత్రి లోకేష్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో మొత్తం 20 క్వార్టర్లకు గాను కరోనా కాలంలో మినహా 18 క్వార్టర్లకు విద్యా దీవెన, వసతి దీవెన నిధులను క్రమం తప్పకుండా చెల్లించారు. ఎన్నికల కోడ్ రావడంతో కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వకపోవడం వల్ల చివరి క్వార్టర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 700 కోట్లు, వసతి దీవెన రూ. 1,100 కోట్లు కలిపి మొత్తం రూ. 1,800 కోట్లను ఖజానాలోనే సిద్ధంగా ఉంచారు. విద్యా దీవెన, వసతి దీవెన, ఇతర పథకాల కోసం మొత్తం రూ. 7 వేల కోట్లకు పైగా నిధులు ఖజానాలో పెట్టి ప్రభుత్వాన్ని అప్పగిస్తే, ఆ డబ్బును విద్యార్థులకు ఇవ్వకుండా పప్పుబెల్లాల్లా జల్సాలకు వాడేశారు. 2019లో చంద్రబాబు దిగిపోయేటప్పుడు ఖజానాలో కేవలం రూ. 100 కోట్లు మాత్రమే ఉంచి, రూ. 48 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిన విషయం మర్చిపోయారా? 2017-19 మధ్య రెండేళ్లకు గాను రూ. 2,006.92 కోట్ల ఫీజు బకాయిలు పెట్టి వెళ్లామని స్వయంగా లోకేష్ అసెంబ్లీలోనే అంగీకరించారు.

రూ. 9,600 కోట్ల బకాయిలు.. కాగ్ లెక్కలే నిదర్శనం:

ఈ విద్యా సంవత్సరం ముగిసే నాటికి మొత్తం 13 త్రైమాసికాలకు విద్యా దీవెన కింద రూ. 9,100 కోట్లు, మూడేళ్ల వసతి దీవెన కింద రూ. 3,300 కోట్లు కలిపి మొత్తం రూ. 12,400 కోట్లు విద్యార్థులకు చెల్లించాల్సి ఉంది. కాగా, కాగ్ నివేదిక ప్రకారం కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒకసారి రూ. 1,700 కోట్లు, మరోసారి రూ. 1,100 కోట్లు కలిపి మొత్తం రూ. 2,800 కోట్లు మాత్రమే విదిల్చింది. అంటే ఇంకా రూ. 9,600 కోట్లు పేద విద్యార్థులకు బకాయి ఉంది. బయట ఒక అంకె, అసెంబ్లీలో మరో అంకె చెబుతూ నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా కాకుండా 'అబద్ధాల శాఖ మంత్రి'గా వ్యవహరిస్తున్నారు.

వైఎస్ జగన్ 5 ఏళ్లలో విద్యారంగానికి సుమారు రూ.75 వేల కోట్లు ఖర్చు

వైయస్.జగన్ ఐదేళ్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.12,609 కోట్లు, వసతి దీవెనకు రూ.5,392 కోట్లు, యూనిఫారాలు, బ్యాగులకు రూ.3,366 కోట్లు, ట్యాబ్‌లకు రూ.1,300 కోట్లు ఖర్చు చేశారు. డిజిటల్ బోధనకు రూ.838 కోట్లు,నాడు-నేడు కింద రూ. 11,700 కోట్లతో 16 వేల స్కూళ్లను అభివృద్ధి చేసి, మొత్తంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం రూ. 75 వేల కోట్లు ఖర్చు చేశారు. విద్యారంగంలో ఇన్ని మార్పులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వారెవరు? గొప్పలు చెప్పుకుంటున్న వారెవరు? ప్రజలే తేల్చాలి.

నగలు తాకట్టు పెట్టి టీసీలు తెచ్చుకునే దుస్థితి:

ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో తల్లిదండ్రులు తమ ఇంట్లోని బంగారు నగలను తాకట్టు పెట్టి కాలేజీలకు ఫీజులు కట్టి టీసీలు తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి నేడు రాష్ట్రంలో ఏర్పడింది. బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పులు తీసుకోవడంలో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో (రూ.2.23 లక్షల కోట్లు) ఉందని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. గుంటూరు, తాడేపల్లిగూడెంలకు చెందిన ఇద్దరు కాలేజీ ఓనర్లను తెచ్చి ఫీజులు అందుతున్నాయని అబద్ధాలు చెప్పిస్తూ 'పిల్లికి ఎలుక సాక్ష్యం' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతుంటే, మరోవైపు 20 లక్షల ఉద్యోగాలు, రూ. 3 వేల నిరుద్యోగ భృతి అంటూ 'యువగళం' పేరుతో 'వంచన గళం' వినిపించి యువతను మోసం చేశారు. విద్యాశాఖను గాలికొదిలేసి, పరిశ్రమల శాఖ మంత్రిని దమ్మీ చేసి బిజినెస్ సమ్మిట్ల పేరుతో లోకేష్ పెత్తనం చెలాయిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో రక్తపాతం.. టెలీ కాన్ఫరెన్సులతో అక్రమాల పాఠాలు:

రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం గూండాలు, పోలీసులు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకుంటూ దాడులు చేసి రక్తపాతం సృష్టిస్తున్నారు. గుడివాడలో అఫిడవిట్లు పూర్తిగా ఖాళీగా ఉన్న టీడీపీ అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు ఆమోదించి నిబంధనలకు తూట్లు పొడిచారు. కౌంటింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలీసులతో బయటకు గెంటేసి, గెలిచిన అభ్యర్థుల ఓట్లను ఇన్వాలిడ్ చేసి టీడీపీ గెలిచినట్లు ప్రకటించుకుంటున్నారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, డిపాజిట్లు కూడా దక్కవని భయపడే చంద్రబాబు టెలీ కాన్ఫరెన్సుల పేరుతో గూండాలను హైర్ చేసుకోవాలని, ప్యాకేజీలతో ఏకగ్రీవాలు చేయాలని పార్టీ శ్రేణులకు అక్రమాల పాఠాలు నేర్పుతున్నారు.

అంచనా-ప్రణాళిక-అమలు ద్వారా విద్యుత్ డిమాండ్ అందుకోవాలి

- ఎంవోయూ జరిగిన ప్రతి ఎనర్జీ ప్రాజెక్టు గ్రౌండ్ అవ్వాలి
- విద్యుత్ అవసరాలకు ప్రైవేట్ సెక్టార్‌పై ఆధారపడడం తగ్గించాలి
- డిసెంబర్ నాటికి పీఎం సూర్యఘర్ 10 లక్షల లక్ష్యం చేరుకోవాలి
- గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై అత్యంత కఠిన చర్యలు
- పూర్తయ్యే సాగునీటి ప్రాజెక్టుల వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి


రాష్ట్రంలో పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్ అంచనా వేసి తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించి తక్షణం వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎల్ నినో వంటి సమస్యల కారణంగా వర్షాకాలంలో కూడా విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని... ఇలాంటి సవాళ్లను ముందుగానే అంచనా వేసుకుని ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ రంగంపై ఆ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విద్యుత్ డిమాండ్ 18.23 శాతం పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు మార్కెట్‌లో విద్యుత్ ధరలు కూడా తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం ప్రైవేటు సంస్థలపై ఆధారపడడం తగ్గించాలని సీఎం సూచించారు. దీనికోసం ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వ ప్రాజెక్టులు గ్రౌండ్ చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల్లో హామీ ఇచ్చామని...దానికి కట్టుబడి ఉన్నామని గుర్తు చేసిన సీఎం... విద్యుత్ కొనుగోలు భారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి, సరఫరా వంటి అంశాల్లో ఏఐ వంటి టెక్నాలజీని ఉపయోగించి సామర్థ్యం పెంచుకోవాలన్నారు. అప్పుడు అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరం కూడా ఉండదని సీఎం అన్నారు.

చోరీలపై కఠిన చర్యలు

విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చోరీల అంశం కూడా సమీక్షలో చర్చకు వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో, పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లు పెద్ద ఎత్తున చోరీకి గురవుతున్నాయని అధికారులు తెలిపారు. రాగి తీగలు కోసం ట్రాన్స్ ఫార్మర్లు దొంగిలిస్తున్నారని అధికారులు తెలుపగా.... ఇటువంటి చర్యలకు పాల్పడుతోన్న వారిపట్ల అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు విద్యుత్ సరఫరాలో సమస్యలకు కారణం అవుతున్న వారిని వదిలిపెట్టవద్దని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో దర్యాప్తునకు పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని... చోరీలకు పాల్పడే వారికి గట్టి గుణపాఠం చెప్పాలని సీఎం అన్నారు.

గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వేగవంతం కావాలి

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని



భారీగా పెంచే దిశగా చేపట్టిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూన్ 2024 నుంచి విద్యుత్ రంగంలో 103 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో విద్యుత్ రంగానికి సంబంధించి రూ.2.56 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు ఒప్పందాలు కార్యరూపం దాల్చడంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఎంవోయూలు చేసుకున్న ప్రతి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 కింద రాష్ట్రంలో రూ.21,838 కోట్లతో భారీ విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు వివరించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరగా టెండర్లు పిలిచి, రెండేళ్లలోగా కార్యరూపంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

36,050 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ లక్ష్యం

రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. పోలవరం పరిసర ప్రాంతాల్లో 27 పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై మరింత పరిశోధన, అధ్యయనం జరగాలని సీఎం సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉన్న మన రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకువెళ్లాలని సీఎం నిర్దేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో పాటు... సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్లపై సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాల్సి ఉందన్నారు. సోలార్ రూఫ్ టాప్‌లో నాయుడుపేట, మాచర్ల, నరసరావుపేట డివిజన్లు ముందున్నాయని అధికారులు తెలిపారు. అలాగే ఇప్పటి వరకు 7.42 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు పూర్తి చేసినట్టు అధికారులు పేర్కొనగా, 10 లక్షల లక్ష్యాన్ని డిసెంబర్ నాటికి చేరుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ పథకం కింద 224 ప్రాంతాల్లో 1,162 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల పనుల్లో పురోగతి ఉందని అధికారులు వివరించారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ 100 శాతం పూర్తి చేశామని, అలాగే సివిల్ పనులు 91 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

ప్రజాభూమి
జనరల్ 14
గురువారం 19 నవంబర్ 2026

ఘనంగా కొలుసు నితిన్ కృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు



నూజీవీడు మంత్రివర్యులు కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి తనయుడు మరియు నితిన్ సాయి కన్నకృష్ణ అధినేత శ్రీ కొలుసు నితిన్ కృష్ణ జన్మదిన వేడుకలు కూటమి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. రాత్రి: 12గంటలకు మొదటిగా చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నందు భారీ కేకును కోసి కూటమి నాయకులు కార్యకర్తలు ఘనంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకుని నితిన్ కృష్ణ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భాణా సంచుల కాంతులతో రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఒకరినొకరు స్వీట్లు పంచుకొని తన అభిమాన నాయకుడు నితిన్ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెల్లవారి నూజీవీడు మంత్రివర్యులు కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకుని తన అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూజీవీడు మున్సిపల్ చైర్పర్సన్ కూటమి నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత నవ్యాంధ్ర సృష్టికర్త మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోందని ఆయన సహాయ సహకారాలు అండదండలతో ఆశీస్సులతో నూజీవీడు పట్టణాన్ని మరియు నూజీవీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మన మంత్రి కొలుసు పార్థసారథి ముందుకుతీసుకెళ్తున్నారని. ఆయన బాటలోనే తనయుడు నితిన్ కృష్ణ ముఖ్యమంత్రి ప్రేరణతో రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు సహాయంగా నితిన్ సాయి కన్నకృష్ణన్ తరఫున ఆగిరిపల్లి మండలంలోపలు గ్రామాలను దత్తత చేసుకొని బంగారు తల్లి కుటుంబాలకు, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు మరియు ఇతర చిరు వ్యాపారస్తులకు తన వంతు సహాయంగా తోపుడు బళ్ళు మరియు పశువులు, వికలాంగుల రీసైకిల్ తన సొంత నగదుతో పేద ప్రజలకు అందజేసి. తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారని. పేద ప్రజలకు ఆర్థిక సహాయం చేసి పేదల కుటుంబాన్ని ఎంతగానో ఆదరించి ఆర్థికంగా సాయం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మనసున్న మహానాయకుడు నితిన్ కృష్ణ అని పేర్కొన్నారు. భవిష్యత్ లో మరిన్ని పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని. మరియు తండ్రికి తగ్గ తనయుడిలా రానున్న కాలంలో గొప్పనాయకుడిగా ఎదగాలని. మా అందరి ఆశీస్సులు మా అండ దండలు మా తోడ్పాటు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు కౌన్సిలర్లు పెద్ద ఎత్తున పాల్గొని తన అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పాలకొల్లులో 56 నామినేషన్లు ఉపసంహరణ

- మున్సిపల్ కమిషనర్ డి.కిరణ్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దాఖలు చేసిన 347 వార్డు సభ్యుల నామినేషన్లలో 56 మంది ఉపసంహరించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి కిరణ్ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. టిడిపి నుంచి 39 మంది, బీఎస్పీ మూడు, వైఎస్ఆర్సిపి 3 జనసేన 8 మంది, స్వతంత్ర అభ్యర్థుల ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు కమిషనర్ కిరణ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. చైర్ పర్సన్ అభ్యర్థుల నామినేషన్లు 26 మంది లో ఎవరూ కూడా ఉపసంహరించుకోలేదని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.



తొలిరోజు 70 నామినేషన్లు దాఖలు

- సర్పంచ్ పదవికి 18, వార్డు మెంబర్లకు 52 నామినేషన్లు

ప్రజా భూమి ప్రతినిధి, కాజులూరు

కాజులూరు మండల పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలిరోజు దబ్బే నామినేషన్లు 5 కేంద్రాల ద్వారా దాఖలు అయ్యాయి. ఇందులో సర్పంచ్ పదవికి 18, వార్డు మెంబర్లకు 52 మంది ఆయా చోట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచి పదవికి గాను అంద్రంగి, చేదువాడ, కాజులూరు, ఒంటితాడి గ్రామాల్లో రెండేసి చొప్పున, శెలపాక, నామవాని పాలెం గ్రామాలనుండి మూడు చోప్పున, ఆర్యావటం, బందనపూడి, కోలంక, మంజేరు, గ్రామాల నుండి ఒక్కొక్కటి చొప్పున నామినేషన్ దాఖలు అయ్యాయి. అలాగే వార్డు మెంబర్లకు గాను అంద్రంగి గ్రామం నుండి నాలుగు,శెలపాక గ్రామం నుండి 10, చేదువాడ, ఒంటితాడి గ్రామాల నుండి ఎనిమిదేసి చొప్పున, ఆర్యావటం గ్రామం నుండి 5, కాజులూరు గ్రామం నుండి 7,కోలంక గ్రామం నుండి 6, పెదలంక రెండు, గొల్లపాలెం,కుయ్యేరు గ్రామాల నుండి ఒక్కొక్కటి చొప్పున మొత్తం 52 మంది వార్డ్ మెంబర్లకు ఆయాచోట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

భక్తిభావంతో బ్రహ్మోత్సవాలకు శోభనాచలం సిద్ధం

- నేటి నుంచి ఏడు రోజులపాటు నరసింహ స్వామి సేవలో ఆధ్యాత్మిక సందడి



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్రు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుండి 25వ తేదీ వరకు ఏడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు, కృత్తికా దీపోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం స్వామివారికి నిత్యం విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు, ఆరాధనలు జరగనున్నాయి. ఉత్సవాల్లో కృత్తికా దీపోత్సవం భక్తులకు కనువిందు చేయనుంది. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య మంగళాశీస్సులు పొందాలని ఆలయ కార్యనిర్వహణాధికారి చీమల కొండ సాయి కోరారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో సమర్థవంతంగానిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతితయుత వాతావరణంలో సమర్థ వంతంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, తదుపరి నిర్వహించాల్సిన ముఖ్యమైన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.. అసిస్టెంట్ కలెక్టర్ ప్రియతో కలిసి బుధవారం కలెక్టరేట్ నుంచి మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల స్లిప్పులు పంపిణీ, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, ఎంపీటీసీ, జడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహణ వంటి అంశాలపై ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ఎటువంటి లోపాలకు తావు లేకుండా అత్యంత సమర్థ వంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోటీలో ఉండే అభ్యర్థులు, సింబల్స్ కేటాయింపు ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ను ఖరారు చేయాలన్నారు. ఎన్నికల సంఘం కేటాయించిన రిజర్వ్ గుర్తులను మాత్రమే అభ్యర్థులకుకేటాయించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడానికి వీలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాలరూపకల్పన లో అభ్యర్థుల సంఖ్యకు తగినట్లుగా ముందుగానే సరి చూసుకోవాలని సూచించారు. ఓటర్ల కు స్లిప్పుల పంపిణీకి సంబంధించిగత ఎన్నికల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీలో ఆలస్యం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈసారి ఆ పరిస్థితి పునరావృతం కారాదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.పోలింగ్ కు కనీసం మూడు రోజుల ముందే ఓటర్లందరికీ స్లిప్పులు అందేలా చూసుకోవాలి. పోలింగ్ కేంద్రాల వారీగా ఏఎస్డీ (గైర్హాజరైనవారు, వలస వెళ్లినవారు, మరణించినవారు, డూప్లికేట్) జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఈ పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు బీఎల్ఓలతో పాటు ఇతర సిబ్బందిని కూడా వినియోగించుకుని ప్రతి ఇంటికి స్లిప్పులు అందేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే ప్రాంగణంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నచోట ఓటర్ల సౌలభ్యం కోసం తప్పనిసరిగా ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించి ముందస్తుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీల వారీగా నిర్ణయించిన కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టాలన్నారు.వార్డుల సంఖ్యకు సరిపడే విధంగా లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేసి, ఒకే రౌండ్‌లో కౌంటింగ్ పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, లెక్కింపు కేంద్రాల్లో తగినన్ని గదులు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను 24వ తేదీన పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అర్హులైన ఉద్యోగులకు సకాలంలో బ్యాలెట్ పత్రాలు అందేలా చూడాలని,కవర్లపై తప్పులు తడకలు లేకుండా సంబంధిత వార్డు, పంచాయతీ వివరాలు స్పష్టంగా రాసివ్వాలని, లేనిపక్షంలో బ్యాలెట్లు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.24వ తేదీ సాయంత్రానికల్లా మార్క్డ్ కాపీలను సిద్ధం చేసి, తదుపరి డిస్పాచ్ సమయానికి పోలీసులకు అందించాలని ఆదేశించారు.

భోజన వసతి, రిఫ్రెష్మెంట్లు

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి భోజన సదుపాయాలు, త్రాగునీరు సకాలంలో అందేలా తగిన బడ్జెట్ కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి అలసత్వానికి తావులేకుండా మండలాల వారీగా పంపిణీ బాధ్యత లను ముందుగానే ప్లాన్ చేసుకోవాలనిసూచించారు. వీడియో గ్రాఫి,ఇతర నిబంధనలుఎన్నికల పర్యవేక్షణ కోసం నిబంధన ల ప్రకారం వీడియోగ్రఫీ ఏర్పాట్లు చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు జారీ చేసే పాస్‌ల విషయంలోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతం గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 19, 20 తేదీలలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి జారీ చేసిన నియమ నిబంధనలపై రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు) పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని,ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది అత్యంత బాధ్యతా యుతంగా వ్యవహరించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్
- 66 వార్డుల కార్పొరేటర్లు, ఒక మేయర్ స్థానాలకు నెల 26న పోలింగ్,30న ఓట్ల లెక్కింపు
- నగర ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలను అత్యంత బాధ్యతాయుతంగా పని చేసి,ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి బుధవారం కాకినాడ పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగు తున్న ఎన్నికల అధికారుల (పీవో, ఏపీవో) శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థ పరిధి లోని 66 వార్డుల కార్పొరేటర్ స్థానాలకు,ఒక మేయర్ స్థానానికి ఈ నెల 26న ప్రత్యక్ష ఎన్నికలు జరగనున్నాయనన్నారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 306 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాన్నామని, రాబోయే 26వ తేదీన పోలింగ్,30వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుందని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ కోసం సుమారు 732 మంది సిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉదయం పూట తరగతి గది బోధన, మధ్యాహ్నం పూట ప్రత్యక్ష ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సులను ఏ విధంగా సీల్ చేయాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అలాగే ఎన్నికల పత్రాలు, చట్టబద్ధమైన సామాగ్రిని ఏ విధంగా నిర్వహించాలి అనే అంశాలపై పూర్తి స్థాయిలో శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ దగ్గర నుంచి, పోలింగ్ ప్రక్రియ పూర్తి చేసుకొని రిసెప్షన్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులు అప్పగించేంత వరకు సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాముఖ్యంగాడిస్ట్రిబ్యూషన్ సెంటర్ లోనే పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన బ్యాలెట్ పత్రాలు,ఓటరు జాబితా పత్రాలను,బ్యాలెట్ బాక్సులను తప్పనిసరిగా ముందుగానే సరిచూసు కోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాల లెక్కలు, పీవో డైరీ,చాలెంజింగ్, టెండర్ ఓట్లు వంటి అంశాలపై ఎటువంటి అనుమానాలకు తావివ్వకుండా ఈ శిక్షణ కార్యక్రమంలోనే పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన పెంపొందించు కోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఇక్కడే నివృత్తి చేసుకొని పోలింగ్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కాకినాడ నగరంలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో నగర ప్రజలందరూ ఎక్కువ సంఖ్యలో ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల ద్వారా తమ ప్రజాప్రతినిధిని ఎన్నుకొని, మన కాకినాడ నగరం యొక్క అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసు,పిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెహర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పట్టం కట్టండి

- చైర్ పర్సన్ అభ్యర్థిని ఉషారాణి,14 వ వార్డు అభ్యర్థి అంజిబాబు విజ్ఞప్తి

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామా నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కూటమి పార్టీ చైర్పర్సన్ అభ్యర్థిని ఆబోతుల ఉషారాణి, 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చెరుకూరి అంజి బాబు,ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం 14వ వార్డులో కూటమి పార్టీ చైర్పర్సన్ అభ్యర్థిణి ఉషారాణి, 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చెరుకూరి అంజి బాబు మున్సిపల్ సీపీ,కౌన్సిలర్ ఎన్నికల సందర్భంగా కూట మి నాయకులు, కార్యకర్తలుతో కలిసి ఇంటింటా తిరిగి ఓటర్లను స్వయంగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. చైర్పర్సన్గా ఆబోతుల ఉషారాణి అయిన తనకు, కౌన్సిలర్గా అంజిబాబు కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట కూటమి నాయకులు బోసం నాని, పెండ్యాల గంగ భవాని, విగ్నేశ్వర రావు, ఉల్లంపర్తి వెంకటేశ్వరరావు, బోలిశెట్టి రావులియ్య, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడల్లో అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిని గడించాలి

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా.



క్రీడలలో మన జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఆసియా క్రీడల్లో ఇండియా తరుపున పాల్గొని స్విమ్మింగ్ విభాగంలో మూడు పథకాలు సాధించి, 2028 లో లాస్ ఏంజిల్స్లో జరగనున్న పారా వొలింపక్ క్రీడలకు కూడా అర్హత సాధించిన జంగారెడ్డిగూడెంనకు చెందిన పారా స్విమ్మర్ బుడిగిన. రవి వీర వెంకట భవాని కార్తీక్ ని స్థానిక కలెక్టరేట్ లో బుధవారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దుశ్శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందించి అభినందించారు. బుడిగిన రవి వీర వెంకట భవాని కార్తీక్ ఆయన తల్లిదండ్రులతో కలసి జిల్లా కలెక్టరు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భవాని కార్తీక్ జపాన్లోని ఐచి-నగోయాలో 2026 అక్టోబర్ 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు నిర్వహించిన 5వ పారా ఆసియా క్రీడల్లో ఇండియా తరుపున పాల్గొని స్విమ్మింగ్ విభాగంలో 100 మీటర్ల ఫ్రీస్టైల్ స్విమ్మింగ్ లో -- రజత పతకం, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ స్విమ్మింగ్ లో రజత పతకం, 50 మీటర్ల ఫ్రీస్టైల్ స్విమ్మింగ్ లో కాంస్య పతకం మూడు పథకాలు సాధించడం మరియు 2028 లో లాస్ ఏంజిల్స్లో జరగనున్న పారా వొలింపక్ క్రీడలకు కూడా అర్హత సాధించడం, అంతేకాక ఇటీవల భోపాల్ జరిగిన సీనియర్ నేషనల్ పారా స్విమ్మింగ్ విభాగములో 3 గోల్డ్ మెడల్స్ సాదించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా డిసెంబరు 3 వ తేదీ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24వ తేదీన అల్లూరి సీతారామ రాజు స్టేడియం లో జరగబోవు జిల్లా స్థాయి దివ్యాంగ బాలురు మరియు బాలికలకు పారా స్పోర్ట్స్ -2026 ఎంపికల పోస్టర్ ని జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. జిల్లా పారా అసోసియేషన్ సభ్యులు జాకబ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యస్. ఏ. అజీజ్ పాల్గొన్నారు.